

ఆంధ్రప్రదేశ్




సంపుటి 5 సంచిక 12

అక్టోబరు, 1961

ఆశ్వయుజ-కార్తీక 1883 శకము



భారత రక్షణశాఖ మంత్రి శ్రీ వి.కె. కృష్ణమీనన్, 1961 ఆగస్టు 27 వ తేదీన సికింద్రాబాదులో
ఎన్ సి.సి. ప్రదర్శనలను తిలకించారు



రాష్ట్ర అభివృద్ధి ఋణానికి పరిమితిని మించి మొత్తాల వసూళ్లు: రూ. 10 కోట్ల రాష్ట్ర అభివృద్ధి ఋణానికి మొత్తాలు చెల్లించడానికై ఖమ్మంలోని స్టేట్ బ్యాంక్ శాఖవద్ద ఆరంభదినాన పెట్టుబడిదార్లు బారులు తీర్చి నుంచున్న దృశ్యం.

ఆంధ్రప్రదేశ్

సంపుటి 5 | అక్టోబరు 1961 ఆశ్వయుజ-కార్తీక 1883 శకము | సంచిక 12

విషయసూచిక

ముఖచిత్రం:— జాతిపిత

వెనుక అట్ట:— మచ్చల జింకలు (వన్యమృగ సంరక్షణవారం అక్టోబరులో జరుపబడుతుంది)

చందా వివరాలు

సంవత్సరానికి	—	3 రూపాయలు
విడి ప్రతి వెల	—	25 నయాపైసలు

Edited & Published by the Director of Information & Public Relations, Andhra Pradesh, Hyderabad-1
Printed at Vir Milap Press, Mukarramjahi Road, Hyderabad-

* నవరత్నమాల

బూర్గుల రామకృష్ణారావు

శ్రీమదోంకారపంజరిఁ జిలుకరాణి
నుపనిషత్కేళికావని నుండుపికము
నాగమాటవిఁ బురివిచ్చి యాడునెమలి
నంబ నార్యామహాదేవి నాత్మఁ దలఁతు,

కనికరం బొల్కు వాల్చూపు తెనయుతల్లి
గురువు రూపాన శుభములఁ గూర్చు జనని
వామకుచపాళి వీణియ వరలునంబ
మాత వరదాత్రి సంగీతమాతఁ గొలుతు.

శ్యామలిమ సౌకుమార్యను
నామోదామందసంపదతిరుచిరాంగిన్
గోమల తారుణ్యకృపా
ధామన్ మదలహరినేత్రఁ దలఁచి యెరఁగుదున్.

గోటి కొనమీటునన్ వీణె గులుకు రవళి
చవులకుం జొక్కి నవనవచ్ఛవులఁ గులుకు
మోడిముత్యాల కమ్మల మొలకనవ్వు
లొలుకు నీమోము నా కింపుఁ గొలుపు నంబ.

సరిగమపద నిరతమనో
హరవీణా క్రాంత కాంతహస్తాంతను ని
ర్భరకరుణా స్వాంతను గుచ
భరతాంతన్ గొల్తు శాంతఁ బరశివకాంతన్.

---

* శ్రీ కాళిదాస మహాకవి నవరత్నమాలకు అనువాదము.

చెవి నొరఁగి యొప్పు పెనుకొప్పు చెలువుదానిఁ
బండు తాటాకు గులుకు చెవ్వాకుదాని
వీణె మీటుచుఁ దలను గంపించుదాని
మాత మాతంగ కన్య నమస్కరింతు.

క్రమ వీణారవానుషంగమ్ము-వికచ
మదపరీమళమాధురీమత్తభృంగ
మతులకరుణాతరంగమ్ము నాత్మఁ దలఁతు
వరదమాతంగకన్యకాపాంగ మెపుడు.

నీలసుందరమణిభంగనిభశుభాంగి
మధురసంగీతవారిజోన్మత్త భృంగి
యౌవనోద్యానసారంగి నాత్మఁ బొంగి
సిద్ధమాతంగిఁ మాతంగిఁ జేరి కొలుతు.

అంబ! మిథ్యకు దృష్టాంత మైన నడుము
ఇంద్ర నీలరుచిం దనియించు మేను
బరమమంగళ సంగీతపరిమళముగ
వరలునీదు స్వరూప వైభవముఁ దలఁతు.

నవరత్న మాలికాఖ్య
స్తవ మిది మాతంగకన్య దాలుచునగ యో
నవనిం జదువునో వ్రాయునో
యెవఁ డాతఁడు వాగధీశుఁడే యయి వరలున్.

జీవిత చరిత్ర

స్వర్గీయ ఆచార్య కురుగంటి సీతారామయ్య

ఇప్పుడు నూతన ప్రక్రియలని వేటివేటిని అనుకొంటు న్నామో వాటి ఛాయలు వెనుకటి సాహిత్యంలో లేవని చెప్పజాలం. కాని ఆప్రక్రియలను పూర్వులు సాధించలేదు. అప్పుడు వారి కాలంలో ప్రజాదరణను పొంది ప్రచారంలో ఉన్న స్థూల ప్రక్రియల్నే వారు సాధించారు. అంత మాత్రంచేత వీటిని సాధించడంలో వారికి సామర్థ్యం లేదని చెప్పరాదు. పురాణకాలంలో తిక్కన తలచిన, సాధించరాని ప్రక్రియ ఉండునా? తర్వాతి కాలంలో శ్రీనాథుడు సాధించరాని ప్రక్రియ ఉండునా? అట్లే పెద్దనాదులు తలచిన ఎట్టి ప్రక్రియా రచనలోనైనా ఉత్తము లనిపించుకొనే వారే!

జీవిత చరిత్రను రెండు భాగాలుగా విభజింపవచ్చు జీవిత చరిత్ర, స్వీయచరిత్ర, అని. వీటి ఛాయలు మన సాహిత్యంలో ప్రథమంనుంచీ కనుపడుతునే ఉన్నవి. జీవిత చరిత్రను ఆంగ్ల సాహిత్యవేత్తలు ఈ విధంగా నిర్వచించారు:

"Biography is the artistic representation in continuous narrative of life and character of a particular individual".

అనగా ఒక వ్యక్తియొక్క జీవిత శీలాల రసవచ్చిత్రణ మన్నమాట. రసవచ్చిత్రణ మన్నప్పుడు ఆరసవత్త—సత్వానికీ, సాముదాయకత్వానికీ దూరం కాకూడదు. జీవితం సత్యంగానూ సంపూర్ణంగానూ చిత్రించవలెనని దీనివల్ల తేలుతున్నది. ఒకవ్యక్తి జీవితములో మంచిచెడ్డలు చిత్రించవలెనన్నమాట. మంచిని చిత్రించి చెడ్డను విడువరాదు. మఱియు ఆచిత్రణము రసవంతమై ఉండవలె. రసవంతముకాకపోతే రసమే ముఖ్యజీవితంగా కలిగిన సాహిత్య ప్రక్రియలలో అది ఒకటి కాజాలదు. కాబట్టే ఆంగ్ల సాహిత్యవేత్తలు ఇలాఅన్నారు:

"Its success or failure mainly depends upon the degree of truth and complextion with which the image is represented".

ఒకవ్యక్తి జీవిత రహస్యం కొన్ని భిన్న సంఘటనలవలన బయల్పడవచ్చును. కాబట్టి చిత్రకారుడు ఆవ్యక్తి జీవితంలోని భిన్నసంఘటనలను వదిలివేయకూడదు. వాటిపైననే ఆవ్యక్తి శీలం ఆధారపడి యుండవచ్చును. వ్యక్తి జీవిత రహస్యాలనూ, శీలాన్నీ రసవంతంగా చిత్రించకపోతే దానికి కావ్యత్వంరాదు. Plutarch అను ప్రాచీన సాహిత్య వేత్త జీవిత చరిత్రకారులలో ఉత్తముడని కొనియాడబడుచున్నాడు. ఆయన ఒకచోట:—

"But very often an action of small note, a short saying, or a jest, shall distinguish a person's real character more than the greatest sieges and most important battles"

ఈకారణం చేతనే ఆంగ్లంలో ఉన్న జీవిత చరిత్రలలో బాస్వెల్ రచించిన జాన్సన్ జీవిత చరిత్ర ఉత్తమమైనదని అంటారు.

జీవిత చరిత్ర వ్రాయుకవికి నాయకుడి జీవితంతోనూ మిక్కిలి సన్నిహిత సంబంధముంటేనేగాని, ఆవ్యక్తి జీవితం వివిధవివరాలతోనూ ప్రవేశించి ఆవ్యక్తిజీవితాన్ని సంపూర్ణంగానూ సత్యంగానూ చిత్రింపజాలడు. మఱియు కవికి కావలసిన శక్తి మొదలైన సామాగ్రికూడా ఉండవలెను. లేకపోయిన రసవంతంగా చిత్రింపజాలడు. కవిత్వ నిర్వచనాన్ని కూడా పోల్చి చూడండి.

"Poetry is the artistic expression of human mind in emotional and rhythmical language".

జీవిత చిత్రకారుడు చిత్రించునదికూడా మానవ హృదయమే! ఆచిత్రణ రసవంతముగా ఉండవలెను. కాబట్టే ఉత్తమ జీవితచరిత్ర ఉత్తమకావ్యంగా పరిగణించారు సాహిత్యవేత్తలు. కేవలభూషణగాని, కేవల దూషణగాని జీవితచరిత్రలో ఉండటానికి అవకాశంలేదు. ఈరెండిటి వలన నాయకుడి శీలం బయట పడదు. వ్రాయసకాడి వ్యక్తి సంకుచితత్వంకూడ నాయకుడి శీల గ్రహణానికి అడ్డు తగులుతుంది. అటువంటప్పుడు అట్టిది ప్రశంసాకావ్యమైనా దూషణ కావ్యమైన అవుతుందే కాని జీవిత చరిత్ర కాజాలదు.

మన ప్రాచీన కవులు, మధ్యకవులు తమకృతి పతులను తమ కావ్యాల్లో వర్ణించారు. వాటిలో తప్పక జీవిత చరిత్ర ఛాయ లున్నప్పటికీ వాటిలో ప్రశంసే ముఖ్యంగా ఉండటంచేత వాటికి కావ్యత్వమే కద్దుకాని జీవిత చరిత్రత్వం ఉండడానికి వీలులేదు. అల్లసాని పెద్దన మను చరిత్ర పీఠికలో వ్రాసిన కృష్ణరాయల వంశంయొక్క జైత్రయాత్రయొక్క ప్రశంస కొంతవరకు జీవిత చరిత్ర ఛాయలున్నా దాన్ని ప్రత్యేక ప్రక్రియగా గ్రహించడానికి ఎంత మాత్రము వీలులేదు. ఆంధ్ర సాహిత్యంలో వెనుకటి కాలంలో యెక్కడనో 'కృష్ణరాయల విజయం' వంటి చారిత్రక ప్రబంధాలు అరుదుగా కన్పడుతవి. నరసభూపాలీయాన్ని తలిస్తే కవి ఉద్దేశ్యం లక్షణ గ్రంథం వ్రాయడమేకాని నరసభూపాలుని జీవిత చిత్రణకాదు.

దేశచరిత్రమనగా వ్యక్తుల చరిత్ర పరంపరేనని ఒక వాడుక ఉంది. దానిలో కొంత సత్యం లేకపోలేదు. కాని వ్యక్తులకూ కాలానికీ అవినాభావ సంబంధం ఉంది. కాలాన్ని వ్యక్తులు మారుస్తారు. కాలం వ్యక్తులపై ప్రభావం కలిగి ఉంటుంది. అందుచేతనే "రాజాకాలస్యకారణం" అని పెద్దలంటారు. వ్యక్తుల పరిసరాలు కూడా వ్యక్తుల జీవితశీలాలపై ప్రోద్బలం కలుగ చేస్తుంది. కాబట్టి జీవితచరిత్ర వ్రాయు కవి పైవిషయాలనన్నీ తప్పక ఆలోచించవలసి యుంటుంది. నిజమైన జీవిత చరిత్ర కావాలంటే ఆధునిక యుగందగ్గరకే రావాల్సి వస్తూంది, అంటే వీరేశలింగం గారి కాలానికి అన్నమాట.

కందుకూరి వీరేశలింగంగారు తమ స్వీయచరిత్రలో తామే మొదటి నవలను, మొదటి జీవిత చరిత్రనూ మొదలైన వాటిని వ్రాసి నామని చెప్పుకొన్నారు. ఇది సంపూర్ణ సత్యమూ అని మనం పరీక్షించవద్దు. వారివాక్యాలనే తీసుకొందాం సత్యంగా. ఈ కాలం నుంచీ యిప్పటి వరకూ వ్రాసిన జీవిత చరిత్రలనన్నింటినీ పరిశీలిస్తే వీటిలో స్వతంత్రాలు చాల తక్కువగా ఉన్నవి. దాదాపు అన్నీ అనువాదాలుగనే ఉన్నవి. ఏ ఒకటి రెండోతప్ప. పుస్తకాలపట్టిక చూస్తే మహాపురుషుల జీవితచరిత్రలనీ యింకా యితర దేశనాయకుల జీవితచరిత్రలనీ కనిపిస్తవి. అవి అన్నీ కూడా ఆంగ్లంనుంచో మరే యితర భాషలోనుంచో అనువాదాలే. వాటిని బట్టి రచయితల శక్తిసామర్థ్యాల్నీ, చరిత్రల ప్రాశస్త్యాన్నీ విమర్శించడానికి ఎంతమాత్రం వీలులేదు. ఆ అనువాదాలైనా చెప్పుకోతగ్గవిగా కనబడవు.

వీరేశలింగంగారు కవుల జీవితచరిత్రలను రచించారు. వీటిని జీవిత చరిత్రలని చెప్పడానికి వీలున్నదని నాకు తోచదు. దేశంలో ఉన్న కథలు, ఇతర శాసనాధారాలు మొదలైన వాటినిగొని వ్రాసినవి—ఇవిఅన్నీని కవులతో సాక్షాత్సంబంధము లేక, వారి జీవితాలను, వాటిలోని కొన్ని అంశాలపై ఉన్న గాథలను గొని వ్రాసినవి యివి వెనుక మనం చెప్పుకొన్న నిర్వచనం క్రిందికిరావు. అంత మాత్రంచేత వాటిని గ్రంథస్థాలు చేసి నవారిని జీవితచరిత్రకారులందుమా? "Biography of Telugu poets" అనగా ఆంధ్రకవి జీవితములు అనిగ్రంథనామ మున్నంత మాత్రాన అవి జీవితచరిత్ర లవుతాయా? వ్రాయసగాడికి నాయకుడికి కావలసిన సన్నిహిత సంబంధం వాటిలోలేదు. అందుచేత వాటిలోని అంశాలకు సత్యత్వమూ, సంపూర్ణత్వమూ కూడా కొరవడింది. కాబట్టి వాటినీ జీవితానువాదాలనూ కూడా మనం యీ ప్రక్రియారచనలలోనుంచి తొలిగించివేయ వలసినదే.

ఒక్కదానిని గూర్చి ముచ్చటిస్తాను. హైదరాబాదు వాస్తవ్యులు శ్రీ సురవరంప్రతాపరెడ్డిగారు రావుబహద్దూర్ వెంకటరామా రెడ్డిగారి జీవిత చరిత్ర వ్రాసినారు. జీవిత చరిత్రగా ఎన్నదగిన ముఖ్యమైనవాటిలో ఇది యొకటేనని చెప్పి తీరవలెను. శ్రీ వెంకటరామారెడ్డిగారు పోలీసుజవాను పదవినుంచి హైదరాబాదు నగరపోలీసు కమీషనర్ పదవి వరకు ప్రాకి, నిజాంకు మిత్రులై, హైదరాబాదు జీవితంలో ప్రాముఖ్యం వహించి తమకులానికి చాలా సేవచేసిన వ్యక్తి కాబట్టి ఆయన జీవితం ఫలవంతమైనదే. ఆయనదేమిటి? వ్రాయగలిగితే ప్రతివాడి జీవితంలో రసవంతమైన విషయాలుంటవి. శ్రీప్రతాపరెడ్డిగారు సకులీనుడూ సమకాలికుడు అవటంచేత ఆయనకు జీవిత చరిత్ర వ్రాయడానికి కావల్సిన సామగ్రి అంతా ఉంది కాని చాల అభిమానంతో వ్రాసినట్లే ఉన్నది గాని, మంచి చెడ్డలు చూపుతూ వ్రాసినట్లు కనబడదు. కాబట్టి యిది ప్రశంసా గ్రంథమేనని చెప్పవచ్చును

ఒక్క విషయం వివరిస్తాను. "రావు బహద్దూర్ గారు హైదరాబాదు సునందన వనంలో కల్పవృక్ష" మన్నారు దీనిని అలంకారంగా గ్రహించవలెనేగాని, సత్యంగా గ్రహించడానికి వీలు లేదు. ఒక అడవిలో పండ్లుపండే వృక్షమనే గ్రహించ వలెను. గాని, హైదరాబాదుకూ నందన వనానికీ, శ్రీ రావు బహద్దూర్ గారికీకల్పవృక్షానికి సమాన ధర్మం ఎక్కువగా లేదు వారు కొందరికి సహాయం చేసి ఉందురు. కావ్య మన్నపుడు సార్వకాలీనతా, సార్వ జనీనత యుండవలె. ఆంగ్లంలో జాన్సన్ జీవిత చరిత్రను చూడండి. ఏనాడు బాస్వెల్ రచించాడో—యిప్పటికీ రమణీయత కాస్పదమై యున్నది. కాని శ్రీ రెడ్డిగారి పుస్తకం ఉన్నదని కూడ హైదరాబాదులో కొంత మందికే తెలుసుగాని అందరికీ తెలియదు.

సవర్కరు జీవితం వంటి వాటికి స్థానమే లేదు. తుదకు మన ఆంధ్ర నాయకులైన డా. పట్టాభి, ఆంధ్రకేసరి ప్రకాశం మొదలైన వారి చరిత్రలుకూడా చెప్పుకొన తగ్గవిగా కనుపడవు వారు రాష్ట్రపతులైనప్పుడు, మంత్రులైనప్పుడు ప్రశంస కోసమే వ్రాసినట్లున్నవే గాని సాహిత్యంలో స్థాన మాక్రమించ సమర్థులైనట్లు కానరాదు. ఇది జీవిత చరిత్రల ఉదంతం ఇప్పటికిని మన సాహిత్యంలో స్వతంత్రమైన నిర్వచనానికి సరిపోయినట్లు వ్రాయబడిన సాహిత్య ప్రక్రియగా యెన్నదగిన జీవిత చరిత్ర లేదనియే చెప్పిన నేను పొరపడలేదని తలుస్తున్నాను.

ఇక స్వీయచరిత్ర—శ్రీనాథుడు, పోతన, పెద్దన, ధూర్జటి మొదలైనవారి రచనలలో స్వీయచరిత్ర ఛాయలున్న వనటం నిశ్చయం.

"కవిరాజు కంఠంబు"—"కాశికా విశ్వేశు"—
ఎదురైనచోదన-మదకరీంద్రము"—
"కాయల్గాచె వధూనఖాగ్రములచే"—

మొదలైన వాటిలో తప్పక వారి శీల చిత్రణమున్నది. కాని యిది చాలదు. సాహిత్య చరిత్రలో స్వీయ చరిత్రకు మిక్కిలి ఉన్నత స్థానమున్నది. ఒక వ్యక్తి తన జీవిత గాథను, అందున్న రహస్యాలను దాచకుండా పూర్తిగా సత్య దృష్టితో చెప్పటంకంటె విశేష కార్యమున్నదా? తన జీవితంలో రహస్యం లేకుండ బయటపెట్టగల వారు తప్పకమహనీయులే! తనలోపాలు దాచుకొని, యితరుల లోపాలు ఎత్తి చూపించడం మానవ సహజం. "తప్పులెన్నువారు" అనే వేమన పద్యం సత్యాతి సత్యం కాబట్టి తన లోపాలను తెలుసుకొనేవారు గొప్పవారు. వాటని బయట పెట్టేవారు మహనీయులు. ఒకప్పుడు కల్పితంకంటే సత్యకథనం రసవంతంగా ఉంటుంది. అందుకనే ఉన్నదున్నట్లు, కన్నది కన్నట్లు, ఊహించింది ఊహించినట్లు చెప్పడమే కవిచేసే కార్యం. ఈ పని అందరూ చేయ తగిందికాదు. ఆత్మజ్ఞానమే మోక్ష సాధనం. ఆ ఆత్మజ్ఞాని తన జీవితం తాను చెప్పుకుంటే అంతకంటే ఉత్తేజకరమైన విషయం ఉంటుందా? మానవుడికి సహజంగా ప్రదర్శనా సక్తి, అహంకారం, కీర్తి కాముకత్వం, పొగడ్త మీద యిష్టం, స్వోత్కర్షా కథనం, మొదలైన గుణాలు ఉన్నై వీటన్నింటినీ ప్రక్కకుంచి, చదివిన వారు, ఆ వ్యక్తిని తెలిసినవారు, ఈయన సత్యాన్నే వ్రాసినాడు అనడంకంటె స్వీయ చరిత్రకు చరితార్థము లేదు, హ్యూమ్ అనే ఆంగ్ల విజ్ఞాని తన స్వీయచరిత్రను వ్రాసుకొంటూ :

"It is difficult for a man to speak long of himself withont vanity and therefore I shall be short" అని వ్రాసినాడు. ఇది పరమ సత్యం. తనను మెచ్చుకొంటే తన్నుకున్నట్టే ఉంటుందని సామెత. ఆత్మస్తుతి స్వపర వంచకం కాబట్టి స్వీయచరిత్ర రచన కత్తిమీద సామువంటిది. ఒక ఉదాహరణ. శ్రీ వీరేశలింగం పంతులు గారు తమ "స్వీయచరిత్ర" లో తాము జీవితంలో మూడే అబద్ధాలాడినానని చెప్పుకొన్నారు. వీరికి చిరశత్రువైన శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు వెంటనే వీరేశలింగంగారు లెక్కలేనన్ని అసత్యాలు పలికినారని పత్రికలో ప్రకటించారు. స్వీయచరిత్ర వ్రాసుకొన్న ఆంధ్రులలో ఉత్తము లైనట్టియు సచ్ఛీలవంతులని ప్రసిద్ధి వడసినట్టియు వీరేశలింగంగారి స్వీయచరిత్రకే యిట్టిలోపం ఆపాదిస్తే యితరుల వాటికింక చెప్పనేటికి? మొగలాయీ చక్రవర్తి అయిన బాబరు వ్రాసుకొన్న స్వీయచరిత్ర ప్రపంచంలో ఉత్తమమైన స్వీయచరిత్రగా ప్రసిద్ధి పొందింది. ఇటీవల స్వీయచరిత్రలలో మహాత్మాగాంధి స్వీయచరిత్రకు ప్రపంచ విఖ్యాతి వచ్చింది. దానికి పేరే సత్యాన్వేషణమని పెట్టినారు. మహాత్మా గాంధి జీవితం ఒక బహిరంగ గాథ ఆయన యెట్టి రహస్యమును దాచుకోలేదు. అది చదువుతూ ఉంటే రసవత్తరమైన గ్రంథం చదువుతూన్నట్టే ఉంటుంది. ఒక పెట్టె తెరచి మనకు కావల్సిన వస్తువులను సేకరించి నట్లుంటుంది. ఇది ఒక మణిపేటిక. అందలి సూక్తి మణులు మానవ హృదయము అలంకరింప దగినవి. సత్యము, సంపూర్ణత కలిగి మహాత్మాగాంధి శీలం అద్దమున కట్టినట్లు కనపడుతుంది. ఇది స్వీయచరిత్రలకు ఆదర్శ ప్రాయం. ఆంధ్రానువాదము మాతృకతో పోలిస్తే దివిటీముందు దీపమవుతుంది. పండిత

నెహ్రూ స్వీయచరిత్రకూడా ప్రపంచ విఖ్యాతి పొందింది. కాని అది చదువుతూంటే ఒక కావ్యం చదువుతున్నట్లుంటుందే కాని పావిత్ర్యం కొరత పడుతుంది. అది కూడా చెప్పుకోదగినదే ననటంలో సందేహం లేదు. ఇదికూడా తెనుగులోకి వచ్చింది.

మన సాహిత్యంలోకి వస్తే మనకు తట్టేవి మూడు నాలుగు స్వీయచరిత్రలు. మొదటిది వీరేశలింగం గారిది. అది చక్కని సులభమైన శైలిలో ఉండి, తత్కాలంలో ఉండే సంఘపరిస్థితులనూ, ఆచార్య వ్యవహారాలనూ, సంకుచిత హృదయాలనూ, సంస్కార వైముఖ్యాన్నీ, మతోన్మాదాన్నీ తెలుపుతూ ఆ కాలంలో సంచరిస్తూన్నట్టు స్ఫురిస్తూ ఉంటుంది. తర్వాతది చిలకమర్తి లక్ష్మీ నృసింహ కవిగారిది. ఇది వారి సహజ హాస్య ధోరణితో వీరేశలింగంగారి దానికి సోదర ప్రాయంగా ఉంది. వీరేశలింగం గారి దానికంటె యిది చిన్నది. దాని సంపూర్ణత, దాని సర్వతో ముఖత దీనికి లేదు. అప్పటి సన్నివేశాలనూ, తెలిపే గాథలూ, సంభాషణలూ, అంత విరివిగా లేవు, వీటి రెంటిలోకూడా బ్రహ్మ సమాజ తత్వమూ, సంఘ సంస్కార తత్వమూ నిండి ఉంటుంది. హిందూ మతంమీదా, సంఘంమీదా ఒక విధమైన నైరాస్యం కలిగించే గుణమున్నది. ఇద్దరూ కూడా తాము సంఘాన్ని ఉద్ధరిస్తున్నామనే, అందులో వీరేశలింగంగారు మరీ యెక్కువగా, అహం ప్రత్యయంతో నిండి ఉంటవి. స్వీయ చరిత్రలో అహం ప్రత్యయమే కేంద్రం అయినా ప్రథమ పురుషైక వచనాన్ని యెంత నొక్కి ఉంచితే అంత గొప్ప. పై రెండుగాక ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశంగారు, కూచి నరసింహంగారు, కూడా స్వీయచరిత్రలను వ్రాసుకొన్నారు. ఏమి వ్రాసుకున్నా వీటన్నిటినీ పరీక్షించటానికి ఒక ఒరిపిడి రాయి ఉంది.

"Not the poem that we have read but that to which we return possesses the genuine quality cf poetry" అన్నాడు కోలిరిడ్జి. ఒకమారు చదివిన తరువాత మరల చదువ వలెనని యే గ్రంథం ప్రేరేపిస్తుందో ఆ గ్రంథం ఉత్తమమైన దనడంలో సందేహం లేదు. ఈ ప్రేరణ ఎవరికి? సహృదయుడికి. ఈ స్వీయ చరిత్రలలో ఏది ఆ పరీక్షకు నిలుస్తుంది? అని ప్రశ్నిస్తే సమాధాన మెంత వస్తుందో ఆలోచించండి. పైన చెప్పిన పరీక్షకు ఒక్క వీరేశలింగంగారిదే కొంతవరకు ఆగుతుందనటంలో సందేహంలేదు. అదికూడా పోను పోను విసుగు పుట్టిస్తుందని కొందరంటారు. అందిరూ కొనియాడుతున్న కన్యాశుల్క నాటకమే తుదకు విసిగేస్తుంది. కాబట్టే హ్యూమ్ "నా స్వీయచరిత్రను చాల చిన్నదిగా వ్రాస్తా" నన్నాడు. అది దీనికి ఒక లోపం కాదు కాని, గుణంకూడా కాదు. [అనిబిసెంటు తన స్వీయచరిత్రలో తాను Charles Bradlcugh తో కలిసి పనిచేస్తూన్నప్పుడు తన శీలాన్ని ప్రపంచం శంకించిందని చెప్పుకున్నది, సత్య కథనమంటే దాచక పోవడమంటే అలాగుండాలి] గాంధీ మహాత్ముని స్వీయచరిత్ర చదువుతూ ఉంటే అలా అనిపిస్తుంది. వీరేశలింగంగారి చిన్నతనము, ప్రకాశంగారి కుటుంబ పరిస్థితులు ఆయా స్వీయచరిత్రలలో చదువుతూ వుంటే కొంతవర కట్లే అనిపిస్తూంది. ఈ ప్రక్రియ ఇంకా తొలి అవస్థలోనే ఉందని మనవి చేస్తూ విరమిస్తాను.

బాపూజీ

కొత్త సత్యనారాయణ చౌదరి

ఆయన చూపినట్టి విలువైన మహాస్త్రము దీన జాతికిన్
ఛాయని యండయై దిగులుఁ బాపి విజాతికి గుండెనీరుగాఁ
జేయఁ గడంగె; యుద్ధములుచేసి కృశించిన విశ్వజాతికా
ప్యాయము గూర్చు మార్గముసుమా! యనితోఁచెఁ గ్రమక్రమంబుగా

సేతువుఁ దొట్టి శీతనగసీమసమీపము దాఁక హైందవ
వ్రాతము నూతనోద్యమము వంకమఱల్చుట యొక్క వ్యక్తికిం
బ్రాఁతియె; దేశ మన్య పరిపాలనచే నుడుకెత్తుఁ గాక!యీ
జాతికి నైక్య మేర్పఱుపఁ జాలిననాయకుఁ డేఁడి చూడఁగా?

దానికి గాంధిజీ, పలువిధాలఁ దపస్సొనరించి దీక్షయుం
బూని సమస్త మానవుల బుద్ధికి నద్భుత సంక్రియాఫల
శ్రీనొసఁగంగ మార్గము విశిష్టముగా నొనరించి ప్రాచ్యవి
జ్ఞానము నూఱిపోసి యవుగాము లెఱింగి మెలంగె నిమ్మగా

చదివితిమంచుఁ బొంగిపడి జాతికి దూరములో మెలంగుదు
ర్మదులకు బుద్ధి వచ్చెడి తెఱంగున నాతఁడు బల్లెటూళ్ళకే
కదలి విశిష్టమైన పథకంబులు వారికి నచ్చఁజెప్పి ము
మ్మొదట నభూత పూర్వమగు పోకడవోయి కరంచెడెందముల్

వాడకు వాడకుంజని వివాదములున్నఁ బరిష్కరించి పో
రాడుట నేర్పి నైతిక రహస్యము లాదట బోధచేసి మా
ఱాడని జాతికొక్క మరియాదను దెచ్చి స్వరాజ్య దీక్షలో
వేఁడిమి గూర్చె;దానికె వివేకిగ నాతని మెత్తురెల్లరున్

సమరము సేయఁగాఁ దగిన సాహసమున్నను సాధనంబులే
శము సమకూరనట్టి మన జాతికి సాత్త్వికమార్గమొక్కటే
యమరిన యస్త్రమంచును మహాత్ముఁడు దూరము పాఱఁ జూచి దే
శము నడిపింప నేర్చెఁ బలుసారులు విఘ్నము లెత్తివచ్చినన్

తలలో నాల్కయి పేదసాదల మనస్తాపంబు గుర్తించి వా
రల యిక్కట్టులు దీర్పరేఁ బవలు హోరాహోరిగాఁ బోరియా
వలఁ బెక్కేండ్లు గడించినట్టి తన దివ్యంబైన పుణ్యంబులో
కులకుఁ బంచె మహాత్ముఁడంచు జగముల్ ఘోషించి కీర్తింపఁగా

ఇంటను గెల్చి రచ్చను జయించుటలో సుఖమున్నమాట వె
న్వెంటనె చక్కఁగా నెఱిఁగి విజ్ఞుఁడు గావుట సాంఘికంబుగా
నంటిన దోషపుంజముల నాతఁడు వ్రేలిడిచూపి రాజ్యముం
గొంటకు సాధనంబు లనుకూలముగాఁ బొనరించెఁ బెక్కిటిన్

మతమని పేరువెట్టి యవమానములన్ గుడిపించి కొందఱు
ద్ధతులయి సాటిమానవుని దండడిపెట్టుదు రంతెగాక దు
ర్మతులయి వీఁడు నీచుఁడగు మానవుఁడంచును బేరువెట్టి చు
ద్భుతమగు సాంఘికస్థితి నెదుర్కొనఁ జేసిరి హైందవంబులో

కులములు గోత్రముల్ పరమ కుత్సితభావములన్ వెలార్చి సం
కులసమరంబు లేర్పఱుపఁ గోరినఁ జూచియు నైచితాము పె
ద్దలమని విఱ్ఱవీఁగుచు ముదంపడి భేదము వెంచు భారతీ
యులకు స్వరాజ్యమేల యనియున్ నిరసించె మహాత్ముఁడయ్యెడన్

'హరిజన సంఘ' మేర్పఱిచి యందఱి యౌచితి బోధచేసి యం
దఱు పరమాత్మ బిడ్డలను తత్త్వము చక్కఁగ విప్పిచెప్పి యా
దరమున 'నిమ్నజాతి' యను దాని స్వరూపము మార్చివైచి సం
బరమును గూర్చె దీనజన బాంధవుఁ డీతఁడు మాతృభూమికిన్.

తరిగొండ వేంకమాంబ: వేంకటాచలమాహాత్మ్యము

వేదాంతము గోపాలకృష్ణమాచార్యులు

కడప మండలములో నొక గ్రామము పేరు తరిగొండ. ఆ గ్రామ నామమును బట్టి తరిగొండయని యామెకింటి పేరేర్పడి యుండవచ్చును. ఈమె పుట్టినింటి వారి పేరు కాసాలవారనియు వారు నందవరీక కులోద్భవులయిన వాసిష్ఠ గోత్రులనియు రమాపరిణయము తుదనున్న క్రింది పంక్తులవలన నెఱుకపడుచున్నది. ఈమె తండ్రి కృష్ణార్యుఁడు. తల్లి మంగాంబ.

"వలనొప్పఁగా నందవరకులోద్భవుఁడు
చెలువొందనమల వాసిష్ఠ గోత్రుండు
వసుధలో కాసాల వంశవర్ధనుఁడు
రసికుఁడౌ కృష్ణార్యురమణి మంగాంబ
సుత వెంగమాంబ భాసుర భక్తితోడ
ప్రతిలేని శ్రీ రమాపరిణయంబనెడి

వేంకటేశ్వర లఘుకృతులు, పుట 191

తరిగొండ నరసింహునకు శేషకుధరాధ్యక్షునకు నభేదము పాటించి యీ యిరువురకు ననేక కృతులీమె యర్పించినది. ఈమె తరిగొండ లక్ష్మీనృసింహకరుణాకటాక్ష కవితనని వేంకటాచల మాహాత్మ్య గద్యమున స్పష్టీకరించినది. ఈమె భక్త శ్రీ వత్సగోత్రోద్భవుండును దిమ్మయార్యుని పుత్రుఁడును నైన వేంకటాచలపతియని యామె ద్విపద భాగవతము వలనఁ దెలియుచున్నది. నరసింహశతకము, నారసింహ విలాస కథ, రాజయోగ సారద్విపద, ద్విపద భాగవతము, వాసిష్ఠ రామాయణ ద్విపద, శ్రీకృష్ణమంజరి, శివనాటకము, కృష్ణనాటకము, పారిజాతాపహరణము, చెంచునాటకము, రుక్మిణీనాటకము, గోపినాటకము ముక్తి కాంతావిలాసమునను గ్రంథములీమె కృత్యంతరములు. ద్విపదభాగవత రచనము వేంకటాచలమాహాత్మ్య రచనమునకుఁ బూర్వమే జరిగినదని యందలి 1-23 పద్యము వలనఁదేటపడుచున్నది. వేదాంతవిషయకములగు కొన్ని కృతుల నామె దేశికుడగు సుబ్రహ్మణ్యునకంకితముగా రచించినది. ఈమె క్రీ. 1840 వ సంవత్సరమందు జీవించియుండినట్లు బ్రౌన్‌దొరగారు తమ నిఘంటువునందు వ్రాసియున్నారని శ్రీ కందుకూరి వీరేశలింగము గారు వక్కాణించిరి. ఈమె వేంకటాచలమాహాత్మ్యమున నీ క్రింది తెఱఁగున వినయము ప్రదర్శించినది.

భక్ష్యములు మెక్కి యావలఁబచ్చడియును
నంజుకొనిన విధంబున నా ప్రబంధ
మాలకింతురటంచుఁబేరాసచేత
నేను రచియింతు దీని మన్నించి కనుఁడు 1-9

వేంకటాచల మాహాత్మ్య మాఱాశ్వాసముల పద్యకావ్యము. ఆమె "వేంకటాద్రి మాహాత్మ్యమునను వరాహపురాణంబు, ముప్పది యధ్యాయములను దొలుత" (4-7) మూఁడాశ్వాసములు చేసి వరాహస్వామి కర్పించినది. తరువాత భవిష్యోత్తర పురాణమునఁబదుమూఁడధ్యాయములలో వర్ణింపఁబడిన శ్రీనివాసుని విలాసములను రెండాశ్వాసములుగా నాంధ్రీకరించినది. (6-3) పిమ్మట పద్మ పురాణమున సిరిని గూర్చి హరితపమును జేసినట్టి కథలు కొన్ని సంగ్రహముగా లభింపఁగా వానిని విస్తరించి వరలక్ష్మి విలాసమను నామముతో షష్ఠాశ్వాసమును రచించినది (6-5) వారాహపద్మగారుడ బ్రహ్మాండ మార్కండేయ వామన బ్రహ్మాదిత్యస్కాంద భవిష్యోత్తర పురాణములలో హరివంశ పర్వశ్రీ వేంకటేశ్వర రహస్యములలోఁగానవచ్చు వేంకటాచల మాహాత్మ్యమును రెండు సంపుటములుగాఁదిరుపతి మహన్తు ప్రయాగదాసజీవారు ప్రచురించినారు. నేఁటికిని ప్రతులు దేవస్థానము వారికడ లభించుచున్నవి. అందుఁ దొలి సంపుటములోఁ దొలుత శ్రీ వారాహపురాణాంతర్గత వేంకటాచల మాహాత్మ్యము గలదు. ఆ వేంకటాచల మాహాత్మ్యము రెండు భాగములుగా విభక్తము. తొలి భాగమున ముప్పది యధ్యాయములున్నవి. మఱిభాగమునఁ

బదియధ్యాయములున్నవి. తొలిభాగమునందలి ముప్పది యధ్యాయలలో ఫల్గునీజాబాలితీర్థ మాహాత్మ్యములను బరిహరించి తక్కిన గ్రంథమునంతయుఁ బ్రకృత కవయిత్రి యథాతథముగా నాంధ్రీకరించినది. పదియధ్యాయములు గల్గిన యుత్తరార్థ మామెకు లభింపలేదేమో యెఱుఁగరాదు. వరాహపురాణాంతర్గత వేంకటాచల మాహాత్మ్యమునందలి యాఱవ యధ్యాయమున నేఁబదిరెండు శ్లోకములలో రాజ్యభ్రష్టుఁడైన శంఖణునకు రాజ్యము పునఃప్రాప్తించిన విధము వర్ణింపబడినది. ఆ కథయే ప్రకృతాంధ్రీకరణమునఁ దొలియాశ్వాసమునఁ బద్యములు 157_168 లో వివరింపబడినది. ఈ గ్రంథము యథాతథమగు తెనుఁగింపనుట కాపట్టునందలి కొన్ని శ్లోకములను, వాని కాంధ్రీకరణములగు పద్యములును బ్రదర్శింపబడుచున్నవి.

వాల్మీకి నా మునీంద్రేణ, కించి దుక్తంశ్రుతంమయా
తదుచ్యతేమయాయాయమ్, శ్రుణుధ్వంముని సత్తమాః
అధ్యా 6_1

సాంకాశ్యేసోమవంశీయః, శంఖణః పృథివీపతిః
అనేక దేశ సహితమ్, బహువిస్తార సంయుతమ్ 6_2

పరంపరాగతం రాజ్యం, చక్రేకఖఢ్గ పరాక్రమః
సకదాచిన్మహారాజః, కృతపుణ్య విపర్యయాత్ 6_3

సామన్తరాజభిః సర్వైః, హృతరాజ్యో మహీపతిః
తస్మాత్స భార్యః సామాత్యో, దేశాన్నిర్గత్య దుఃఖితః 6_4

దక్షిణాందిశ మాసాద్య, రామసేతుం దదర్శహ
తత్రస్నాత్వాశనైః పశ్చా, దాజగామ నదీంతతః 6_5

సువర్ణ ముఖరీంతత్ర, స్నాత్వాచోత్తరతీరతః
పాద్మంసరః సమాగమ్య, తత్రస్నానం చకారసః 6_6

నిత్యంచ విధివత్కృత్వా, న్యవసద్దుఃఖపీడితః
రాజ్యాద్భ్రంశోవనేవాసః, స్వామిత్వంచహృతం పరైః 6_7

పారతంత్ర్యం మహద్దుఃఖం, మరణాదతిరిచ్యతే
భవితాజీవనంకస్మాత్, క్వవాగచ్ఛామికాగతిః 6_8

ఇతిశోకసమావిష్టః, తస్థౌనిద్రాముపాగతః
అశరీరాజగాదైనం, తదానీంశోకపీడితమ్ 6_9

మాశుచస్త్వం మహాబాహో, ధైర్యమాలంబ్య బుద్ధిమాన్
ఇతఉత్తరదిగ్భాగే, క్రోశమాత్రే మహాగిరిః 6_10

వేంకటాచల ఇత్యేవ, ప్రథితః పృథివీతలే
ఆపన్న కామధేనుర్యః, శోకార్తానాం సురద్రుమః 6_11

వాల్మీకి నాకుఁబూర్వచరిత్ర మొక్కండు చెప్పెదానిని విను
డొప్పుగాను
చంద్రవంశజుడైన శంఖణుండనురాజు కాలవశంబున
దేలయగుచుఁ
దనశత్రువులకొగిఁ దనరాజ్యమును గోలుపోయి
రామేశ్వరమునకుఁజేరి
యటరామసేతువునందుఁ గ్రుంకి మఱందుముదమునఁ గొన్నాళ్ల
వదలకుండి
వచ్చుచు మార్గాన వరశంఖముని గిరిపైనుంచి వచ్చెడు
పావనమగు
శ్రీ సువర్ణముఖికిఁ జెలఁగి స్నానముజేసి దానికుత్తరముగఁ
దరలివచ్చి
దానవాంత కగిరిదరినుండు జంబుజంబీరగాల్గవచ్చిరి బిల్వపకుళ
పాదపచయముచేఁ బరిశోభితంబగు భూమియందొక్కెడఁ
బొదలుచుండు

కమలకల్హార పుండరీకాదిపుష్ప
శోభితంబగు సరసిలో సుఖముగాను
స్నానమును జేసి యాతీరసాలమూల
మునఁదగంజేరి యివ్విధంబునఁదలంచె 1_157

కటకటశాత్రవుల్గినికయ్య మొనర్చిమదీయ మండలం
బటువలె నాక్రమించిరిపుడన్నము వస్త్రము గల్గుటెట్లునే
నెటువలె నోర్తుకష్టమున కీశ్వరుఁడేగతిచేసెనింక మీఁ
దటి గతి యేమటంచుఁబరి తాపముతో విపులార్తిఁ
బొందుచున్ 1_158

దేవునిమనంబుననెంచుచు దేహంబు పరవశత్వంబు
నొందుటఁజేసి యాసమయంబున నశరీరవాణియిట్లనియె 1_159

నిర్మలాత్ముఁడ మదియందు నీవు ధైర్య
మొందు చింతింపకిచటికి నుత్తరమునఁ
గ్రోశదూరాన వేంకటకుధరమున్న
దటకు నరుగుము భక్తితో నార్తి తొలఁగు 1_160

మఱియు నప్పావన పర్వతంబు మహా పన్నులకుఁ గామధేనువు చందంబున నత్యంత శోకార్తులకుఁగల్పవృక్షము కైవడిజింతితార్థంబులిచ్చుచుఁజింతామణి నామంబున 1_161

భవిష్యోత్తర పురాణాంతర్గత శ్రీ వేంకటాచలమాహాత్మ్యమునఁబదునాల్గధ్యాయములు గలవు. (ఇతిశ్రీ భవిష్యోత్తర పురాణ శ్రీ వేంకటాచల మహాత్మ్యే చతుర్ధశోఽధ్యాయః) వేంకమాంబ పదుమూఁడధ్యాయములుగాఁబరిగణించుట ప్రమాదము కావచ్చును. లేకున్న నామెకు లభించిన ప్రతియందలి యధ్యాయ పరిగణన మట్టిది కావచ్చును. ప్రకృత గ్రంధమునందలి చతుర్థ పంచమాశ్వాసము లాయాయధ్యాయములకేస్వతంత్రానువాదము. మాధవ

సోమయాజి యను దుశ్చర్యలాచరించిన విప్రుని కథ భవిష్యోత్తర పురాణమునఁ బ్రథమాధ్యాయమున శ్లో 140_239 లలో నభివర్ణింపబడినది. ఆ కథ ప్రకృత గ్రంథమున ఆ 4_68_94 పద్యములలో వివరింపఁబడినది. ఈ ఘట్టమునఁ గొన్ని వర్ణనములను గర్త్రి పరిహరించినది.

తత్రాఽపిదివసక్రీడా, మయుక్తంమునయో విదుః
నికేతనేపితామాతా, చాగ్నిహోత్రశ్చదేవరాట్ 1_150

ప్రభాకరప్రభాంపశ్య, త్యజకామంద్విజాత్మజ
మధూవచనమాకర్ణ్య, మాధవోవచనమబ్రవీత్ 1_151

మాధవఉవాచ

భవభామిని సౌఖ్యంమే, పూరయాద్యమనోరథమ్
తవస్యాత్పుత్రిసౌభాగ్యమ్, పరంపతిసలోకతా 1_152

భర్తుర్వచనమాకర్ణ్య
భర్తారం వాక్యమబ్రవీత్ 1_153

చంద్రలేఖోవాచ

గచ్ఛామిజలహేతోస్తు, గచ్ఛత్వంపురతోమమ
తదాజగామరాజేంద్ర, కుశార్థంసస్వభావతః 1_154

సాజగామాదపానీయ, పాత్రమాదాయభామినీ
తామన్వగాన్మాధవోఽపి, వటకూటమభిద్రుతః 1_155

తత్రాంతరేవిప్రపుత్రీ, దదర్శాన్యాంస్త్రియంపునః
వనాన్తరేపసన్తీచ, వసన్తీంద్రుమమూలగామ్ 1_156

ధవళాంబరసంబద్ధామ్, కటిమేఖలయాన్వితామ్
సునాసాం సుభగాంసుభ్రూమ్, నీలాలకవిరాజితామ్ 1_157

ముమోహ విప్రస్తాందృష్ట్వా, సువర్ణాంసుపయోధరామ్
స్నిగ్ధకంచుకసంబద్ధామ్, కోకిలస్వరరంజితామ్ 1_158

అంజనాలిప్తనయనా, మంత్యజాంనామకుంతలామ్
పాదేనవిలిఖన్తీంగామ్, జానుస్థితశిరోరుహామ్ 1_159

దృష్ట్వాభిన్నమనాభూత్వా, చింతయన్బహ్మనిర్మితమ్
సభార్యాంప్రత్యువాచేదమ్, గచ్ఛప్రాణప్రియేగృహమ్ 1_160

ఇచ్ఛామేపూర్ణతాంప్రాప్తా
త్వద్భక్త్యాపరితుష్యతః

చంద్రలేఖోవాచ

యుక్తముక్తమ్త్వయాభద్ర, గచ్ఛామిభవనంస్వకమ్
భర్తురాజ్ఞాముపానీయ, చంద్రలేఖాగృహంగతా 1_161

యావద్గచ్ఛతిసాభార్యా, తావత్తత్రస్థితోఽభవత్
గతాయాం స్వప్రియాయాంతు, తాంబాలాం పరిచింతయన్ 1_162

శనైర్జగామరాజేంద్ర, స్మరేణహృతచేతసః
సమీపస్థంమునింప్రేక్ష్య, సారాజన్పృథులోచనా' 1_163

'స్వామీ! దేవతార్చనాగ్నిహోత్రాది సత్క్రియలాచరించు సమయంబున నిట్లు దివాక్రీడాసక్తిఁగడంగఁగూడునే, యనియనేక విధంబులఁ జెప్పినను వినకుండుపతిం జూచియైన మీరు సమిత్కుశ తులసీ పుష్పార్థంబుగ సువర్ణనదీతీరవనంబున కుంజనియందుండుఁడు. నేనచటికి నుదకంబుగొని వచ్చుటకు ఘటంబుచేగొనివత్తు నచ్చట మర్మస్థానంబున బవత్సంకల్పపూర్తింజేసికొనుఁడటంచుంబతికి ముదంబు నొందించి యాతని పంపనతండట్లపోయి సువర్ణ నదీతీరంబునఁ బుష్పవనాంతరంబుచేరె. అచ్చటికి నంతకు మున్నవచ్చి స్వర్ణభూషణశ్వేతాంబరాలంకృతయై యొక్కకాలుముడిచికొని యొక కాలుబొటునవ్రేల నేలఁ గ్రుచ్చి యెత్తుచు మోకాలిమీఁదఁజుబుకంబుంచుకొని దీర్ఘ నీలకుంతలంబులు మెఱయఁ గూర్చునియున్న పద్మినీజాతియగు చండాల స్త్రీనిజూచి యమ్మాధవాభిఖ్యవిప్రుండు మోహించి యుండెనట్టి సమయంబునం దనభార్యయుద కార్థంబుగ ఘటంబుజేకొని వచ్చుటం జూచి యవ్విప్రుండు భార్యానీగుణంబును బరీక్షింపదివాక్రీడకుఁ బిలిచితింగాని మఱేమియు లేదు గావున నీవు స్నానంబొనర్చియుదకంబుగొని గృహంబునకేగుమేను నతిశీఘ్రంబుగ వచ్చెదనని భార్యను బంపియా చండాలస్త్రీ కడకుంబోవుచుండ నా బ్రాహ్మణునింజూచి యది లేచి మ్రొక్కి దూరంబరిగి నిలిచి యేమో చెప్పంబోవనవ్విప్రుండద్దాని చెంతకేగు చుండగఁనాస్త్రీ భయంపడి మాధవాభిఖ్య బ్రాహ్మణునకిట్లనియె 4_69, 157, 158, 161, 162 శ్లోకములలోని భావములుజ్జగింపఁబడి విషయము సంగ్రహింపఁబడినది స్పష్టమే గదా!

ఇఁక శేషించిన షష్ఠాశ్వాసము కొంత స్వతంత్రమనికర్త్రియే చెప్పిన క్రింది పంక్తులవలన విదితమగుచున్నది.

హరికిసమర్పించియవల పద్మపురాణ
మందువింతగు వేంకటాద్రివిభుఁడు
సిరినిగూరిచితపమునుజేసినట్టి
చరితములు కొన్నిలభియింప సంగ్రహముగ
సరవినాశ్వాసమునకవి చాలవనుచు
వేఱకల్పన కొంతకావింపవలసె 6_3

పద్మపురాణాంతర్గతమగు వేంకటాచల మాహాత్మ్యమునఁ బదునొంకడధ్యాయములున్నవి. వేంకమాంబగ్రహించిన కథలు పదునొకండవ యధ్యాయమునఁగాన వచ్చుచున్నవి. ప్రకృతాశ్వాస మున ప 1_30 లలో లక్ష్మి నెడబాయుటచేఁ జింతాక్రాంతుఁడైన హరినిగాంచి పద్మావతి చింతించి.

ననుగొల్లాపురమందుఁజేర్పుఁడచటన్నానా ప్రకారంబులన్
వనజాతాలయకొప్పఁజెప్పిమటి సర్వంబున్సమర్పించిర
మ్మనినే తోడ్కొని వత్తునన్నదరహాసాస్యంబు దీపింపన
వ్వనజాతాక్షుఁడు సంతసంబెసఁగనవ్వామాక్షితోనిట్లనెన్ 6_28

సతినీలలితోక్తికినా, కతిసంతసముప్పొఁ కుశలయలరఁగఁదోడన్
హితముగనుండుమునేనా. సతిఁదోడ్కొనివత్తునిటకు సంప్రీతి
తగన్ 6_29

అనుట మూలనిరపేక్షము, తరువాతకొల్లాపురమునలక్ష్మి కొఱకుఁదప మాచరించుచున్న హరితో నభోవాణి క్రింది విధము గాఁబల్కినట్లు పద్మపురాణమున వివరింపఁబడినది.

అథాబ్రవీత్తదా విష్ణుమశరీరాసరస్వతీ
విష్ణోప్రసీదభగవన్ లక్ష్మీదర్శనలాలస అధ్యా శ్లో॥ 11_13
ఇతోదక్షిణతోగచ్ఛ కృష్ణవేణ్యాశ్చదక్షిణే
ద్వావింశద్యోజనే విష్ణోసువర్ణముఖరీనదీ 11_14
తీరమాసాద్య తస్యాస్త్వముత్తరంమునిసేవితమ్
కుంభేనాహత్యతత్తీరేసరః కృత్వాతపఃకురు 11_15
ఆహృత్యదేవలోకాత్త్వం సువర్ణకమలానిచ
సంస్థాప్యతస్మిన్ సరసి సర్వాణికమలానిచ 11_16
తత్తీరేపుష్పజాతిశ్చపుష్పవృక్షశతానిచ
పద్మారామేనసరసి పద్మాయాః పద్మవల్లభ 11_17
జపన్నేకాక్షరమనుంసహస్రాక్షరమేవవా
అర్చయన్ కమలైఃపద్మాః ద్వాదశాబ్దంవసప్రభో 11_18
తతః ప్రసన్నాసాదేవీస్వయమావిర్భవిష్యతి
సువర్ణకమలాదేవ సువర్ణకమలాకృతిః 11_19
ఊనషోడశవర్షాస్త్రీః పద్మనయనాతవ
గచ్ఛశీఘ్రమితో విష్ణోసువర్ణముఖరీతటమ్ 11_20
వేంకటాచలమాహాత్మ్యమువాల్యూము 2,
పద్మపురాణాంతర్గత వేంకటాచల మాహాత్మ్యము

దేవ యిచ్చట రమాదేవి మీకిప్పుడు పొడసూప దీతపంబు_
నకు మెచ్చి

కాన నిచ్చటికిఁ జక్కఁగ దక్షిణంబుగఁ గీర్తి కెక్కిన యట్టి
కృష్ణవేణి

యనునది ప్రవహించు నచటికి ద్వాత్రింశతి యోజనంబుల
దూరముండునట్టి

ముఖ్యమైన సువర్ణ ముఖరి యున్నది తత్తటముజేరి తపము
సేయుము క్రమముగఁ

గుంభసంభవుఁడున్న దిక్కునకు దూర్పు
గాఁ బ్రకాశించు సిద్ధ సౌఖ్య స్థలంబు
స్వర్గమందున్న దివ్య సువర్ణ కమల
మొకటి తెప్పించి నాటియందొనర నిలిచి 6_40

పద్మావతీదేవి హరిని బాసినది మొదలు నిద్రలేక విరహతాప జ్వరమున వేఁగుట (6_79_80) మూల నిరాపేక్షము.

"హరి యురమున వసియింపక, సిరి నీవపు డయిగనేల
చిత్రము గదయా

సరవింజెప్పుము వినినీ, కరయఁగ నంతమును జెప్పు దంబుజ
నయనా" 6_83

ఇత్యాదిగాఁ గపిలుఁడు ప్రసంగించుట, వారి సంవాదము
(6_81_113) స్వతంత్రములు.

హరి లక్ష్మీ పద్మావతుల తోడంగ గూడి సుఖంబుండి యొక్క
నాడు వినోదంబుగ లక్ష్మింజూచి

"శ్రీరమాదేవి నీవు వచ్చిన కతమున, నాకు సంతోషమయ్యె
నానాఁడుధనుదు

చేతఁదీసిన ఋణము దీర్చెడు నుపాయ, మేమి నా కిప్పుడెఱిఁ
గించు మిందు వదన" 6_137

యనుట వారి సరస సల్లాపములు (136_155) పద్మపురాణా నపేక్షములు. అట్లే ప 211_245 స్వతంత్రములు. ఈ యాశ్వాసమున స్వల్పములగు వర్ణనలను, సంవాదములను విస్తరించుట సర్వత్ర కాననగును,

బాపూజీ స్మృతిలో

మురళీధర్

నీలో యీజాతి
తనను తాను చూచుకొంది
అద్దంలో కాని రూపం
కన్పడనట్లు
పరిపూర్ణ వ్యక్తిలో కాని
జాతి తన రూపాన్ని చూసుకోదు.
ప్రజలంతా నిదురించే బెబ్బులులు
తమ బలమెరుగని
ఆంజనేయ స్వరూపులు.
దినం గడిస్తే చాలని
బ్రతుకునొక అలవాటుగా
మార్చుకున్న
మామూలు మనుష్యులకు
అస్తిత్వం అసలే లేదు.
బానిసల మన్న సంగతి
తెలిసే తెలీదు.
తీరని కోర్కెల చిత్రఫలకాలు
వాళ్ళ బ్రతుకులు
అప్పుడప్పుడు ఎగిరే
నిప్పురవ్వలు
కాంక్రీట్ బిల్డింగ్‌ను
కదల్చ లేనట్లే
సామ్రాజ్యపు కోటను
వాళ్ళంతట వాళ్ళు ఛేదించలేరు.
పరుగెత్తి పాలుతాగటం చేతకాని జాతికి
పాలు తాగే అధికారం లేనట్లే
నియంతలపై తిరుగుబాటు
చేయలేని జాతికి
తలెత్తుకు తిరిగే అర్హతలేదు.
విసిరేసిన రొట్టె ముక్కల్తో
బ్రతుకులు వెళ్ళవని
బానిసగా బ్రతకటం కన్న
విముక్తి సమరంలో
చావటం మేలని
చూపించావు.
నీ బ్రతుకు నాహుతి చేశావు.
నీ బ్రతుకొక పూర్ణ కావ్యం.
సత్యాగ్రహమే దాని ఫలం.

నిర్మల హృదయాలు

మిక్కిలి సుందరరావు

మధ్యాహ్నంనుండి వీచిన మంటగాడ్పులు తగ్గి సాయం–కాలాని చల్లనిగాలులు మళ్లాయి. ఆఫీసుకాగానే యధావిధిగా ఆస్పత్రికి బయలుదేరాను నెలరోజులనుండి యెక్కడతిరుగుతున్నా యేంచేస్తున్నా, యిదొక పెద్దబాధగా వెంటాడుతోంది.

ఎత్తైన కొండలమీద సముద్రానికి సమీపంగా అతి నవీన పద్ధతిలో మహావృక్షాలమధ్య నిర్మింపబడ్డ పెద్దపెద్ద ఆస్పత్రి భవనాల్ని దాటుకుంటూ పోతున్నాను.

స్త్రీలవార్డులో డాక్టర్లు, నర్సులు, వార్డర్లు హుషారుగా తిరుగుతున్నారు–రోగుల్ని చూడ్డానికొచ్చిన రకరకాల వ్యక్తులు అక్కడక్కడచేరి మాట్లాడుకొంటున్నారు.

నేను సరాసరి ఆమెమంచం వద్దకువెళ్లి ప్రక్కనేవున్న కుర్చీలోకూర్చున్నాను. నన్నుచూడగానే ఆమెలేవడానికి ప్రయ–త్నించింది, కానినేను వద్దని వారించాను.

ఇవ్వాళ ఆమే ముఖంలో చాలాకాలంగా కనుపించని వికాసం గోచరించింది, జబ్బు క్రమేణాతగ్గు ముఖం పడుతుందేమో నని నాలోనేను సంతోషపడుతున్నాను.

"పిల్లల్ని కూడా తీసుకరాకపోయారా?" అన్నది ఆమె.

"ఆఫీసునుండి అలాగేవచ్చాను– ఇంటికివెళ్తే మరీ ఆలస్యమవుతుందని" అన్నాను.

"ఈబాధ భరింపలేకుండావున్నాను. దీనికంటే మరణం మేలనిపిస్తుంది"

"చాలాత్వరపడుతున్నావు. వచ్చినదానికి చేసేదేముంది?

"నామూలంగా అనేకమంది బాధపడవలసి వచ్చిందనేదే నాబాధ"

"మాకేంబాధలేదు త్వరగానే తగ్గుతుంది.

"రేపటితో యీబాధ అటోయిటో తేలిపోతుంది"

"అదేమిటి!" అన్నాను ఆశ్చర్యపోతూ

"రేపే ఆపరేషన్" అన్నది.

ఉన్నపాటున వణికి పోయాను.

వెంటనే తమాయించుకున్నాను.

"ఏమిటి అఘాయిత్యం!"

"నాబాధమీకు అర్థంకాదు "

తెలీనిరీతిగా ఆమెకనుకొలకులు చెమ్మగిలాయి.

"ఆపరేషన్‌కి ఎందుకు అంగీకరించావ్?"

"ఈబాధకన్న ఆపరేషనే నయమనిపిస్తుంది."

"లంగ్ ఆపరేషన్ సామాన్యమైందికాదు. చాలా కొద్దిమంది దీంట్లో నెగ్గుతారు. అసలు ఆశ వదులకున్నవాళ్లే దీనికి అంగీకరిస్తారు"

"నన్నుమన్నించండి. డాక్టరుగారు కూడా సమ్మతించారు. ఆ తరువాత దైవచిత్తం. పిల్లల అదృష్టం"

"ఆపరేషన్ లేకుండానే కొద్దికాలానికి కోలుకుంటావని నాగట్టి నమ్మకం"

"అలాఅనుకుంటే మనల్ని మనం మోసంచేసుకున్న వాళ్లమవుతాం. నాకూతెలుసు–మీమీద యెంతబరువు వదలి పోతున్నానో. ఈజన్మకుమనం యీ శిక్ష అనుభవించ వలసిందే"

ఆమెకు యెదురు చెప్పలేక పోయాను.

మూగవాడిలా అమాయకుడిలా తల వంచుకున్నాను.

దిక్కూ–మొక్కూ లేని వాణ్ణి!

నాభార్యకి యింత భయంకరమైన వ్యాధి రావాలా!

నాపిచ్చిగాని క్షయవ్యాధి వచ్చినవాళ్లు నెగ్గుతారా?

ఒకవేళ నెగ్గినా అది తాత్కాలికమే నంటారు—

ఈపిల్లలు యీసంసారం—యెలాజరిగేట్టు?

చూస్తూ, చూస్తూ భార్యను నదిలోకి వదులుతున్నట్లుగా వుంది.

ఎలారక్షించు కోవాలి? ఎవరు రక్షించగలరు?

ఎవరూలేరా? ఎవరున్నారు?

ఎవరికెవరు!!

ఏమైనాచెయ్యగలను—ఎంతత్యాగానికైనా సిద్ధమే—

కానియీధనం, బలం, త్యాగం, శౌర్యం ఏవీ ఆమెను రక్షించలేవు!

"ఊరుకోండి, ఇంత పెద్దవారు మీరే యీలా కంటినీరు పెడితే, పిల్లల సంగతి యేమనుకోవాలి?

ఎంత ఆపుకోవాల నిప్రయత్నించినా ఆగని దుఃఖం—

"అలాచూడండి, నర్సులు—ఆడవాళ్లు, వస్తున్నారు.వూరుకోండి"

అంటూ ఆమె కంటనీరు పెడుతోంది—

నేను నాదుఃఖాన్ని ఆపుకొంటూ ఆమె కన్నీటిని నావ్రేళ్లతో తుడిచాను—

కొద్దిక్షణాలు అలాగే వుండి పోయాం—

"ఫరవాలేదు. మంచిపనే చేశావు. ఆపరేషన్‌కు అంగీకరించడమే మంచిది. నిజానికి నీబాధనేనుకూడా చూడలేకుండా వున్నాను"

క్రమేణా ఆస్పత్రిని ఆవరించుకున్న చీకట్లను విద్యుద్దీపాలు ఛేదించాయి. రోగుల్ని చూడ్డానికొచ్చిన వాళ్లు వెళ్లిపోయారు చాలా వరకు ప్రశాంతత ఆవరించుకుంది.

"టైమయిపోయింది పిల్లలు ఒంటరిగా వుంటారు. వెళ్ళండి" అన్నది.

"డాక్టరుగారితో మాట్లాడి వెళ్తాను"

"అలాగే"

ఆమెపాదాల వరకూవున్న దుప్పటిని గుండెలవరకూ లాగి కప్పి, వస్తానని చెప్పి కొద్దిదూరంసాగే సరికి ఇలారండి ఒక్కమాట" అన్నపిలుపు వినిపించి వెనుదిరుగాను.

"గడచినదాన్ని విడిచిపెట్టండి, ఈకొద్దికాలం మీరు నాతోనవ్వుతూగడపాలి, మీముఖంలో నాకు యెక్కడావిచారరేఖ గోచరించనేకూడదు" అన్నది.

"లేదు ధనం, నీవుబ్రతుకుతావు" అన్నాను.

"నాకూచనిపోవాలనిలేదు, ఇవన్నీ ఆచారపు మాటలు ఈ సమయంలో వాటిని విడిచిపెట్టండి. హృదయంవిప్పి మాట్లాడ్డం నాకు కావాలి"

"ధనం"

"ఈకొద్దిసేపు నన్ను పూర్తిపేరుతో 'ధనలక్ష్మి' అని పిలవండి

నాకేమీ తోచింది కాదు.

అంతా చీకటిగా వుంది కళ్లనీళ్లుకమ్మి—

"ఇలాఅంటున్నానని మీరు మరోలాభావించకూడదు ఈదిక్కుమాలిన దానికోసం మీరు యీప్రపంచాన్నే వదులుకున్నారు, మీ సర్వసౌఖ్యాల్ని యీ 'నిర్మల' కోసం త్యాగం చేశారు. నా కోసం మీరు అనుభవించిన దుఃఖానికి నేను విలువ కట్టలేను అందుకనే యీ కొద్దికాలం మీరునాతో కొత్తగా గడపాలి"

"అలాగే......నీవుకూడా నిశ్చింతగా వుండాలి" అనిచెప్పి అతిదీనంగా చూసే ఆమె చూపుల్ని హృదయంలో పదిలపరచుకుంటూ బయలుదేరాను

డాక్టరుగారు "టేబిల్ లైటు" ముందు పంకాగాలి క్రింద కూర్చీలో కూర్చుని యేదో పుస్తకం చదువుతున్నారు—

నేను లోనికి వెళ్లి నమస్కరించి నిలుచున్నాను.

ఆయన "ప్లీజ్—కూర్చోండి" అన్నారు—

ఈ చదువుతున్న పుస్తకం లంగ్ ఆపరేషన్‌కి సంబంధించిందే జర్మనీనుంచి ప్రత్యేకంగా తెప్పించాను. చాలా జాగ్రత్త వహించాలనుకుంటున్నాను. తప్పక 'సక్సెస్' అవుతుంది"

"థాంక్యూడాక్టర్ మీచేతి చలవవల్ల మా శ్రీమతి బ్రతకాలే కాని జీవితాంతం మీకు ఋణపడివుంటాం."

"ఫరవాలేదు శక్తికొలదీ ప్రయత్నిస్తాను"

నేను నమస్కరించి తిరిగి వస్తుంటే, చూడండీ అనే మాటవిని వెనుదిరిగి 'ప్లీజ్ డాక్టర్ అన్నాను.

"నిర్మల మీకుతెలుసా"

అకస్మాత్తుగా స్థంబించిపోయాను.

నోటమాట పెకల్లేదు.

ముఖం వివర్ణమై పోయింది.

అనేక సంవత్సరాల క్రితం హృదయంలో హృదయంగా మెదిలిన నిర్మల గుర్తుకువచ్చి కంపించి పోను—

"నిర్మల పేరుతో నవలలు వ్రాసేది మీ శ్రీమతేనా?"

కొంచెం కుదుట పడ్డాను,

వివర్ణమైన నాముఖం మళ్లీ యథా రూపం పొందింది.

"ఔను డాక్టర్—మా శ్రీమతే" అన్నాను.

"చాలా సంతోషం. ఆ విషయం నాకివ్వాళే తెలిసింది. మీ వారిని పుస్తకాల ద్వారా చాలాకాలం నుంచి యెరుగుదును. ఆమె నా అభిమాన రచయిత" అన్నారు డాక్టర్—

"థాంక్యూ డాక్టర్" అన్నాను.

బయటకు నడిచాను—

చీకటి కౌగిట్లోలోకం పొదిగింది.

ఒకణ్ణే నడుస్తున్నాను—

నా హృదయం బరువెక్కుతోంది.

బరువెక్కుతున్నాను నాకు నేనే—

కొండల దిగువన సాగర తరంగాల నిస్వనాలూ, వాటి మీదుగా మహావృక్షాల్ని వూపుతూవీచే చల్లగాలుల గానాలూ—దారిపొడుగునా మార్గం చూపిస్తూ నిలిచిన విద్యుద్దీపాల కాంతులూ—బీచినుండి తిరిగొస్తూ తరగని మాటలు చెప్పుకుంటూ వెళ్తున్న దంపతులూ— వచ్చే పొయ్యే సిటీ బస్సుల్లో యెక్కే దిగే జనం కోలాహలం— అన్నింటినీ వింతగా చూస్తూ, వెఱ్ఱిగా ఆలోచించు కుంటూ ముందుకు పోతున్నాను.

ఇంటికి చేరుకొని, పిల్లల్ని సర్దుకొని, పనులు ముగించుకొని పడకగదిలో కెళ్ళాను—

ఎంతసేపు తన్నుకులాడినా నిద్ర పట్టడంలేదు—

నిద్ర పట్టడంలేదు యేం చేసినా—

రాత్రి గడచిపోతోంది.

గడచిపోతోంది రాత్రి.

గడచిపోయింది రాత్రి.

సువిశాలమైన కిటికీగుండా దూసుకొచ్చే వెన్నెల రాత్రంతా నా మనోవ్యధపట్ల సానుభూతి ప్రదర్శించింది. గత జీవితాన్ని రాత్రంతా నెమరు వేసుకొని భావి జీవితానికొక రూపాన్ని యివ్వాలనుకున్న ప్రయత్నంకూడా వ్యర్థమై పోయింది. కంటికి కునుకు లేకుండా పడకగదిలో పండుకుని కిటికీగుండా ఆవలికి చూస్తూ చేసిన అన్వేషణ నిరర్థకమై పోయింది.

పదేళ్ళక్రితం పెళ్ళి కాకముందు ప్రేమించుకున్న తొలిదినాల్లో ఆమె రాసిన ఉత్తరాలు ఏకాంతంలో యీనాడు మళ్ళీ చదువుకుంటుంటే, ప్రతి అక్షరం ఒక కన్నీటి బొట్టుగా, ప్రతి వాక్యం ఒక సంఘటనగా, ప్రతి ఉత్తరం ఒక ఆదీఅంతం లేని కథగా మెదులుతుంది.

ఇంతగా ప్రేమించి పెళ్ళాడిన వ్యక్తిని నేటితో అశక్తతతో వదలుకోవలసిందేనా?

చీకట్లో హృదయం బరువెక్కుతోంది.

ఇదే గదిలో, ఇదే చీకట్లో, ఇదే వెన్నెట్లో—ఎన్ని రాత్రులు నిద్రలేని తనివితీరని అనురాగంతో నిండిపోయాయో— —ఎన్ని రాత్రులు చెప్పరాని మధురానుభూతితో పండి పోయాయో!

ఒక్కసారి ఆమె లేదనుకుంటే యీ గది చితికిన హృదిలా యీనిశీథి గట్లు తెగిన నదిలా యీ వెన్నెల ఆద్యంతరహిత మహాంభోధిలా దృగ్గోచరాలౌతున్నాయి.

ఇంతే—

ఒంటరిగా యీ ప్రపంచంలో మిగిలి పోవలసిందే—

మిగిలి పోవలసిందే ఒంటరిగా—

బాబూ, రఘూ, లలిత!!!

వాళ్లూ అంతే—

వాళ్లకు దిక్కెవ్వరు.

దిక్కెవ్వరు వాళ్లకు?

అందరం ఒకటే—

తెల్లని కాంతులతో గది నిండగానే చిట్టితల్లి లలిత వచ్చి తలుపుతట్టి 'లేవండి నాన్నా' అంటుంది బాధగా

తెల్లవారింది కంగారుగా—

ఇదే ఆఖరి రోజు!

ఇదే ఇదే ఆఖరి రోజు!!

ఆఖరి రోజు ఇదే ఇదే!!

రేపు 'ధనం' వుండదు—

రేపటికి 'ధనం' వుండనే వుండదు—

రేపటికీ యివ్వాళ్టికీ యెంత భేదం!

తలుపు తెరుకుకొని లోపలికి వచ్చిన 'లలిత' ను తెలియని రీతిగా యెత్తుకున్నాను—

మనస్సు వేగంగా పరుగెత్తుతోంది.

ఆలోచిస్తోంది మహావేగంగా—

పిచ్చి పిచ్చి ఆలోచనలు—

ఆమెకు జబ్బు వచ్చినప్పటినుండి యిలాగే ఆలోచిస్తున్నాను.

అయ్యో, అప్పుడే తెల్లవారిందే—

రాత్రంతా యేంచేశాను?

ఏం ఆలోచించాను?

ఛీ—ఎప్పుడూ నేను యింతే—

ఏదో నిర్ణయానికి రావాలని రాత్రంతా మేల్కొని, యేమీ చెయ్యలేక పోయాను.

జీవితమంతా యిలాగే చేశానేమో—

ఏమి సాధించగలిగాను?

ఛీ ఛీ—ఛీ

ఇంతే నేను!!

దేవుడుపోయాక దివిటీపట్టే అల్పుణ్ణి!

ఈ ఆలోచనల్లోనే కాలం గడిచిపోతే!

అమ్మో—త్వరగా ఆస్పత్రికి వెళ్ళాలి!

ఆపరేషన్‌లో ధనం నెగ్గాలి!

అదేకావాలి! అంతకంటే కావలసిందేముంది?

త్వరగా, త్వరత్వరగా బయలుదేరాను.

బాబూ, రఘూ, లలిత నా మాటలు విని కొత్తబట్టలు వేసుకున్నారు.

నేనుకూడా ఆమెకు కొత్తగా కనిపించాలి!

పెళ్ళినాటి సూటు!

ఇప్పటికీ ఆమెకెంతో యిష్టం!

సూటు వేసుకొని తయారయ్యాను—

పిల్లల్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాను.

లలిత గులాబిపువ్వొకటి నా కోటుమీద పెట్టింది—

అంతా జట్కాలో యెక్కాం—

జట్కా పోతోంది—

గుండె బరువెక్కి, చీకట్లు కమ్ముతున్నాయి చుట్టూ—

పిల్లల దైన్యస్థితి భరింప రానిదిగా వుంది.

ఈ అలంకారమంతాచూసి, "భార్య చావు బ్రతుకుల్లో వుంటే భలే తయారై వచ్చాడే, దిగులా విచారమా? అని యెవరైనా అనుకొంటారేమో ననిపించింది.

ఈ సమయంలోకూడా పరులకోసం బాధపడ వలసిందేనా?

ఆమెకోసం చేస్తున్నపుడు బాధ పడడం దేనికి?

ఆస్పత్రి గేటు దగ్గర జట్కాదిగి ఎక్కడలేని వుల్లాసాన్ని హృదయంలో రచించుకుంటూ, ఆప్యాయంగా పిల్లల చేతులు పట్టుకొని ఆపరేషన్ గది దగ్గరకు వెళ్లాను—

ఆమె యెక్కడా కనుపించలేదు—

ఆపరేషన్‌కి వెళ్లేముందు చాలాసేపు నాకోసం చూచిందనీ, ఏమేమో మాట్లాడాలనే ఆతురత ఆమెలో వుందనీ, అతి ప్రయాస మీద ఒక నర్సుద్వారా తెలుసుకొని నిలువునా కూలిపోయాను——

నన్ను నేను మళ్లీ నిందించుకో సాగాను.

తుది ఘడియల్లోకూడా ఆలస్యం చేశానే!

ఆమె యేమనుకుందో—

ఆపరేషన్ గదిముందు ద్వారానికి యెదురుగావున్న బెంచీ మీద పిల్లలూ నేనూ కూర్చున్నాం. నేను లోపల జరిగే ఆపరేషన్ గూర్చి ఆలోచిస్తున్నాను—

క్షయ వ్యాధి!

ఊపిరితిత్తి సగం వరకూ చెడిపోయిందట!

అందుచేత ఒక ఊపిరితిత్తి తీసివేస్తారు—

ఒకే ఊపిరితిత్తితో యిక జీవితకాలం అతి విశ్రాంతిగా భారమైన పనులేవీ చెయ్యకుండా గడపాలిట!

"నాన్నా అమ్మ లోపల వుంది కదూ?" అన్నాడు బాబు.

"ఔను" లలిత జవాబు.

"తలుపులు యెంతసేపటికి తెరుస్తారో?" రఘు

"ఇవ్వాళతో అమ్మకు నయమవుతుంది కదూ?" లలిత

"ఔను" బాబు

ఆపరేషన్ గది తలుపులు తెరుచుకున్నాయి.

డాక్టరుగారు బయటికొచ్చారు—

"గుడ్ మార్నింగ్ డాక్టర్" అన్నాను

ఆయన మాట్లాడకుండా చెయ్యీ, తల వూపారు.

ఆయన ముఖ కవళికలను చూసి ఆమెకేమయ్యిందో తెలుసుకోవడానికి యెంతో ప్రయత్నించాను.

ఏమీ అర్థంకాలేదు యెంత ప్రయత్నించినా—

ఆయన్ని అడిగి జవాబు చెప్పించుకోడానికి నాకు భయంగా వుంది. పొరబాటున ఆయన విషాదకరమైన వార్త చెబితే నేను నిలబడలేని పరిస్థితి వస్తుందేమోనని భయంగా వుంది.

నా వంక డాక్టరుగారు అదోలా చూశారు.

"నా శక్తికొలదీ ప్రయత్నించాను--" అన్నారు.

నాకు మాటలు రాలేదు.

"ఆమె ప్రక్క గదిలో వుంటారు, వెళ్ళి చూడండి" అన్నారు.

గబగబా కంగారుగా వెళ్తున్నాను.

"పిల్లల్ని కూడా తీసుకువెళ్ళండి" అన్నారు డాక్టర్.

పిల్లలూ, నేనూ ఆమె మంచం చుట్టూ మూగాం—

ముగ్గురు పిల్లల్ని దగ్గరకు తీసుకొని తన హృదయానికి హత్తుకుంటూ—"మంచిగా వుంటారు కదూ?" అన్నది.

పెద్దవాడు బాబు "అమ్మా" అన్నాడు గజగజ వణుకుతూ,. రోదిస్తూ—

పిల్లలంతా గాభరాగా దుఃఖింపసాగారు—

వెంటనే నేను వాళ్ళను ఓదార్చి, ఆమెకు అతి సమీపంగా వెళ్ళాను.

ఆమె నా వంక పరీక్షగా చూసి "ఎంత మంచివారండీ, అచ్చగా మీరు యివ్వాళ పెళ్ళికొడుకులా వున్నారు, మీరు యిలా తయారై రాకపోతే చాలా బాధపడి వుండేదాన్ని నేరం చేసిన వాడిలా యేం చెయ్యాలో తోచక కన్నీళ్ళు విడుస్తూ నిలబడ్డాను—

"ఇంకా ఐదు నిముషాలు నేను మీతో మాట్లాడగలనట. త్వరగా మాట్లాడండి!" అన్నది.

మిన్ను విరిగినట్లు "ధనం!" అని పెద్దగా అరిచాను—

"ఊరుకోండి. రెండు నిముషాలు పిల్లల్ని బయటికి పంపండి అన్నది—

పిల్లలు హెచ్చరిక లేకుండానే బయటికి వెళ్ళారు—

టైమయిపోతుంది. చూడండి. ఒక్క మనవి. జీవితంలో యెన్నడు వెయ్యని ప్రశ్న కడసారిగా వేస్తున్నాను. నిర్మల హృదయంతో మనస్సు విప్పి జవాబు చెప్తారు కదూ ?"

మనస్సు ఉద్వేగంగా వుంది.

విషాదం ప్రతి అణువులోనూ ప్రవహిస్తోంది.

"నిర్మల మీకు జ్ఞాపకం వుందా?"

"ధనం!"

చెప్పండి. నిర్మల యెవరు ?"

"చాలాసార్లు చెప్పాలనుకున్నాను నిర్మల గురించి జీవితంలో యెన్నడూ అట్టి అవసరం కనిపించలేదు. చదువుకునే రోజుల్లో ఆమెకూ నాకూ చాలా సన్నిహిత సంబంధం వుంది. ఆమెను పెళ్ళిచేసుకోవడానికి నేను మనస్ఫూర్తిగా యిష్టపడ్డాను. కాని ఆమె తన తల్లిదండ్రుల మాటలను దాటలేకపోయింది. కాలం గడిచేకొద్దీ యిద్దరం దూరమయ్యాం. తరువాత నీవూ నేనూ—— అంతే"

"నిర్మలకూ నాకూ చాలా పరిచయం వుంది. అందువల్లనే ఆమె పేరుతో నేను నవలలు వ్రాశాను. ఆమె పేరుతో మీ సన్నిధిలో మెలిగాను—మీరు నన్ను "నిర్మల అని పిలిచేవారు కాదు పిలవమన్నప్పుడు చాలా బాధపడేవారు. మిమ్మల్ని వివాహమాడాక నిర్మలను ఒక మహాసభలో కలుసుకున్నాను. నాటి నుండి మీ స్నేహం యెడతెగనిదయ్యింది. నిర్మల యీపాటికి ఇక్కడకు రావలసింది. ఎందుకు రాలేదో తెలియడం లేదు. తల్లిదండ్రుల బాధవల్ల నిర్మల మిమ్మల్ని చేసుకోలేకపోయింది. కాని ఆమె పవిత్రురాలు ! ఇంతవరకూ అవివాహితగానే వుంది.

ఆమె చెప్పేప్రతిమాటనూ యెంతో సానుభూతితో జాగ్రత్తగా వింటున్నాను—గుండె పగిలిపోయింది—మృత్యు దేవత ఆమె ముఖంపై కన్పిస్తోంది!

"ఇంక నేను మాట్లాడలేను. జీవితంలో నేను మీవద్ద యెంత స్వేచ్ఛను అనురాగాన్ని అనుభవించానో చెప్పలేను. మీరు నాపట్ల చూపిన ప్రేమ మరి యేభర్త కూడా తన భార్యయెడల చూపడు. అందుకు మరో జన్మలో మీపాదదాసిగా పుట్టాలని దేవుని వేడుకొంటున్నాను—"

"లేదు ధనం, నీవే నన్ను బ్రతికించావు"

"పోనివ్వండి కడసారిగా నా మనవి ఆలకించండి. రెక్కలు రాని మన బిడ్డలకు నిర్మలదిక్కుగా తోచింది. ఆమె ఒక తల్లిగా వాళ్లతో మెలుగుతుంది. మీరు ఆమెను మనసారా స్వీకరించాలి"

ఉన్నపాటున వణికి పోయాను—

తల, వళ్లు, అంతా తల్లక్రిందులైనట్లు వింతగా భయంగా, దుఃఖంగా, దీనంగా తోచింది—

"ధనం! ఏమిటి నీమాటలు!!" అన్నాను—

"మీరు మరోలా అనుకోవద్దు. ఇది నాకడసారికోరిక. మన్నించండి. నిర్మల కూడా యిందుకు అంగీకరించింది"

నాకు మతిపోయింది—

మృత్యుశయ్యపై మాట్లాడే భార్యను యెలాయెదిరించేది?

ఎదిరించకుండా నిర్మలను యెలా స్వీకరించేది?

ఎలా? ఎలా?? ఎలా???

ఏమో? ఏమిటో? ఎందుకో?

దేవానన్ను రక్షించు

దేవాదేవా నాభార్యను కనికరించు—

"త్వరగా చెప్పండి?" అన్నది ఆమె—

అంగీకరిస్తారు కదూ?" అన్నది కూడా ఆమే—

"నిర్మల చాలామంచిది" అంటుందికూడా ఆమే—

"నా హృదయం ఒక ఆలయం, దానిలో నిన్ను ప్రతిష్ఠించుకున్నాను— ఇంకొకరికి దానిలో స్థానంలేదు—కావాలంటే నన్ను

నీవెంటనే తీసుకెళ్లు" అన్నాను ప్రాధేయపూర్వకంగా—ఆమే నావంక చూస్తుంది.

ఆమె నావంక చూసింది—

ఆమె నావంక చూస్తూనే వుంది—

ఆమెకనులు మిలమిల లాడాయి—

ఆమెకనులు నీళ్లతో తళతళ లాడాయి—

"మీ మనస్సు నొప్పించాను—క్షమించండి" అన్నది—

"లేదు నీవు చూపింది గొప్పత్యాగం—అయినా అది నాకు అంగీకృతంకాదు" అన్నాను—

"బాబూ! చిట్టితల్లీ..." అని ఆమె పిల్లల్ని పిలిచింది—

పిల్లలతో నిర్మల దివ్యమూర్తిలా ప్రవేశించింది—

ఆమె నిర్మలను చూసింది—

పెదవులు కదిపింది—

నోటమాటరాలేదు—

మాట ఆమెనోట రానేలేదు—

*   *   *

చాలాకాలం గడిచింది—

పిల్లలు ప్రయోజకు లౌతున్నారు నాచేతుల్లో—

ఎప్పుడన్నా ఏనోటన్నా, 'నిర్మలకు యింకా పెళ్లికాలేదు. ఇక పెళ్లిచేసుకోదట' అని విన్నప్పుడు—గుండె నీరైపోతుంది—

ఈసారి ఆమెను మళ్లీ చూడగలిగితే పాదాలమీదపడి క్షమాపణ వేడుకుంటాను—కన్నీళ్లతో ఆమెపాదాలు కడుగుతాను!

తాజమహలు

దామెర రాజగోపాలరావు

ఈ శోభాకృతిని సేమ
హాశిల్పులు నెలకొల్పిరో!
ఏమా సౌందర్య మహో!
ఏమా సౌందర్యమహో!!

రాజమాన మహితకీర్తి,
షాజహాను చక్రవర్తి,
హృదయ సఖీవియోగార్తి;
అది యపూర్వ కళామూర్తి:

హైందవ పారశీక బహు
సుందర శిల్ప సమేళన
జనిత వినుత ఘన సమాధి;
అనుపమాన కళావీథి!

అల భారత మాతకు ని
స్తుల నిర్మల రమ్యోజ్జ్వల
తరవజ్రాలంకారము;
వరశిల్ప కళాసారము;

వేదనతో వెన్నెలనిసి
పాదుసాహి పాడుకొన్న
చలువరాతి వలపు గీతి:
లలిత శిల్పకళా జ్యోతి!

ఇలలోపలఁ గల కాలం
బలశిల్పకళాప్రౌఢికి
నిది చక్కని తార్కాణము;
హృదయంగమ నిర్మాణము!

సాంద్ర వ్యవసాయ పథకము

ఎ.వి. గోపాలనాయుడు

1960వ సం॥ కరీఫ్ పంట కాలంలో సాంద్ర వ్యవసాయ పథకము (package programme) ప్రప్రథమంగా చిత్తూరు జిల్లాలో కాటూరు పంచాయతీ సమితిలో అమ్మపాళెం గ్రామములో ప్రవేశపెట్టితిమి. సాంద్రవ్యవసాయ పథకముయొక్క ముఖ్యోద్దేశము నూతన వ్యవసాయ పద్ధతులలో అధిక పంట పండించడమే. మా కాటూరు పంచాయతీ సమితి ఉపాధ్యక్షుని గ్రామం అమ్మపాళెం; అమ్మపాళెం గ్రామములో ఉత్సాహ వంతులైన, కష్టపడి పనిచేయగలిగిన రైతులుండుట వలనను, వ్యవసాయములో నూతన పద్ధతులను కనుగొనిన వెంటనే తమ పొలములలో ప్రవేశపెట్టి ఫలితము కను గొనగలిగిన ఆసక్తిగల యువకులుండుట వలనను, అదియునుగాక వ్యవసాయమునకుకావలసిన నీటిపారుదల వసతులు పుష్కలంగా యుండుట వలనను అమ్మపాళెం గ్రామంను ఎన్నుకొన వలసి వచ్చినది. అమ్మపాళెం గ్రామములో సరాసరి ఎకరా 1కి 20 బస్తాలు(5200పౌన్లు) పండును, సాంద్ర వ్యవసాయ పథకమును ప్రవేశ పెట్టిన తర్వాత సరాసరి పంట ఎకరా 1కి 26 బస్తాలు (6160పౌన్లు) పండినది. రైతులయొక్క నిరంతర కృషి. అనుభవజ్ఞులైన ఉత్సాహవంతులైన వ్యవసాయ శాఖ ఉద్యోగస్థుల యొక్క సలహా. సహకార సానుభూతి వలన అమ్మపాళెం గ్రామంలో సాంద్ర వ్యవసాయ పథకమును జయప్రదంగాను. సఫలీకృతంగాను, ఆశాజనకంగాను యితరులకు మార్గదర్శకంగా యుండునటులను చేయగలిగితిమి.

394 ఎకరములలో సాంద్ర వ్యవసాయ పథకం అమలు జరుపబడినది. వరిపంట 180 మణుగుల మొలగొలకులు విత్తనములు (Bcpi paddy) జబ్బురాకుండ యుండుటకుగాను అగ్రసన్‌జిన్ అనే మందుతో కలిపి నారుమడిని పోసితిమి, (28 పౌన్లు అగ్రసన్ మందును సగం ధరకు రైతులకు సరఫరా చేసితిమి. 180 మణుగుల వరివిత్తనములు రైతులకు మార్పిడి మూలంగా సరఫరా చేసివచ్చిన విత్తనములను బజారు ధరకు అమ్మివేసితిమి. ఈ విధముగా మార్పిడి వలన వచ్చిన నష్టమును సమితియె భరించినది. అనగా 394 ఎకరములలో క్రొత్త వితనములను నాటియుంటిమి. 20 ఎకరములలో వరి నారు మడి పోయడమయినది. నారుమడిని పోసిన 20 దినములకు ఎండ్రిన్ అను మందును చల్లితిమి,

శాస్త్రీయంగా చీకబెట్టిన కంపోష్టు ఎరువుల 430 టన్నులను 215 ఎకరములలో వేయడమైనది. 60 ఎకరములలో పెంచబడిన నీలి, జీలుగ జనుము మొ॥ పచ్చిఆకు పైర్లను అదే పొలములలో వేయించడమైనది. 334 ఎకరములలో పచ్చిఆకు తీసికొనివచ్చి వేయించడమైనది. ఎకరా 1కి 1200 పౌన్లు కొప్పున వేయడమైనది.

మొట్టమొదటిసారి నీరుపెట్టి దున్నునపుడు ఎకరాకు 160 పౌన్లు, 224 పౌన్లు సూపరుఫాస్ఫేటు, 80,100 పౌన్లు అమ్మోనియం సల్‌ఫేటు వేసితిమి. మిగిలిన అమ్మోనియము సల్ఫేటును నాటిన 20,25 దినములలో వేసితిమి. ఎకరాకు 30 శాతం నత్రజనిని 25, 30 శాతంను భాస్వరమును వేసియుంటిమి. సల్‌ఫేటు, సూపరు రైతులకు ఋణరూపంలో యిచ్చితిమి. (20 టన్నులు సల్‌ఫేటు 20 టన్నును సూపరు అనగా Rs.12400/-లోనుగా యిచ్చితిమి) నాటిన నెల రోజులకు రెండవసారి ఎండ్రిన్ అను మందును చల్లితిమి. 394 ఎకరములలో జపాను వరిసాగు పద్ధతిని అనుసరించితిమి. బ్లాకులోయున్న పుష్‌హోస్‌లు గాకుండా యితరంగా 20 పుష్‌హోస్‌లు రైతులకు సరఫరా చేసితిమి. అడుసులో త్రొక్కు పనిముట్లను 20 (Green manure Tramplers) రైతులకు సరఫరా చేసితిమి. సీమ జీలుగ విత్తనములు నారుపోసి పెంచి వరి పొలముల చుట్టు నాటించితిమి. 1000 పౌన్లు విత్తనములు వచ్చినవి.

పరపతి వివరములు (Credit facilities)

(1) పంపుసెట్లు కొనుటకు — 5 — Rs. 7000_00

(2) ఎరువులు విత్తనములు పనిముట్లు కొనుటకు — 5000_00

(3) మందులు సగం ధరకు సరఫరా చేసినవి — 200_00

మొత్తము — 12200_00

సాంద్ర వ్యవసాయ పథకం వలన సాధించబడిన అధిక వ్యవసాయోత్పత్తి వివరములు

(1) సాంద్ర వ్యవసాయ పథకం అమలు జరుపబడిన మొత్తము విస్తీర్ణము — ఎకర॥ 394_00

(2) పైరు — వరి

(3) మొత్తము కొనుబడి వచ్చినది — 732 టన్నులు.

(4) (విలువ — రూ. 286944/—)

బస్తా 1కి రూ. 28_00 (160 పౌనులు)

(5) సేద్యపు ఖర్చులు—394 ఎకరములు—రూ. 1,54054/—
ఎకరా 1కి రూ. 390/—

(6) లాభం—రూ. 1,32890/—

(7) మామూలు రాబడి ఎకరా 1 కి 20 బస్తాలు (160 పౌనులు) 563 టన్నులు.

(8) అదనపు రాబడి వచ్చినది. రూ. 66248/— మాత్రం అనగా ఎకరములో అదనపు రాబడి విలువ సుమారు రూ. 170/—



మేను జీర్ణముగాఁజేయుఁగాని మరణ
మొందఁజేయదు వినుకాల మెందునరుని
పూర్వకర్మంబులాయువుఁబొదలఁజేయ
సన్నముగఁజేయఁబ్రతుకును జావుఁగలదు,

భార.అశ్వమేధ.

భ్రమర శింజిని

గోపాల కృష్ణమూర్తి

వన్య గజకుంభ మౌక్తిక ప్రకర రచిత
హార భూషితలగు సవతాండ్ర నడుమఁ
గ్రొత్త నెమలి కన్నుల తోడి కొప్పు పెట్టి
కోయపడుచు కొంగు విద్రుచు కొంచుఁదిరుగు.

నీదు ముఖము తోడి సాదృశ్య మమరక
చెఱిపి లక్షసార్లు తిరిగి తిరిగి
అజుఁడు దిద్దుచుండె హరిణ లాంఛన బింబ
మతివ! చెప్పవలయు నతని యోర్మి

కలికి! మొగము వాంచి కడగంటఁజూడకు
వరుని వైపు తేరిపాఱఁ జూడు
వాని నరయవచ్చు; బహుముగ్ధవని మెంచి
"పిల్లనచ్చె"నంద్రు పెండ్లివారు.

పొడుచు చంద్రునట్లు మొగమింత యెఱ్ఱనై
కసరు కొనకె! నన్ను రుసరుసలుగ
శశిని మింట సుంత సాగనీ! పోవచ్చుఁ
జాల లోనఁ గలియు పాల పోలె.

పదము గొప్పదంచు నదను వచ్చిన దంచుఁ
బోయి తన్ని తీవ మొన్న కలికి!
మరి యశోక మొడలు మండదా? కసితీర్చు
కొనుచునుండె నిప్పుడనుభవింపు.

ఎడయుఁ బెడయుఁ గాగ నిడినట్టి మోములఁ
బండుకొనిరి గాని పతియు సతియుఁ
దృషిత మంద మసృణ కృపణీయ సితదృక్కు-
లొక్క-సారి యొఱసి పక్క-మనిరి.

దవ్వునందు వచ్చు దయితుని గనినంత
మురిసి సొక్కి కనులు మొగుడ కున్న
నెట్లు తెలియవచ్చు నింతికై నేతలోఁ
జెవిని గలువ పూవు చెజ్రివినదని!

మోసమరసి విఱ్ఱిగి పోయిన వలపులు
తిరిగి యతుకఁ బడియు విరస మగును
జలము మరగఁ గాచి చల్లార్చి త్రావినఁ
దొంటిరుచులు మరలఁ దోఁచనట్లు

కొంతయెదురెండ యైనను సుంత తడవు
కొంగు నడ్డమ్ముగాఁ బెట్టుకొనకు చెలియ!
పంకరుహమునకును నీదు వదనమునకు
సుఖకరస్పర్శమున వాసిఁ జూచునినుఁడు

తావి యానును, మునివ్రేళ్ళఁ దాకి నిమురు,
ముద్దుగొను, నవ్వి యెదహత్తి, మోడ్చుఁ గనులు
పథికునకు నిప్పపూ వెంత ప్రాణమయ్యె!
నింతి చెక్కి-ళ్ళతోఁ బోల్కి- కొంతపడసి.

ఎంతయాప్తుఁ డయిన సుంత వేళావేళ
లెంచకుండ నడుగ నెవరికేని
ఒడలుమండు; తల్లి, బుడుతఁ డద్దమరేయి
లేచి యేడ్వగఁ దగిలించె రెండు.

కడుపు నకనకలై వచ్చి కరివిభుండు
కొలని తామర తూండ్లు లుంగలుగ లాగి
కరిణి మసలిన మనసుగాఁ గనగ-నవియు
దొండమున నున్న వున్నట్లే యెండిపోయె

(శ్రీహాల మహీపతికి కృతజ్ఞతతో)

నవోదయం

క్రొవ్విడి రామం

పాత్రలు

1	రాఘవరావు	...	పంచాయతీ సమితి ప్రెసిడెంటు
2	నాగేశ్వరరావు	....	విలేజిలెవెల్ వర్కర్
3	వెంకయ్య	...	గ్రామపెత్తనదారు
4	రామయ్య	....	వెంకయ్య అనుచరుడు
5	భీమయ్య	...	రాఘవరావు అనుచరుడు
6	కృష్ణవేణి	....	యస్-ఇ-ఒ (స్త్రీ)
7	దానయ్య	...	వ్యవసాయ దారుడు

మొదటి రంగం

"జయ్! విజయ రాఘవరావుగారికి జయ్. గ్రామసౌభాగ్యానికి జయ్: అంధ్రమాతకు జయ్! మాపంచాయతీ సమితికి జయ్"...

భీమయ్య: మహాజనులారా। కొద్దిసేపు వోపిక పట్టండి, అదిగో ఆ ప్రక్కనుండి యేదో శబ్దము వినవస్తూనే వుంది, మన నాగరికతను, మనం వేసుకునే బట్టలనుబట్టిగాని మన కుండే ఐశ్వార్యాన్ని బట్టిగాని నిర్ణయించలేం. మన శీలము, మన సత్ప్రవర్తన మాత్రమే మన జీవితానిక్కి మెరుగులు దిద్దగలవు. ఈ మహాసభ ప్రార్ధనతో ప్రారంభమౌతుంది:

ప్రార్ధన.

"క్షోణితలంబునన్ నుదురుసోకగ మ్రొక్కి నుతింతుసైకత
శ్రోణికి జంచరీకచయ సుందరవేణికి రక్షితామర
శ్రేణికిదోయజాతభవచిత్తవశీకరణైక వాణికిన్
వాణికి నక్షదామ శుకవారిజ పుస్తకరమ్య పాణికిన్"

ఈనాడు మన పల్లెసీమకు మహా పర్వదినం. మన గ్రామీణ జీవితం యింత ఉచ్ఛస్థాయికి వస్తుందని మా చిన్నతనాలలో వూహించడానికైనా వీలులేక పోయింది. కొన్ని దశాబ్దాల క్రిందట నూనూగుమీసాలతో తులతూగు, నెహ్రూ పండితుడు లాహోరులో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించేరు. ఆయన గ్రామీణ ప్రజలను స్వాతంత్ర పోరాటంలో భాగస్వాములుగా చేసి వారికి స్వాతంత్ర్య పిపాసను కలిగించేరు. ఆయన జనవరి 26 వ తారీకున స్వాతంత్ర్య యోధులంతా జాతీయ పతాకంవద్ద ప్రతిజ్ఞ తీసుకోవాలని ప్రవచించేరు. ఈనాడు స్వరాజ్యం మనకు రాజకీయంగా లభించింది. ఆనాడు నెహ్రూ పండితుని పిలుపు ననుసరించి మనమంతా స్వరాజ్య పతాకం

క్రింద ప్రమాణం చేసినట్లే, నేడు యేడు లక్షల పల్లెలను శోభాయమానంగా చేసి కృషిలో మనం త్రికరణశుద్ధిగా పాల్గొంటామని ప్రతిజ్ఞ పట్టాలి. ఈ మహోజ్వలమైన ప్రతిజ్ఞాపాలనకు యీప్రాంతానికి నాయకునిగా శ్రీ రాఘవరావుగార్ని ప్రజలు ఎన్నుకోవడం ముదావహం. నూతనంగా వెలసిన యీ పంచాయతీ సమితికి అధ్యక్షులుగావారు మన కర్తవ్యాలను ప్రబోధిస్తారు.

(కరతాళ ధ్వనులమధ్య రాఘవరావుగారు వేదికపైకిరాగా భీమయ్య ఆయన మెడలో పూలమాల వేస్తాడు.)

రాఘవరావు: మీ అందరి ఆదరాభిమానాలవల్ల నేను యీ అధ్యక్షస్థానంలోకి వచ్చాను. మనపూర్వులు యెవరు, చవిచూడని వొకమహోత్కృష్టమైన సౌభాగ్యాన్ని మనం పొందే అవకాశం ప్రభుత్వం మనకీనాడు అందజేసింది. మనతండ్రుల నాడు తాతలనాడు, రాజచిత్తమే రాజనీతియై, రాజసేవయే ప్రజలధర్మమై, రాజుకోసమే దేశం నిలచింది, ఆనాడు ప్రభుత్వమే సర్వకార్యాలను నిర్వహించేది. ప్రభుత్వం నిర్వహించినకార్యాలలో ముఖ్యంగా విదేశీ ప్రభుత్వం నిర్వహించిన కార్యాలలో ప్రభుత్వ లాభాన్ని దృష్టిలో పెట్టుకుని యథావకాశంగా ప్రజల లాభక్షేమాలకు అనుగుణమైన పనులను నిర్వహించేవారు, కాని యీనాడు అలాగ కాదు. మన సమితిలో వుండే 50 గ్రామాల అభ్యున్నతికి కావాలసిన కార్యకలాపాలన్నీ మననే చేసుకోమన్నారు. ఆ బాధ్యత యావత్తూ మనకే అప్పజెప్పేరు. కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కొంతధనాన్ని మన సమితికి యిచ్చి యీ ప్రజాక్షేమ సంస్థాపనోద్యమానికి వినియోగించమన్నారు. ఈ కార్యకలాపాలలో మనకి తగిన సలహాలిచ్చి, మనం నిర్మించేరోడ్లు, త్రవ్వించే నూతులు, అమలుపరచే ప్రణాళికలు సవ్యంగా కొనసాగించడానికి ప్రభుత్వ సాంకేతిక నిపుణులు మనకు నిత్యం సహాయం చేస్తూవుంటారు. మనం వేసిన రోడ్లు దృఢంగాను చక్కగాను వుండడానికి తగిన సలహాలను యిచ్చేందుకు ప్రభుత్వ యింజినేర్లు, ఓవర్సీరులు మనకు అండగా నిలుస్తారు. జపానువరిసాగు, సహకార వ్యవసాయం మొదలైనవి తలపెట్టినప్పుడు వాటి గురించి సహాయం చెయ్యడానికి వ్యవసాయశాఖ వారు సిద్ధంగా వుంటారు,

ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వానికి బదులుగా మనమే ప్రజాక్షేమ కార్యకలాపాల్ని నిర్వహించుకోవాలి, మన కృషికి ప్రభుత్వం సహాయం చేస్తుంది. ఇది నిజంగా ప్రజాప్రభుత్వం సాధించిన ఘన విజయం.

(కరతాళధ్వనులు)

మీరంతా యింత వుత్సాహంగా వున్నారు. మంచిదే ఉత్సాహమే సగంబలం, కాని యిది కేవలం సోడాబుడ్డి పొంగులాగ క్షణకాలం మాత్రమే వుండి అంతర్ధానమైతే ఎంతమాత్రం ప్రయోజనం లేదు, ప్రభుత్వం యిచ్చే సాంకేతిక సహాయాలను చేయూతగా తీసుకొని ప్రజలకుండే సర్వ శక్తులను వినియోగిస్తే మనం అభివృద్ధి పొందగలం, అభ్యుదయం మనకృషి పైన ఆధారపడి వుందన్న మాట మరచిపోకండి,

భీమయ్య: పంచాయతీ సమితుల లక్ష్యాలన్ని నూతన అధ్యక్షులు చక్కగా వివరించారు. మన సమితి జరుప వలసిన కార్యక్రమాలన్నీ త్వరలోనే మీకు తెలియజేస్తాం. ఇంతటితో యీ సభ ముగిసింది.

(నాగేశ్వరరావు ప్రవేశం)

నాగేశ్వరరావు: నమస్కారమండీ

రాఘవరావు: ఎవరు నాయనా నువ్వు.

నాగేశ్వరరావు: నేను ఇక్కడ V.L.W. గా వున్నాను. నన్ను నాగేశ్వరరావు అంటారు. తమరునన్ను ఇక్కడ కలుసుకోమని నిన్న కబురు పంపేరు.

రాఘవరావు: ఔనౌను. మంచిసమయానికి జ్ఞాపకం తెచ్చావు. నీ పర్యవేక్షణలో యే యే గ్రామాలున్నాయి?

నాగేశ్వరరావు: రావి వలస,రామాయపాలెం, గాజులరేగ,రెల్లివలస

రాఘవరావు: గాజుల రేగ,రెల్లి వలస. దరిగ్రామాలే కదూ!

నాగేశ్వరరావు: ఔనండీ కానీ బొత్తిగా నాటుత్రోవయేమీ బాగులేదు. వర్షాలు పడితే మునికెడు బురదలో నుంచి నడవాలి

రాఘవరావు: ఆ రెండు గ్రామాల ప్రజలు ఎట్టకోనేరు నీరే వాడుతున్నారు కదూ!

నాగేశ్వరరావు: చిత్తం.

రాఘవరావు: (క్షణకాలం ఆలోచించి)చూడు ఆరెండు గ్రామాలను కలిపే రోడ్డు వొకటి అక్కడ ప్రజలు నిర్మించుకుంటే ఆ కొత్త బాట ట్రంకు రోడ్డుతో కూడా కలుస్తుంది. గనుక వాళ్ళకు రవాణా సౌకర్యాలు యెక్కువౌతాయి, ప్రజలకు

కూడా యెక్కువ సదుపాయంగా వుంటుంది. ఈ రోడ్డు గాక ప్రత్యేకంగా ఎట్ల చెరువుకు వొక బాటనిర్మించుకోవాలి

నాగేశ్వరరావు: చిత్తం,

రాఘవరావు: చిత్తమన్నంతమాత్రాన మన పని పూర్తిగాదు. నీవు వెంటనే ఇంజనీరుగార్ని ఆ ప్రాంతానికి తీసుకుని పోయి ఆ రోడ్లకు కావలసిన ప్లాను వేయించాలి ఆ రెండుగ్రామాల్లోనూ ఎన్ని బళ్ళు ఉన్నాయో, వారు సహాయార్థం యితర గ్రామాలనుండి యెన్నిబళ్ళు తెచ్చుకోగలరో. కనుక్కొని రోడ్ల నిర్మాణానికి కావలసిన రాళ్ళు, మన్ను, ఆ గ్రామాల ప్రజలు తీరిక సమయాల్లో తెచ్చి కుప్పలుగా పోసే యేర్పాటు చేయించు.

నాగేశ్వరరావు: అలాగేనండి. తప్పకుండా చేస్తాను శలవు

రెండవ రంగం

(రావి వలస గ్రామంలో గ్రామ పెత్తన దారు వెంకయ్య యిల్లు. వెంకయ్య వీధి అరుగు మీద చుట్టకాలుస్తూ పచారు చేస్తూ యేదో ఆలోచించు కుంటూ వుంటాడు, రామయ్య ప్రవేశం.)

రామయ్య: ఏం, వెంకయ్య మామా. మొహం వేలేసావు

వెంకయ్య: రోజులు మారేయిరా, బాబూ!

రామయ్య: రోజులు ఎప్పటి లాగే వున్నాయి రోజులు మారడమేమిటి వెంకయ్యమామా. మనుషుల తత్వాలు ఫిరాయించాయను

వెంకయ్య: అదే అదే నేనన్నదిన్నూ. పూర్వం చూసేవట్రా యీవూడుపుల సీజనులో నన్ను ఊపిరి తీసుకోనిచ్చే వారా? రూపాయంటే రూపాయి, రూపాయిన్నరఅంటే రూపాయిన్నర! రైటు, అని వడ్డీముందు చెల్లించి డబ్బు తీసుకెళ్ళే వాళ్ళు.

రామయ్య; అదేమిటి మామా నాకు తెల్దా, బంగారం పెట్టినేను డబ్బు తీసుకెళ్ళలేదా? రూపాయికి బేడ వడ్డీ చెల్లించే వాడ్నిగదూ!

వెంకయ్య: అంతేకాదు బాబూ ఆరెల్లి వలస వాళ్ళు సాలుపొడుగునా గడ్డిమనకు పడేసిపోయే వారు,

రామయ్య: అదేమిటి మామా గడ్డి తింటున్నా వేమిటి

వెంకయ్య: నేపుకాదురా వెట్టి మొహమా, మా పసువుల గడ్డి మాట చెప్పేను. బాగుంది, సరే దానిమాటకేంగాని అసలు మొహమాటానికి నారుకట్టు కూడా ఊడిచి వెళ్ళిపోయే వాళ్ళు కదూ? కానీ పుచ్చుకోకండా

రామయ్య: అయితే యిప్పుడేమయింది.

వెంకయ్య. ఆరెల్లివలసలో కోపరేటివ్ బ్యాంక్ పెలసిందట. ఆ బ్యాంకువాళ్లు సాలుసకు రూ. 6-25 న. పై. చొప్పున వడ్డీకి అప్పు లిస్తున్నారట! వాయిదాల మీద రుణం తీర్చుకోవచ్చునట ఎంత శక్తివుంటే అంత జమ కట్టుకోవచ్చునట. ఆ బ్యాంకు ధర్మమా అని యీసంవత్సరం ఆ దరి గ్రామాలవాళ్లు వొక్కరూ కూడా మనదగ్గరకు రాలేదు. మనకు యీ సీజను టైములో వొక్క కాని కూడా ముట్టలేదు.

రామయ్య: అంతే కాదు మామా, వ్యవసాయదార్లు నూతులు త్రవ్వించు కోడానికి పశువులను కొనుక్కోడానికి కూడా యిప్పుడు ప్రభుత్వం ఋణాలిస్తున్నారట.

వెంకయ్య: అన్నట్టు అసలు సంగతి మరచిపోయేను. మన కొత్త పెసరట్టుగారు లోకం కొత్తగా మరమత్తు చేస్తున్నారని విన్నాను. గౌరవంగా పెత్తనం చెలాయిస్తున్నమనకు యిక నుంచి వెట్టిచాకరీలు గ్రామనౌకర్లు చెయ్యనక్కర్లేదని వాళ్లకి మంత్రోపదేశం చేశాడట. మాలా మీలా అంతా కలిసి పని చెయ్యాలిట పెద్ద మొనగాడిలా మొన్న పార, గునపాం పట్టుకొని రోడ్డు వెయ్యడానికి తానేనడుంకట్టేడుట దానితో తీరిపోలేదు బాబూ! నేను ఆ పనికి రాలేదని నా మీద రొనరొస లాడేడట, అది నిజమే అంటావా?

రామయ్య: అంతే కాదు మామా, నీవింకా నిన్న రాత్రి కలలోనే వున్నావు. తాతలనాటి క్షేత్రాలను అంటిపెట్టుకొని సోమరిపోతుల్లా కాలక్షేపం చేసేవారికి అసలు స్థానమే లేదట దున్నేవాడిదే భూమి.

వెంకయ్య: (త్రుళ్లిపడి) దున్నేవాడిదే భూమా, అరె వీడి తస్సాదియ్యా, బహుబాగుంది వ్యాపారం, కొంపదీసి నా 80 ఎకరాల భూమి రైతులదేనంటాడేమిటి చెప్మా.

రామయ్య: ఏమో నీ దినాల సామాన్యం యెలా వుందో.

వెంకయ్య: (క్షణకాలం ఆలోచించి) నేనేం అంత చౌకగా దొరికేనా, దున్నిన వాడిదే భూమి అయితే కుట్టినవాడిదే బట్ట, కట్టిన వాడిదే యిల్లు అని ప్రచారం చేస్తాను.

రామయ్య: భేష్: అలాగ తప్పకుండా చెయ్యి మామా. పక్షి రాజ్యం ఔతుంది.

వెంకయ్య: పక్షిరాజ్యం యేమిటిరా, యీ ప్రెసిడెంటు మజా యేమిటో నేనూ చూస్తాను. ఈ దెబ్బతో పెత్తనదారు ససవకాడని తేలిపోవాలి.

రామయ్య: మామా! దీని మాటకేంగాని మనవాళ్లంతా సహకార వ్యవసాయానికి పొలానికి వెళ్తున్నారు, చూసేవా?

వెంకయ్య: వాళ్ల వెనకాల అదెవడోయ్ ఆ క్రొత్త మొహం.

రామయ్య: వాడే VLW.

వెంకయ్య: అదేమిటి ఆ పేరు PWD లాగ?

రామయ్య: VLW అంటే విలేజి లెవల్ వర్కర్ అన్నమాట. ప్రజల సదుపాయాలను సమకూర్చడంలో ప్రజలకి ప్రభుత్వానికి మధ్య వ్యవహరించే సంధానకర్త యీ మహానుభావుడు. అదిగో అతడు వస్తున్నాడు అతన్నే అడుగు చెబుతాడు.

(V L W వెంకయ్య దగ్గరికి వస్తాడు.)

నాగేశ్వరరావు: వెంకయ్యగారూ నమస్కారం. మీదయ మామీద బొత్తిగా లేనట్టుంది.

వెంకయ్య: నేనేం చెయ్యగలను నాయనా కాటికి కాళ్లు జాచుకు కూర్చున్నాను.

నాగేశ్వరరావు: అదేమిటండీ అలాగంటారు. గ్రామ పెత్తనదార్లు భూకామందులు మీకేమండీ. మొన్న రావివలస వాళ్లు వేస్తున్న రోడ్డుకు మీరు రెండు బళ్లు అయినా సాయం చేసేరు కారు!

వెంకయ్య: మంచిపనే నేను ఈమధ్య వూళ్లో లేనయ్యా. కాక యిలాటి పనులు మనవల్ల యేమౌతాయి బాబూ

నాగేశ్వరరావు: అలాగ అనకండి. భారత దేశంలో అమలు పరచబడ్డ కమ్యూనిటీ ప్రాజెక్టు కార్యక్రమాలన్నిటిలోనూ రోడ్ల నిర్మాణ కృషిమీద ప్రజానీకం దృష్టి పూర్తిగా ప్రసరించింది. ఈ ప్రణాళిక అమలు జరిగిన రెండేళ్లలోనూ సుమారు 12 వేల మైళ్ల పైగా రోడ్ల నిర్మాణం జరిగింది. రోడ్లకు అవసరమైన స్థలాల్ని ప్రజలేయిచ్చారు. మట్టిపని, గూడా పూర్తిగా ప్రజల సహకారంతోనే జరిగింది,

వెంకయ్య: సరే దానికేంగాని ఈ కూలివాళ్లంతా ఎక్కడికి వెళ్లుతున్నారు.

నాగేశ్వరరావు: గాజులరేగ రెల్లివలస దరిగ్రామాలే కదుబాబూ ఆ రెండువూళ్ల తాలూకు పల్లం కలిసే వుంది.

వెంకయ్య: అవి అన్నీ నేను పుట్టి పెరిగిన స్థలాలే! నాకుకొత్తగా చెప్ప నక్కరలేదు,

నాగేశ్వరరావు: అదే! అదే! యిప్పుడు ఆ రెండు గ్రామాల ప్రజలు ఆ 80 ఎకరాల పల్లాన్ని యేకఖండంగా చేసి ట్రాక్టర్ సహాయంతో దున్నించి యేకంగా వరిసాగు చేస్తున్నారు. సముద్రం అంత చెరువు వుంది గనుక వర్షం లేకపోయినా నీటిబాధ వుండదు. ఈ 80 ఎకరాల పల్లంలోనూ కనీసం 60 గరిశలైనా పండించి, చౌకడిపోల ద్వారానూ, సహకార డిపోలద్వారానూ తిండిగింజలు మన సమితి చౌకగా సప్లయి చేయించాలని· మా ప్రెసిడెంటుగారి ఉద్దేశం, యిలాగ చేస్తే మన సమితి గ్రామాలలో చాలా వరకు తిండిగింజలకు కటకట తగ్గిపోతుంది.

వెంకయ్య: ఇదేమిటయ్యో! యీ వ్యాపారం అంతా తారుమారుగా కనిపిస్తోందే. భూముల హద్దులన్నీ తుడిపించి యేకఖండంగా చేస్తే యెవరిభూమియేదో యెలాగ పోల్చుకుంటారు. అసలు యీ పద్ధతి అమలు జరిగితే క్రయ విక్రయాలకు అవకాశం వుండదన్న మాట! శబాష్! యీ యేర్పాటు బాగుందయ్యా

నాగేశ్వరరావు: ఎంతమాట శలవిచ్చేరు, పంచాంగాలు పోతే నక్షత్రాలు పోతాయా? ఈ సహకార వ్యవసాయం వల్ల వ్యక్తులకు భూములపై వుండే హక్కులకు యెంతమాత్రం భంగం కలుగదు. అందరూ సహకారంతో కృషిచేస్తే, పంటలు యెక్కువౌతాయి. మదుపులు తగ్గుతాయి.

వెంకయ్య: నాకెందుకు బాబూ యీసొద అంతానూ అన్ని బాగానే వున్నాయి. యేదో వెళ్లి మీపని చూసుకోండి.

(V L W వెళ్లిపోతాడు)

రామయ్య: విన్నావా వెంకయ్య మామా! ఆ ధోరణి?

వెంకయ్య; తెలిసిందిరా! బాబూ! తెలిసింది!

రామయ్య: అయితే మనపని యింతేనా?

వెంకయ్య: అదికాదురా వెట్టివాడా సమయంకోసం చూస్తున్నాను. ఈ నాయకులు వినాయకులు రేపు ప్రొద్దున్న రోడ్డుపని కోసం రాళ్లకు మా కొండకొస్తే అప్పుడు చూపిస్తాను నా తడాకా!

మెతుకులు జల్లితే కాకులు కరువా? అప్పుడు తెలుస్తుంది పెత్తనదారు గొప్పో, పెసరట్టు గొప్పో?

(అంటూ వెంకయ్య వెళ్లిపోతాడు)

3 వ రంగం

(రాఘవరావుగారి యింట్లో కచేరి సావిడి రాఘవరావుగారు కుర్చీమీద కూర్చుని, ఎదురుగావున్న టేబిలుమీద గల కాగితాలను చూస్తూవుంటాడు అక్కడేవున్న కుర్చీమీద కృష్ణవేణి కూర్చుంటుంది. భీమయ్య ప్రవేశిస్తాడు.)

రాఘవరావు : ఒహో! భీమయ్యగారా! దయచేయండి

భీమయ్య : ఏమిటీ, కృష్ణవేణమ్మగారుకూడా వచ్చేరే ఏమమ్మా బాగున్నారా?

కృష్ణవేణి : మీ దయవల్ల

భీమయ్య : ఏదో పనిమీద వచ్చినట్టుంది. ఊరకరారు మహాత్ములు

కృష్ణవేణి : రేపు దశమీ, బుధవారంనాడు రామాయపాలెం, మాతా శిశు సంక్షేమ కేంద్రంలో ఆరోగ్య వారోత్సవం చేస్తారు దానికి అధ్యక్షులుగా శ్రీ రాఘవరావుగారిని ఆహ్వానించాలని వచ్చేం.

భీమయ్య : ఏమిటో యీ వొక్కటే ఆరోగ్యవారం మిగతా 51 వారాలు అనారోగ్య వారాలున్నూ.

కృష్ణవేణి : తప్పెవరిదంటారు? ఈ వారమంతా ఆరోగ్య సూత్రాలు ఆహారవిలువలు నైతిక వర్తనా అన్నీ మేం చెబుతాం. ప్రజలు వాటిని పెడచెవిని పెట్టి మిగతావన్ని అనారోగ్య వారాలుగా చేస్తే యెలాగ? మేం యీ వారం యిచ్చిన సూచనలతో వారు మిగతావన్నీ కూడా ఆరోగ్యవారాలుగా చేసుకోవాలి.

రాఘవరావు : చక్కగా చెప్పేవమ్మా, అన్నట్టు ఆ కేంద్రంలో ఎన్ని "బెడ్సు" (పడకలు) ఏర్పాటు చేసారు,

కృష్ణవేణి : సిక్సుబెడ్సు వున్నాయండీ

రాఘవరావు : కొత్త లేడీడాక్టరుగారు యెవరో — — —

కృష్ణవేణి : లేడీడాక్టరుగారు, ఇద్దరు మంత్రసానులు ఒక ఆయా కూడా వచ్చేరండీ.

రాఘవరావు : ఆ కేంద్రానికి కావలసిన సామగ్రి అంతా సప్లయి అయిందా.

కృష్ణవేణి : చాలావరకు మందులు పనిముట్లు వచ్చేసేయండి. ఇంకా కొద్దిగా సామగ్రి జిల్లా కేంద్రం నుండి రావలసి వుంది.

భీమయ్య : శివుని ఆజ్ఞలేనిదే చీమ అయినా కుట్టదంటారు మా చిన్నతనాల్లో ఏ మంగలి అచ్చమ్మో, ఏ చాకలి వెంకమ్మో అంచక్కా యిట్టే పురుడు పోసి వెళ్ళిపోయేది. ఆపిల్లలకు ఏ కాకరాకు పసరో, దుంపరాష్టమో కాస్త పట్టేస్తే పిడి కుచ్చులాగ 80 యేళ్లు బ్రతికేవారు. యీనాడు మందులూ యెక్కువైనాయి. రోగాలూ యెక్కువైనాయి.

కృష్ణవేణి : భీమయ్యగారూ, బొత్తిగా అంతకంతకు చాద స్తపు మనుషులైపోతున్నారు. ఒక్కసారి ఆ హరిజనవాడ వెళ్ళి ఆ పిల్లల్ని తల్లుల్ని చూడండి. తీతువుపిట్టల్లాగ కాళ్ళు బిందెల్లా కడుపు గల పిల్లల్ని చూస్తే ఏ తల్లి కడుపు తరుక్కుపోదు చెప్పండి. ప్రసవ సమయంలో తగిన వైద్య సహాయం లేక, పిల్లలకు తగినపోషణ లేక యెన్ని కుటుంబాలు నేలకలిసిపోతున్నాయో మీకేం తెలుసు.

భీమయ్య : అన్నీ బాగానే వున్నాయి కాని, అల్లుడి నోట్లో శని వుంది అన్నాడట పూర్వం ఒకాయన. కాని ఆ సమయానికి ఉచితంగా సహాయం అందాలి కదా. ఇంతకీ అంతా తైలం తోనే వుంది ప్రపంచం.

రాఘవరావు : అదే పొరపాటు. ఈనాడు ప్రజలకోసమే యీ సంస్థలన్నీ యేర్పాటు అయినాయనిన్నీ ప్రజలే వాటిని నడుపుకుంటున్నారనిన్నీ అధికార్లకు కూడా తెలుసు, ప్రజలకు వుపయోగపడని సంస్థగాని, అధికారి కాని యిక ముందు యెక్కువ కాలం మన్నదు,

భీమయ్య : అయితే తెలియక అడుగుతాను. ఇక్కడ వొక్క మందులివ్వడమేనా లేక — — —

కృష్ణవేణి : పసిపిల్లలకు వికాస వినోదాలిచ్చే ఆటలు, ఆడుకోడానికి ఆ ప్రక్కనే చిన్న పార్కు నిర్మిస్తున్నాం. పిల్లల ఆరోగ్యాభివృద్ధి కోసం పాలు, పళ్లు సప్లయి చేస్తాం.

భీమయ్య : అమ్మ బాబోయ్ అన్ని పళ్ళెక్కడివి.

కృష్ణవేణి : తల్చుకుంటే యెక్కడినుంచైనా వస్తాయి. రావివలస రామాయపాలెంలో వున్న కమలా తోటలు, బత్తాయి తోటలలో పండిన పళ్లు 100 కి 20% చొప్పున పిల్లల పోషణార్థం మా కేంద్రానికి ఆ తోట యజమానులు

ఉచితంగా పంపుతున్నారు. ప్రభుత్వం పాలపొడి డబ్బాలు సప్లయి చేస్తుంది.

భీమయ్య : భేష్, భేష్, బాగుంది యీ యేర్పాటు.

కృష్ణవేణి : చూడండీ, ప్రతి శనివారం ఆరోగ్య కేంద్రానికి దగ్గిరగా వున్న పల్లెలలో స్త్రీలంతా మధ్యాహ్నం 3 గంటలకు యిక్కడ సమావేశమౌతారు. వారిలో బాగా పాడగల స్త్రీలు చక్కని భజన కీర్తనలతో అక్కడకు వచ్చిన వాళ్ళందరినీ రంజింపజేస్తారు. అనంతరం లేడీ డాక్టరు గారూ నేనూ ఆరోగ్య సూత్రాల గురించి, శిశురక్షణను గురించి, ఆహారపు విలువలను గురించి అక్కడ వారికి బోధిస్తాము. కొంత కాలం పోయిన తరువాత ప్రతీ పల్లెలోనూ యీ ప్రార్థన సమావేశాలు ప్రారంభమౌతాయి. వాటితో పాటు మా ప్రచారం కూడా సాగుతుంది. ఏమండోయ్ భీమయ్యగారూ యిదొక క్రొత్త వింత. పొగ లేని పొయ్యిలని కనిపెట్టారు వాటినే మగన్‌చూలా అంటారు. ఈ ఆరోగ్య వార ప్రదర్శనలో ఆ పొగలేని పొయ్యిలను యెలాగ వుపయోగించాలో వాటి సౌకర్యం యేమిటో బోధిస్తాం.

రాఘవరావు: కృష్ణవేణమ్మగారూ పల్లె ప్రజలకి Waterclosets వుపయోగం తెలిసిన నాడు వూళ్ళో వున్న వీడులు పబ్లిక్ పాయిఖానాయిగా మారకుండా శుభ్రంగా వుంటాయి. VLW గారితో చెప్పి ఆరోగ్య వారంలో వాటి వుపయోగం కూడా ప్రచారం చెయ్యమని చెప్పండి హెల్తు డిపార్టుమెంటు కూడా అతనికి సహాయం చేస్తారు.

కృష్ణవేణి : అలాగేనండి

(తెరలో పాట)

పాట : ఏడవకు కుశలవుడ రామకుమార,
ఏడుస్తె నిన్నెవ్వరెత్తుకుందూరు,
ఉంగరమ్ములు గొనుచు ఉయ్యాల గొనుచు,
ఊర్మిళా పినతల్లి వచ్చెనేడవకు,
పట్టుటంగీగొనుచు పులిగోరుగొనుచు,
భూదేవిఅమ్మమ్మ వచ్చె నేడవకు;
రావిరేకలుగొనుచు రత్నాలు గొనుచు,
లక్ష్మన్న పినతండ్రి వచ్చెనేడవకు
ఏడవకు కుశలవుడ రామకుమార,
ఏడిస్తె నిన్నెవ్వరెత్తుకుందూరు.

భీమయ్య : ఏమిటమ్మా యీ పాట యింత మధురంగా వుంది. ఎవరు పాడుతున్నారు చెప్మా

కృష్ణవేణి : శిశు సంరక్షణ కేంద్రంలో 5 రోజుల క్రిందట ప్రసవించిన హరిజన యువతి సావిత్రి తన చిన్నారి పాపని జోలపాడి నిద్రపుచ్చుతున్నది.

భీమయ్య : కృష్ణవేణమ్మగారూ మీకేం దివ్య దృష్టి వుందా చూడకుండానే అది సావిత్రి పాటని చెబుతున్నారు.

కృష్ణవేణి : (నవ్వుతూ) పాట వినడానికి చెవి వుంటాలిగాని కన్నులక్కరలేదు. కంఠ స్వరాన్నిబట్టి ఆపాట సావిత్రిదని పోల్చుకున్నాను.

భీమయ్య : బాబూ రాఘవరావుగారూ నేను వచ్చి చాలా సేపయింది సెలవు (అంటూవుండగా దానయ్య ప్రవేశం)

దానయ్య : బాబో! చంపేశాడు! రక్షించండి రక్షించండి! మరిమేం యిక్కడ బ్రతకలేం, మా కొంప మునిగింది!

రాఘవరావు : (తృళ్ళిపడి లేచి) ఏమిటి దానయ్యా! ఎందు కాకంగారు! అసలు విషయం చెప్పవోయ్

భీమయ్య : ఫరవాలేదు తాపీగా నీ బాధ ఏమిటో చెప్పు

దానయ్య : బాధ! అని మెల్లగా అంటారా బాబూ మా ప్రాణాలు పోయేయనుకొండి కొత్తరోడ్డు వెయ్యడానికి నాకొడుకూ మా మేనల్లుడూనేనూ బళ్ళు తోలుకొని కొండకువెళితే(వెక్కి వెక్కి యేడుస్తాడు)

కృష్ణవేణి : కొద్దిగా శాంతించు నాయనా అక్కడ యేం జరిగింది.

దానయ్య : ఆ వెంకయ్య ముండాకొడుకు నానాతిట్లు తిట్టి మమ్మల్ని వాళ్ల గ్యాంగు కూలీలచేత ఇలా చావగొట్టించేడు. నా కొడుకుకైతే తలమీద గొప్ప దెబ్బ తగిలింది. వాడి ప్రాలుద్ధం యెలాగుందో? నాకు వీపుమీద కాళ్లమీద దెబ్బలు కొట్టేరండి ఆ దుర్మార్గులు.

భీమయ్య: అసలీ జట్టీ ఎందుకొచ్చింది

దానయ్య; జట్టీలేదు గిట్టీలేదు బాబూ ఆకొండ వాడి తాతగారి సొమ్మట. ఆరాళ్లు మేము దొంగిలించేమని మమ్మల్ని కొట్టించేడు. అంతటితో పోలేదు. ఆరాళ్ల మేందొంగిలించేమని పోలీసు కేసు పెడతాడట!

కృష్ణవేణి: బాగుంది మొగుడ్నికొట్టి మొగసాలెక్కినట్టుంది వ్యాపారం.

భీమయ్య: అంతపొగరుగా వుంది వాడి వ్యాపారం. మొన్నకలెక్టరు గారు సర్వేచేయించి ఆ ఎర్రకొండ గవర్నమెంటుదే నని స్పష్టంగా వూళ్ళోచాటించేరు ఆనోటీసుకూడా వాడికిఅందినది రాఘవరావుగారూ! దెబ్బకు దెబ్బ తియ్యాలి లేకపోతే వాడు లొంగడు.

రాఘవరావు: అదేపొరపాటు! యిప్పుడు వెంకయ్యను మనం కొట్టి నంత మాత్రాన వీళ్లగాయాలు మానాయా! భీమయ్య గారూ! ముందు వీళ్ళని ఆసుపత్రికి చేర్పించి చికిత్స చేయించండి. కృష్ణవేణమ్మ గారూ! మీరు కూడా యీగాయ పడ్డ వారికి ధైర్యం చెప్పి పరిచర్య చేయ్యండి మిగతా పని వాళ్లకైనా, వెంకయ్యవల్లగాని వాళ్ల పార్టీవల్లగాని యెటు వంటి విపత్తురాకుండా తగిన బందోబస్తు చేయించండి. ఈ పనులు మొదట జరిగిన తరువాత వెంకయ్య తలబిరుసు కట్టించి వాడిని దారిలోకి తీసుకువస్తాను. చికిత్సకుముందు వాళ్లని ఆసుపత్రికి చేర్పించండి. నేనుకూడా అక్కడికి వచ్చి డాక్టరు గారితో మాట్లాడతాను.

4 వ రంగం

(సమాజ విస్తరణ కేంద్రం, నాగేశ్వరరావు నూలు వడు కుతూ పాడుతూ వుంటాడు. దానయ్య నూలుకు రంగువేస్తూ వుంటాడు.)

నాగేశ్వరరావు: (పాట) "శుష్కవాదములు శూన్యప్రియములు
శుష్కయత్నములు వ్యర్థమురా
విలువలేని కోట్ల జనాభాకెల్లను
విలువ లొసగురా యీ తకిలీ;

(భీమయ్య ప్రవేశం.)

భీమయ్య: యేమిటి దానయ్యా యీ సమాజవిస్తరణ కేంద్రం లో నువ్వు కూడా చేరావేమిటి

దానయ్య: ఔనన్నా ఆ గుడ్డిముక్కలు రెండు దున్ను కున్న తరు వాత వుట్టినే కుర్చుంటే యే మొస్తుందని నూలుకు రంగు వెయ్యడం నేర్చుకుంటున్నాను.

భీమయ్య: రాత్రికూడా నువ్వు యిక్కడ కొస్తున్నట్టుంది,

దానయ్య: రాత్రి యీ నాగేశ్వరరావు గారు చదువు చెబుతున్నారు.

భీమయ్య: భేష్! భేష్! అరవయ్యో యేట చదువు కోక మన్ను కొట్టుకుంటాను అన్నట్టు బాగుందయ్యా నీవ్యాపారం. చిన్న ముచ్చట చెబుతాను వినవయ్యా. పూర్వం వొక మనుమ డు వాళ్ల అమ్మమ్మ దగ్గరకువెళ్లి అమ్మమ్మా! నీకు చదువు చెబుతానురా!అన్నాడు అబ్బాయి వెంటనే మన పెద్ద బాలశిక్ష తీసి ఆవుకు రెండు కొమ్ములుండును. 4 కాళ్లు కూడా వుండును. ఒక తోక కూడా వుండును! అని చెప్పే టప్పటికి వాళ్లమ్మమ్మకి కోపంవచ్చి వెధవా 4 కాళ్లు కాకపోతే, ఆవుకి 40 కాళ్లు వుంటాయా అని వాడిని తిట్టి పాలు యెలాగ తోడుపెడతారో వెన్న యెలాగ తీస్తారో పశువులను యెలాగ పెంచుతారో అన్ని వివరంగా తిరిగి మనుమడికి బోధించిందట.

నాగేశ్వరరావు:- భీమయ్యగారూ అయితే! యీ ఉపోద్ఘాతమంతా ఎందుకూ అని!

భీమయ్య: - ఈవయస్సులో దానయ్యకు చదువు నిష్ప్రయోజనం అని నా అభిప్రాయం.

నాగేశ్వరరావు: చదువుఅంటే "కా" కింద "స" రాస్తే ॥యిక్కస॥ అని గుణింతం చెప్పడమే చదువుగాదు అక్షరు చక్రవర్తి నిశానీబాపతే అయినా మహాపండితుల కుండే వేదాంత విజ్ఞానాన్ని వినికిడి వల్ల గ్రహించి దిగ్గజాల్లాంటి వాళ్లను కూడా గజగజలాడించే వాడని వినలేదు?

భీమయ్య: ఔనౌను. మన దానయ్య మాటేమిటి అతనూ అక్షరు చక్రవర్తి అంతటి వాడంటారా;

నాగేశ్వరరావు: ఆమాటే చెబుతున్నాను. దానయ్యలాంటి వాళ్లు యీ సమాజ విస్తరణ కేంద్రాల్లో చేరితే వాళ్లకు సోషలిస్టు సమాజ వ్యవస్థ యొక్క స్వరూప స్వభావాలు క్రమంగా అవగత మౌతాయి, అభివృద్ధి అనేదియే కొందరి ప్రయో జనాల కోసమో కాకుండా యావత్ సమాజం తాలూకు శ్రేయస్సును సాధించడం జరుగుతుంది.

దానయ్య: బాగా సెలవిచ్చేరండి, మొన్నకొత్తరోడ్డు వేశాపంటే లక్షల ప్రజలు దాన్ని హాయిగా వాడుకుంటున్నారు, తరతరాలు మనపేరుమీద అది నిల్చిపోతుంది.

నాగేశ్వరరావు: ఇటు చూడండి పారిశ్రామికాభివృద్ధిలో ఒక ముఖ్యాంశం లఘుపరిశ్రమల అభివృద్ధి. ఈ కేంద్రం లో నూలు వడకటం, నూలుకు రంగువేయడం, మట్టితో రక రకాల కూజాలు బొమ్మలు మొదలైనవి యెన్నో వస్తువులు చెయ్యడం నేర్పుతాం. మన కోనేటి గట్టు జింకపట్టి యీ

పరిశ్రమకు యెక్కువగా వినియోగ పడుతుంది. ఈ పరిశ్రమల అభివృద్ధివల్లను పాధి సౌకర్యాలు లభ్యమౌతాయి. అనేక మైన లఘుపరిశ్రమలలో కృష్ణవేణమ్మ గారు యీ ప్రాంతం వాళ్ళకు అర్హమైన శిక్షణ యిస్తున్నారు. అన్నట్టు కృష్ణవేణమ్మ గారిక్కడే వుండాలి (కృష్ణవేణమ్మ గారూ! అని గట్టిగా పిలుస్తాడు)

కృష్ణవేణి: ఏమండి నాగేశ్వరరావు గారూ యెందుకు పిలిచారు

నాగేశ్వరరావు: ఏమిలేదమ్మ భీమయ్య గారికి మన కేంద్రంలో తయారైన వస్తువులు చూడాలని వుందట వొక్కసారి అవిచూపిస్తే.

కృష్ణవేణి: దానికేం భాగ్యం ఇవిగో చూడండి, (కేంద్రంలో తయారైన) పట్టి కూజాలు, రంగునూలు, బుట్టలు చూపించును)

భీమయ్య: భేష్, భేష్, చాలా బాగున్నాయమ్మా. మన వాళ్ళకు యీ మాత్రం చాకచక్యం వుందని నేను యెప్పుడు అనుకోలేదు. కానీ నాగేశ్వరరావు గారూ! మా దానయ్యకు యీ వయస్సులోచదువు యేమైనా.చదువు వంటపడుతోందటారా:

నాగేశ్వరరావు: అసలు వయోజన విద్య అంటే మొదటి నుంచీ కొంత వైముఖ్య యేర్పడింది, దానికేం గాని మీ పొలానికి వేసే ఎరువులు ఎక్కడ యెక్కడ తయారౌతున్నాయో మీకు తెలుసా?

భీమయ్య : ఓ! తెలియకేం ! కంపెనీల్లోను

నాగేశ్వరరావు : ఏ కంపెనీల్లోనయ్యా మహానుభావా!

భీమయ్య : నాకేం తెలుసు.

నాగేశ్వరరావు: మీ దానయ్యనడగండి చెబుతాడు.

దానయ్య: సింద్రీ యెరువుల ఫ్యాక్టరీ విస్తరణ వల్ల 47 వేల టన్నుల నత్రజని ఉత్పత్తి అవుతున్నది.

భీమయ్య: ఓరినీ దుంపతెగ! ఈ లెక్కంతా నీకెలా తెలిసిందిరా!

దానయ్య: ఇది వొకటే యేమిటి బాబూ వ్యవసాయానికి కావలసిన అన్ని భోగట్టాలు మాకు పాఠాలలో నేర్పుతున్నారు.

నాగేశ్వరరావు: సాముదాయక అభివృద్ధి కార్యక్రమమంతా వీళ్ళకు యీ రాత్రి పాఠశాలలో బోధించి వీరిని ఆదర్శపౌరులుగా తయారు చెయ్యవలసి వుంది.

భీమయ్య: అల్లదేవిటి-యేదో బొమ్మలా వుంది.

దానయ్య : అదా! చంద్రుడున్నాడు కదూ "బాబూ"

భీమయ్య: రావి వలసలో వున్న కోనాచంద్రుడా !

దానయ్య: కాదుబాబూ! ఆకాశం మీద చంద్రుడు.

భీమయ్య: ఓహో చందమామా! బహు బాగుంది.

దానయ్య: ఈ మధ్య రష్యావోడు ఆ చందమామ రెండోవైపు ఫొటో తీసేడట! బాబూ! అదీ ఆ బొమ్మ! నిన్న నాగేశ్వరరావుగారు దాన్ని నాకు చూపించేరు. అంతే కాదు బాబూ! తారాజువ్వలాగ మీదకెగిరే రాకెట్ అట, ఆ బొమ్మ కూడా చూపెట్టారు బాబూ

భీమయ్య : నాగేశ్వరరావుగారూ మీరెక్కడండోయ్ అసాధ్యుల్లాగ వున్నారు మొన్న మొన్నటివరకు దానయ్యను వాళ్ల అమ్మ! ఓరి జడ్డి వెధవా! నీవు యెలాగ బ్రతుకుతావురా! అని వాపోయేది. వాడిప్పుడు చూడండి యెన్ని భోగట్టాలు చెబుతున్నాడో.

దానయ్య : నాలోయేముంది బాబూ! అంతా ఆ నాగేశ్వరరావుగారే చేసేరు, నాకు యిప్పుడు వేలుముద్రపోయి సంతకం అబ్బిందంటే అది ఆ బాబు చలవే- (ప్రక్కగాచూసి) అదిగో ప్రెసిడెంటుగారు దయచేస్తున్నారు.

నాగేశ్వరరావు : దయచేయండి రాఘవరావుగారు! నమస్తే.

రాఘవరావు : నమస్తే-దానయ్యా! నీకొక శుభవార్త-నీకొడుకునీ, మేనల్లుడ్ని కొట్టిన వెంకయ్యను అతని అనుచరుడైన రామయ్యను పోలీసువారు కలక్టరువారి యెదుట హాజరు పెట్టేరు. కలక్టరుగారు వారికి సివియర్ వార్నింగులు యిచ్చి సత్ప్రవర్తనకు వారి దగ్గరనుంచి పూచీకత్తులు కట్టించుకున్నారు. మీవాళ్లకు నష్టపరిహారం క్రింద 300 రూపాయలు వాళ్లచేత యిప్పించేరు.

దానయ్య: చాలాసంతోషం బాబయ్యా! ఆ డబ్బుపెట్టి పోష్టాఫీసు సర్టిఫికేట్లు కొంటాను ముందుకి మా అమ్మాయి పెళ్లికైనా పనికి వస్తుంది.

నాగేశ్వరరావు: చాలా మంచిపని! తప్పకుండా అలాచెయ్యి.

రాఘవరావు: చూడండి నాగేశ్వరరావుగారూ నాగావళి వరదలవల్ల వెంకంపేట బూర్జవలస గ్రామాలకు ముంపు ప్రమాదం కలిగిందట, నిన్నటినుంచి అక్కడి ప్రజలకు తిళ్లుతిప్పలు లేక నానా అవస్థలు పడుతున్నారట. కాబట్టి అర్జంటుగా పది

పెద్ద బియ్యం ఇస్తాలు మనగ్రామంలో పండించిన కూరలు బళ్లమీద వేయించుకుని అర్జంటుగా అక్కడకు వెళ్లి సహాయం చెయ్యండి. డాక్టరుగార్నికూడా వైద్య సహాయానికి మందులతో పంపిస్తాను.

5 వ రంగం

(రావివలస గ్రామంలో ఎచ్చరాయివద్ద వెంకయ్య కూర్చొని వుండగా రామయ్య ప్రవేశం వెంకయ్య చుట్టచుట్టుకుంటూ కూని రాగం తీస్తూ వుంటాడు.)

రామయ్య: భేష్ వెంకయ్యమామ. శభాష్ అలాగుండాలి మన ఫోర్సు.

వెంకయ్య: ఏమిట్రా ఆగడబిడ

రామయ్య: ఏమిటని అడుగుతావా—మీప్రెసిడెంటు గారి కొడుకు మనగోపడ్ని ఏయ్ మంగలి రావయ్యా క్షవరం చెయ్యాలని పిలిచేడట మన గోపడికి చెప్పాలామాటలు. వాడన్నాడట నువ్వు పెసరట్టు కొడుకువైతే ఎవడికి గొప్ప! ప్రెసిడెంటు కొడుకువైతే యెవరికి గొప్ప; మాపెత్తనదారు శలవులేనిదే ఎలాగ వస్తాం అని యీసడించుకుని పోయేడట—అసలు నూతిదగ్గర నిన్న వాళ్ల ఆడవాళ్లకి ఏవరూ కుండకూడ యెత్తి సాయం చేయలేదట—బాగా చూపించేవయ్యా నీ తమాసా!

వెంకయ్య: ఇంకా యిప్పుడేమయిందిరా—తొందరపడకు ముందుంది ముసళ్ల పండగ. ఇక ముందు చాకలి మంగలి మొదలైన వాళ్లెవ్వరూ ఆగుమ్మంతొక్కరు. మనకు వెట్టిలు చెయ్యవద్దన్నాడుగా! ఆప్రాయశ్చిత్తం తనకే జరుగుతుంది.

రామయ్య: అన్నట్టు కొత్తగిత్తలు కొన్నట్టుంది.

వెంకయ్య: ఔనురా! యీ మధ్యమనం 500 (రూ) యిస్తే ప్రభుత్వం మరికొంత యిచ్చి ఆ వొంగోలు ఎడ్లు పంపేరు. అవి చాలా మేలు రకపుగిత్తలు.

రామయ్య: ఔనౌను మీపాలికాపు పొలానికి తోలుకెళుతూ వుంటే యీవాళే చూసేను నేను ఆపశువుల్ని! చూడూ! వెంకయ్య మామా! మీకంబారి, నిన్న యేవోగుడ్లు యిచ్చేడేమిటి?

వెంకయ్య: ఆగుడ్లు పొదిగితే మంచిజాతి కోళ్ల తయారౌతాయిరా!

రామయ్య: ఆగుడ్లు ఎవరు పొదుగుతారు! నువ్వా! నేనా! అని

వెంకయ్య: నేను కాదురా! గవర్నమెంటు ఫారంవాళ్లు ఉట్టినే పంపితే, నీకుకోళ్ల పెంకమంటే సరదాకదా అని వాటిని నీకు పంపేను.

రామయ్య: వాటిని నేను జాగ్రత్తగా చూస్తాను.

(తెరలో)

అమ్మో! నాయినో! కొంపకాలిపోతోంది. మా కేందారి—అగ్గి—అగ్గి—రండిరా ఆర్పండి—ఆర్పండి—పిల్లలుచచ్చిపోతున్నారు—రండి రండి—రచ్చించండి.

వెంకయ్య: ఎవరిదా యిల్లు అంటుకుందిట ?

రామయ్య: (ఎగాదిగా చూసి) మామో! మియిల్లు లాగేవుంది

వెంకయ్య: అమ్మో నా కేందారి దేముడా!

(ఇద్దరు పరిగెడరారు)

6వ రంగం

(రాఘవరావు గారి కచేరీ సావిడి. గోడలకు దేశనాయకుల ఫోటోలు వుంటాయి, నాగేశ్వరరావు కృష్ణవేణి కూర్చొని మాట్లాడుతూ వుంటారు.)

కృష్ణవేణి: ఏమిటీ కంపోస్టు యెరువుల గురించి పెప తెగ ప్రచారం చేస్తున్నట్టుంది.

నాగేశ్వరరావు: ఔనమ్మా యీ కంపోస్టు యెరువు రైతు శ్రద్ధగా గోతులు తీసి జాగ్రత్త చేస్తే వాడిభూమిలో బంగారం పండుతుంది.

కృష్ణవేణి: ఈ మధ్య వెటర్నరీసెంటరు కొచ్చిన డాక్టరుగారు కూడా మీలాగే చాలా చురుగ్గా పనిచేస్తున్నారు. అందులో పాడిపశువులంటే ఆయనకు గొప్పసరదా! వాటికి యేవిధమైన రోగాలురాకుండా యేవోమందులు, టీకాలు అబ్బ; వాకటేమిటి: (అంటూ వుండగా కట్లతో రాఘవరావు, దానయ్య భీమయ్య ప్రవేశం.వాకరిని వాకరు అనుకుని మెల్లగా తడుముకుంటూ నడుస్తారు. బట్టలు మాసిపోయి పొగబారిపోయి వుంటాయి.)

క్రిష్ణవేణి: ఏమిటీ ఘోరం. అయ్యో! ఏం భీమయ్యా? యిలాగ వొళ్ళలా కదుములు కట్టిందేమిటి,

భీమయ్య: ఉస్సు (నిట్టూరుస్తాడు మెల్లగా రెప్పలెత్తి చూసి

కుర్చీలో కూలబడతాడు. కృష్ణవేణి పరిచర్య చేస్తూ వుంటుంది.)

రాఘవరావు: (మెల్లగా) యెవ్వరికి యేమీ భయం లేదమ్మా మా మాటకేంగాని ఆ చంటి పిల్ల (అని అతను కూడా కుర్చీలో కూలబడతాడు)

నాగేశ్వరరావు: ఏమిటి దానయ్యా! ఏమిటి కథ త్వరగా చెప్పు.

దానయ్య: నేను, ప్రెసిడెంటుగారు, భీమయ్య కలసి అలాగ వస్తూ వుంటే లోపలో వెంకయ్య యిల్లు అంటుకుంది. అప్పుడు అతను యింటి దగ్గర లేడు మంట పెడకప్పును అంటుకుంది. ఏమిటి బాబు ప్రెసిడెంటుగారి ధైర్యం! ఆ మంటల్లో దూరబడి వెంకయ్య భార్య, ఆ సుస్తీమనిషిని, చంటి పిల్లాడ్ని యిద్దే పైకి తీసుకు వచ్చేరు. వెంకయ్య బంగారం, నోట్లు వున్న గదులు పెట్టెను భీమయ్యా అమాంతంగా నెత్తిని పెట్టుకొని మంటల పాలు కాకుండా చేసేడు నేను కుండల్లో నీళ్లన్నీ పోసి మంటలు ఆర్పేను. అదీ భోగట్టా—

కృష్ణవేణి: ఎంత పని జరిగింది. ఆ దుర్మార్గుడు యీయన మీద కత్తి కట్టినా యీయన ప్రాణానికి తెగించి వాళ్ల ప్రాణాల్ని నిలబెట్టేరు.

రాఘవరావు: ఇప్పుడా ఊసు మనకెందుకూ.

భీమయ్య: "చంప దగిన యట్టి శత్రువు తనచేత చిక్కెనేని వాని జంపరాదు. పొసగ మేలుజేసి పొమ్మనుటే చాలు" అన్నారు పెద్దలు.

నాగేశ్వరరావు: రాఘవరావుగారూ నేను వెంటనే వెళ్లి డాక్టర్ని తీసుకు వస్తాను యిప్పటికే ఆలస్యం అయింది.

రాఘవరావు: నా మాటకేం—పాపం కొంప గాలి ఆ వెంకయ్య పిల్లలు యేడుస్తున్నారు వెంటనే వెళ్లి, వాళ్లకి కాస్త గంజి పోయించే యేర్పాటు చేయించండి—

కృష్ణవేణి: ఎంత ఔదార్యం—ఆ వెంకయ్య యీయన మీద కత్తి గట్టినా యీయన మాత్రం వాడ్ని తండ్రిలాగ ఆదరిస్తునే వున్నారు. నిజంగా యీయన ఆదర్శ పురుషుడు.

7వ రంగం

(రామాయపాలెంలో పంచాయతి సమితి కార్యాలయం ముందు నాగేశ్వరరావు ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్టు చూస్తూ వుంటాడు. దానయ్య గబగబ వస్తాడు.)

నాగేశ్వరరావు: ఏమయ్యా నిన్నటి నుంచి నువ్వు సమాజ విస్తరణ కేంద్రానికే రావడం మానేశావ్?

దానయ్య: చిన్న పని తగిలింది గురువుగారూ; మా గొప్ప గమ్మత్తయిందిలెండి.

నాగేశ్వరరావు ; ఏమిటి విశేషం.

దానయ్య: అదే మనవిజేస్తాను. మొన్న కొంపగాలిపోయిన తరువాత యింత మీసాలుతిప్పిన మొనగాడూ ఆ వెంకయ్య పూర్తిగా మారిపోయేడు.

నాగేశ్వరరావు: వాడేమైనా అన్నాడా?

దానయ్య: వాడి సెక్రటరీ రామయ్య వున్నాడుగదా! వాడితో చెప్పుకుని రోజూ యేడుస్తున్నాడట, తాను యింత కష్ట కట్టికూడా ప్రెసిడెంటుగార్ని యేమీ సాధించలేకపోయాడని తనకిప్పుడు బోధపడిందట ఆ మహానుభావుడు తన పెళ్లాన్ని కన్నుతెరవని ఆ పసిపాపడిని మంటల్లోంచి రక్షించినందుకు ఆ కఠినుడుకూడా కృతజ్ఞత చూపకుండా వుండలేకపోయేడు. వాళ్ల చుట్టాలందరూ, ఆ రాఘవరావు గారు "నీ పెళ్లాన్ని పిల్లల్నీ మృత్యువునుంచి రక్షించేరు అతని పాదాలు పట్టుకో నిన్ను రక్షిస్తారు" అన్నారట. వాడు చేసినపాపమే అగ్నిరూపంగా వాడ్ని కట్టికుడిపిందని వాడు బాధపడుతున్నాడు.

నాగేశ్వరరావు: నీకు యెలాగతెలిసింది యీ కద.

దానయ్య: ఇది కథకాదు బాబూ సత్యం. వాళ్ల అన్న కొడుకే నాకీ సంగతి చెప్పేడు. ఈ భోగట్టాలన్నీ వింటూ కూర్చోబట్టే నేను మన కేంద్రానికి వేగంగా రాలేకపోయాను

(ఇంతలో భీమయ్య వార్తా పత్రిక చదువుతూ ప్రవేశం)

భీమయ్య: ఏమండోయ్ నాగేశ్వరరావుగారూ

నాగేశ్వరరావు: నమస్తే

కృష్ణవేణి: నాగేశ్వరరావుగారూ నమస్తే

భీమయ్య: ప్రెసిడెంటుగారింకా దయచెయ్యలేదా?

కృష్ణవేణి: నేనుకూడా ఆయనకోసమే చూస్తున్నాను.

నాగేశ్వరరావు: నిన్న రాలివలసకు "కరెంటు" వచ్చింది. ఎలక్ట్రిక్ దీపాల్ని "స్విచ్ ఆన్" చెయ్యడానికి ప్రెసిడెంటు గారు వెళ్లేరు. ఆ దీపాలుచూసి వాళ్ల ఆనందం యేమని చెప్పను. అక్కడినుండి వచ్చేసరికి చాలా రాత్రయింది.

అందుచేత యీవేళ వారు రావడం కొంచెం ఆలస్య మవుతుంది.

భీమయ్య : అదిగో ప్రెసిడెంటుగారే యిటు వస్తున్నారు. ఆయనకు వెయ్యేళ్ళ ఆయుర్దాయం.

(రాఘవరావు ప్రవేశం)

నమస్తే రాఘవరావుగారూ.

రాఘవరావు : నమస్తే

కృష్ణవేణి : నమస్కారం, రాఘవరావుగారూ!

రాఘవరావు : నమస్తే

భీమయ్య : మీరు యీరోజు పేపరు చూసేరా లేదా?

కృష్ణవేణి : చాలా సంతోషమైన శుభ వార్త వుంది పేపరులో

రాఘవరావు: నిన్నరాత్రి పడుకునే సరికి రాత్రి రెండు గంటలు దాటింది. ఇప్పుడే లేచి కాలకృత్యాలు తీర్చుకుని యిలాగ కచేరికి వస్తున్నాను.

భీమయ్య: ప్రభుత్వం మీకృషికి మెచ్చి కృషిపండిట్ బిరుదు యిచ్చింది. మొదటి పేజీలోనే వుంది చూడండి.(అని పేపరు రాఘవరావు గారికి అందిస్తాడు. రాఘవరావు పేపరు చూస్తూవుండగా) మీకు ప్రభుత్వం కృషి పండిట్ బిరుదు యిచ్చిందని పేపర్లో చూడగానే మనస్సులో చిన్న ఆలోచన తట్టి యీ పద్య రూపంలో పైకి ఉబికింది. యిది వినండి.

కృష్ణవేణి: ఏది భీమయ్య గారూ పద్యం చదవండి

భీమయ్య; పద్యం:— పల్లెలన్నియు నీవల్ల వన్నెకెక్క
పాడి పంటలు ప్రజలెల్ల పంచుకొనిరి
పల్లెజీవన మానంద పర్వమయ్యె
రమ్య గుణధుర్య రాఘవరాయ

నాగేశ్వరరావు: చాలా బాగుందండీ

దానయ్య: ఎంత చక్కని పద్యం

రాఘవరావు: గ్రామాలలో యితః పూర్వం వినియోగింప బడని ప్రజాశక్తి సహకార సూత్రాలమీద, ప్రజాభ్యుదయ సాధన లో యిప్పుడు కొద్దిగా వినియోగం అయింది. ఇదే కమ్యూనిటీ కార్యక్రమ ప్రధాన సిద్ధాంతం, కాని యింకా మన కృషి ముందుకు సాగిపోవాలి. ముఖ్యంగా మన సమితిలో వున్న పాఠశాలల పురోభివృద్ధికి గొప్పకృషి చెయ్యాలి గ్రామాలలోవున్న లైబ్రరీలు చెదపురుగులకు ఆహార పదార్థంగా మాత్రమే వినియోగపడకుండా అవి అందరి అందు బాటులోకి రావాలి.

భీమయ్య: చాలామందికి లైబ్రరీ పుస్తకం తీసుకు వెళ్లడమే గాని తిరిగి వాపసు చేసే అలవాటు వుండదు.

రాఘవరావు: లైబ్రరియన్ నిద్రపోతే మరేమౌతుంది వేటకాడు మెత్తనైతే లేడి మూడుకాళ్లతో నడిచిందన్న సామెత మనవాళ్లు పుట్టినే చెప్పేరామరి? అసలుఅదిగాదు భీమయ్యా; ఆలైబ్రరీలో గ్రామస్తులకు పనికివచ్చే సరికొత్త ప్రచురణ లను యెప్పటికప్పుడు తెప్పించాలి; ప్రముఖులైన. కవులను పండితులను రప్పించి సారస్వత గోష్ఠులు సాంఘిక సమస్యలపై చర్చలు జరిపించాలి,

(వెంకయ్య, రామయ్యల ప్రవేశం)

వెంకయ్య: బాబో రక్షించండి: మీ పాదాలకు శరణు (ఏడుస్తాడు)

రాఘవరావు: లే వెంకయ్యా: అలా కుర్చీమీద కూర్చోవోయ్.

వెంకయ్య: నాతల బాబూ ఆకుర్చీమీద కూర్చోడానికి. మీపాదాల దగ్గర కూర్చోడానికి తావుదొరికితేచాలు

భీమయ్య: అసలు విశేషం ఏమిటీ అని

వెంకయ్య: విశేషానికేముంది బాబూ: ఆనాడు బుద్ధి గడ్డితిని దానయ్య కొడుకుని(మరిచెప్పలేకవెక్కి వెక్కి యేడుస్తాడు.)

రామయ్య: యేదో బుద్ధిలేక చేసేడు క్షమించండి బాబూ;

రాఘవరావు: అదేదో ఆనాడే అయిపోయింది. ఇప్పుడెందుకావూసు వూరుకో నాయనా;

వెంకయ్య: కాదుబాబూ: అమాయకుడిని అన్యాయంగా కొట్టించేను గదా అవి నాలోనేను సిగ్గుపడిపోతున్నాను. బాబూ నాగేశ్వరరావు గారూ. ఆనాడు రాఘవరావుగారు గాని నా పెళ్లాన్ని, పిల్లల్ని కాపాడకపోతే నా కొంపతో పాటు వాళ్ళుకూడా యీపాటి బుగ్గి అయి పోదురు. ఆయన ధర్మమా అని నా భార్యా పిల్లలు దక్కేరు.

రామయ్య : అనుబాబూ ఆ సంగతి తల్చుకుంటే ఒళ్లు జల్లు మంటుంది.

నాగేశ్వరరావు : రాఘవరావుగారిది చాలా ఉదారమైన స్వభావం. అంతటి మహానుభావులు చాలా తక్కువమంది వున్నారు మన సంఘంలో.

వెంకయ్య : బాబూ నాగేశ్వరరావుగారూ యీ సంవత్సరం మీ సహకార సేద్యం కళ్లారా చూసేను. నాకూ అదే బాగుందని తోచింది. నా 80 ఎకరాల' పల్లంలోనూ సహకార వ్యవసాయం చేయించి పంటగింజలు సమితికి అప్పగిం చుతాను. చూడు నాగేశ్వరరావుబాబూ: స్కూలుకి ఆనుకుని ఉన్న నా మూడు ఎకరాల మెట్ట ఆస్కూలు పిల్లలు ఆడుకోడానికి దానపట్టా యిప్పుడే వ్రాసిఇస్తాను ఇకమీద ప్రజలకి పనికివచ్చే యేపనితలపెట్టినా, నాదే మొదటి పేరై ఉండాలి.

కృష్ణవేణి; భేష్ వెంకయ్యా: నాజీవితంలో వొకక్రొత్త అధ్యాయం ప్రారంభమయింది. మామహిళా సంఘాన్ని కూడామరచి పోకు.

భీమయ్య: ఇన్నాళ్లకి వెంకయ్య దారిలోకివచ్చేడు.

రాఘవరావు: మనలో ఏముంది నాయనా: అంతకీ కాలమే ముఖ్యం. ఈనవోదయాన్ని పురస్కరించుకొని ప్రజా చైతన్యంతో అభ్యుదయ కార్యక్రమానికి నడుంకట్టాలి.

అందరూ:- తథాస్తు.



తెలియని మనుజుని సుఖముగ
దెలుపందగు సుఖవరముగ దెలుపగవచ్చున్
దెలిసినవానిందెలిసియు
దెలియనినరుదెల్ప బ్రహ్మదేవుని వశమే!

—లక్ష్మణ.

*　　*　　*　　*

స వ ర ణ

1961 ఆగస్టు "ఆంధ్రప్రదేశ్" సంచికలో అట్ట రెండవ పుటలో ఉన్న "పంచాయతీ పురోగమనం: నీటి సరఫరాకు ఎత్తైన టాంక్" అనే చిత్రం పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందినది.

పుష్పవివేకము

గరికపాటి మల్లావధాని

వివిధములైన వర్ణము లవేల విచిత్రమనోజ్ఞవాసనల్
నవనవలాడు మార్దవము, నవ్యశుభాకృతులొప్ప శిల్పసౌ
ష్ఠవమెసఁగన్ మమున్ సృజన సల్పిన ప్రౌఢను దేవదేవుసం
స్తవమొనరింతు మూర్జిత కృతజ్ఞతకుం గుదురైన భక్తితోన్,

నిరుపమానందకరకళానిలయమూర్తి!
సహజసౌజన్యసామ్రాజ్యచక్రవర్తి!
ఆర్ద్రభావాత్తసుకృతపథానువర్తి!
రమ్ము కయికొమ్మిదే స్వాగతమ్ము నీకు.

రసమయజీవితావసరరమ్యపదార్థచయానుషక్తమా
నసులరు, మీరు మానవులు, నందితమౌ సుమనఃకులంబుఁగై
వసమొనరించుకొన్న మృదుభావులు, మాకొఱకై శ్రమించి సం
తసమునఁదేలఁజాలిన యుదారులు, మీ కివె మానమస్కృతుల్.

నేలమెత్తగఁద్రవ్వి లీలమై మడిఁగట్టి
మేలైన విత్తనాల్ చాలువోసి
ఉదయాస్తమయములందొడికంబుగా నీరు
చేతులపై నెత్తి చిలుకరించి
మొల్కలెత్తగఁ బుర్వుపుల్గుల కెడమీక
యాచ్ఛాదన మొకింత యలవరించి
మారాకులెత్త రెమ్మలు రాకపూర్వమే
యెత్తి వేఱుగ నెడం బిచ్చిపాతి

పాదులొనరించి,బలమిచ్చి, ప్రోదిసేసి
మొగ్గఁదొడిగిన లోలోనఁ బొంగిపోవు
మీరె మాదైవతములు, మీమేలు నెట్లు
మఱవ వచ్చునె యెన్ని జన్మములకైన?

కన' దినమాత్ర జీవిత వికాసముగల్గిన మమ్ముదేవతా
ర్చనవిధికో మహామహులఁ బ్రాజ్ఞుల సత్కృతి సేతకో వధూ
జనము ప్రసాధన క్రియకొ సద్వినియోగ మొనర్చి ధన్యజీ
వనత ఘటించు మానవులు భవ్యులు మా కనపాయమిత్రముల్.

అలఘుతరప్రజాహృదయహారిగుణంబులు కొన్ని గల్గియు
య్యల జనియించి సందులకు సేరికి నేనొకమాత్ర మోదమున్
గొలుపఁగలేక, కొండలనొ కోనలనో యణఁగాఱి పోవమా
కలుము లివెల్లఁగా బడవిఁగాచిన వెన్నెల కాకపోవునే?

బంగరు వంతదానిఁ బుటపాకములోనఁ బడవైచి, కాచి, సు
త్తింగడు మొత్తకున్నఁగలదే సదలంకృతి గౌరవంబు? సూ
చింగొని గ్రుచ్చకున్న నొక చెండుగ నౌదల లెక్కుభాగ్యమె
బ్భంగి లభించు మాకు సుమపాళికి? లబ్ధికొలంది కష్టముల్.

అండజయానలూర్జితకలానుభవజ్ఞులు పేర్మిమై మముఁ
జెండులుగా ఘటించి తమ శీర్షకలాపము లాచరింపమా
గుండెలలోన సూదులను గ్రుచ్చుట కేడ్తుమె? సిగ్గుసి, గ్గదే
పండువుమాకు, యజ్ఞ పశుబంధ మహత్త్వ మెఱుంగలేనిపా
షండులమౌదుమే? పుటుక చావుల సంగతి మాకు వింతయే?

దివికిఁ దీటగు పూత భారత ధరిత్రిన్ ద్యాగభోగంబు, లా
ర్జవశౌర్యంబులు సాజమయ్యెనిపుడే శాపంబొ? యేకాంతమా
ర్దవ దోషోపహతస్వభావులగుచున్ ధర్మంబ ధర్మంబునే
దొ ?వివేకింపఁగలేని దీన జడ బుద్ధుల్ ప్రోదికానేటికో


ఇహము పరంబురెండు తులకెత్తిసమంబుగఁబూరుషార్థని
ర్వహణ మొనర్చు శ్రౌత మనవద్య సనాతన మీసడించి చే
యిహమొ పరంబొ సుంత మెఱయించున వైదిక దుష్పథంబు సం
స్పృహఁబడనేల? సంస్కృతి విహీనతమైఁజెడనేల మానవుల్?

పత్రమొ పుష్పమో ఫలమొ భక్తిమెయిం బరమేశు నర్చకుం
బాత్ర మొనర్పఁగాఁగలుగు ప్రాజ్ఞులు తాము తరించి మాకు నా
ముత్ర ఫలాప్తికై సుకృతమున్ గడియించిన వారు కారె? యీ
మాత్రకృతజ్ఞతన్ గనని మందుల మంచు మమున్ దలంతురో?

ఉల్లములందు మాకొఱకు నువ్విళ్ళులూరెడుమీరు మీవధూ
తల్లజముల్ నితాంతము ముదంపడుటే పదివేలు మాకు, ను
త్ఫుల్లతఁగాంచినన్ దడవు పోలదు నిల్వగ, గాన మొగ్గతే
కొల్లలు గాఁగఁగోసికొని కోమలులన్ దనియింపు మింపునన్

నిక్కువమింతకంటె నలనీరజనేత్రలె వచ్చి తాముగా
నిక్కుచు, నీటుగోటుల వనిందురుగాడుచు: గుల్కుపల్కులన్
జొక్కుచు, సోలుచున్, దళుకుఁజూపులఁ గప్పుచుఁ బూలకోఁతలో
జక్కిలి గింతలన్ గొలుపు సౌఖ్యముతే యనవద్యహృద్యమున్.

పుష్పవల్లి, సరోజాక్షి, పూవుఁబోణి.
మొల్ల, మల్లిక మొదలైన ముద్దుపేర్ల
గాటముగ మాపయింగూర్మిఁజాటుకొనెడు
నమృతహృదయలు గారె మీయూడు వారు?



ప్రభుత్వ నిర్ణయాలు

* పైర్లు నష్టపోయినందుకు భూమి శిస్తు రెమిషన్లు మంజూరు చేసే పద్ధతిని ఆంధ్రలో అమలు జరుగుతున్నట్టుగానే తెలంగాణా ప్రాంతంలో కూడా అమలుపరచడానికి ప్రభుత్వం నిశ్చయించింది. ఆంధ్రలో అమల్లో నున్న పద్ధతి ప్రకారం, తరీ పంటలకు ఒకవేళ పంట నష్టం రెండు అణాలకంటే తక్కువ అయినట్లయితే పూర్తి రెమిషను మంజూరు చేస్తారు. ఖుష్కీ పైర్లకైతే, పంట దిగుబడి సగటు దిగుబడిలో సగం లేదా మూడవ వంతు వున్న పక్షంలో నూటికి 20 మొదలు 30 వంతుల వరకు రెమిషను ఇస్తారు. మూడవ వంతు మొదలు ఆరవ వంతు వరకు దిగుబడి వున్నట్లయితే 50 వంతుల నుంచి 75 వంతుల వరకు రెమిషను మంజూరు చేస్తారు. పంట దిగుబడి ఆరవ వంతుకంటే తక్కువున్న యెడల పూర్తి రెమిషను మంజూరు చేస్తారు.

* ప్రత్యేక సాయుధ పోలీసుదళం, అగ్నిమాపకదళం, అటవీ శాఖ రేంజర్లు మొదలైన ఉద్యోగాలు మినహా ఇతర రకాల ఉద్యోగాల విషయంలో ప్రమోషన్లకువయఃపరిమితి నిబంధనలనన్నింటినీ తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది.

* ఇతరత్రా జీవనాధారం లేని 70 సంవత్సరాలు అంతకు పైబడిన వృద్ధులకు వార్ధక్యపు పింఛన్లు మంజూరు చేసే పద్ధతిని తక్షణమే అమలుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. రాష్ట్ర రాజధానిలో నివసించే వారికి నెలకు రూ. 25/– ల చొప్పునా, ఒక లక్ష అంతకు మించిన జనాభా గల పట్టణాలలో నివసించే వారికి రూ. 20/– ల చొప్పునా, ఇతర ప్రాంతాలలోని వారికి రూ. 15/– ల చొప్పున పింఛన్లు మంజూరు చేయడానికి నిశ్చయించబడినది. జీవనానికి ఏమీ ఆధారం లేకుండా వుండి, కొడుకులు, భర్త, సోదరులు మొదలైన వారి ద్వారా సహాయం లభించని స్త్రీ, పురుషులకు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ పథకానికై వర్తమాన సంవత్సరపు బడ్జెటులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 3 06 లక్షలు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం వల్ల సుమారు 1,000 మందికి ప్రయోజనం చేకూరవచ్చని అంచనా.

* రాష్ట్రంలో తృతీయ వ్యవసాయ కళాశాలను, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ పీఠమైన తిరుపతిలో నెలకొల్పడానికి రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది రాష్ట్రంలో ప్రస్తుతం రాజేంద్ర నగర్, బాపట్లలలో రెండు వ్యవసాయ కళాశాలలున్నవి. రాజేంద్ర నగర్ వ్యవసాయ కళాశాల ఉస్మానియా విశ్వవిద్యాలయానికీ, బాపట్ల వ్యవసాయ కళాశాల ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా వున్నాయి. తిరుపతిలో సుమారు రూ. 8 50 లక్షల ఆవృత్త వ్యయంతోనూ, రూ 21 లక్షల అనావృత్త వ్యయంతోను తక్షణమే స్థాపించనుద్దేశించిన తృతీయ వ్యవసాయ కళాశాలలో 96 మంది విద్యార్థులకు ప్రవేశం లభింపజేయబడుతుంది.

* హైద్రాబాదులో కేంద్ర పారిశ్రామిక విస్తరణ శిక్షణ సంస్థను నెలకొల్పడానికై భారత ప్రభుత్వానికి అన్ని సౌకర్యాలు కలుగజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. ఈ శిక్షణ సంస్థలో వివిధ పాలిటెక్నిక్‌ల కొరకు సిబ్బందికి శిక్షణ ఇవ్వబడుతుంది. హైద్రాబాదుకు 5 మైళ్ళ దూరంలో యూసుఫ్‌గూడాలో ఇది స్థాపించబడుతుంది. ఈ సంస్థ స్థాపించబడటంతో ఆగ్నేయాసియాలోకెల్లా ఇదే ఇటువంటి మొదటి సంస్థ అవుతుంది. దీనిలో భారత దేశంలోని వివిధ రాష్ట్రాలనుంచే కాకుండా కొన్ని పొరుగు రాష్ట్రాలనుంచి కూడా అభ్యర్థులను చేర్చుకుంటారు శిక్షణ సంస్థ కొరకు భవనాన్నీ, భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది

సైనిక పాఠశాల స్థాపించ డానికై విజయనగరం మహరాజ్ కుమార్ ధానంగా ఇచ్చిన భవనానికి మరమ్మతులు చేయడానికీ, పాఠశాలకొరకు అదనంగా భూమి సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ, 26 లక్షలు మంజూరు చేసింది. విజయనగరం సమీపంలో కోరుకొండవద్ద ఈ భవనం వుంది. సైనిక పాఠశాల 1962 జనవరి నుంచి ప్రారంభించ బడుతుంది మొదట్లో దీనిలో 200 మంది విద్యార్థులను చేర్చుకొని ఈ సంఖ్యను క్రమేపీ 500 ల వరకు హెచ్చిస్తారు. 11–17 సంవత్సరాల మధ్య వయస్కులైన విద్యార్థులను చేర్చుకుంటారు కనీసం 25 శాతం స్థానాలను ఇతర రాష్ట్రాల అభ్యర్థులకొరకు కేటాయిస్తారు.

* హైద్రాబాదులో గాంధీభవనం వద్ద నాలుగు ఎకరాల భూమిని రాజధానిలోని బాలికల పాలిటెక్నిక్‌కు అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. ఈ భూఖండం విలువ సుమారు రూ 6 లక్షలు.

* రాయలసీమ జిల్లాలలో బావుల త్రవ్వకానికి సబ్సిడీల నిమిత్తం రూ. 31 లక్షల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.



క్రోధకామాదులైన దుర్గుణములెల్ల
వాయుహతి మేఘపటలంబు వాయుపగది
శ్రుతముచేఁబాయు నరులలో సురలకరణి
శ్రుతయుతులు దేజరిల్లుదు రతిశయిల్లి.

భార. అనుశాసనిక.

మన్య విప్లవ మహావీరుడు

అల్లూరి సీతారామరాజు చరిత్ర

(ప్రభుత్వ ప్రచురణ)

(రచయిత: యర్రమిల్లి నరసింహారావు)

వెల: రూ. 2-75 న. పై.

ఇంకా లభించే యితర గ్రంథాలు


తెలుగులో		రూ. న. పై.
'ప్రగతి గీతాలు'	,,	0 — 25
ఆంధ్రప్రదేశ్ మత్స్యపరిశ్రమ	,,	0 — 12
దక్షిణాపథంలో ధాన్యాగారం-ఆంధ్రప్రదేశ్	,,	0 — 12
— ఆంగ్లంలో —		
అరకులోయ	,,	0 — 60
ఆంధ్రప్రదేశ్‌లో దర్శనీయస్థలాలు	,,	0 — 25
హైదరాబాద్ నగరం-పరిసరాలు-గైడ్	,,	0 — 50
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు	,,	0 — 25

పోస్టేజి అదనం


ప్రతులకు:— **సమాచార పౌరసంబంధముల శాఖ**

ఆంధ్రప్రదేశ ప్రభుత్వం,

హైదరాబాదు-1



కేంద్రఆరోగ్య మండలి నవమ సమావేశం 1961 ఆగస్టు 10, 11, 12 వ తేదీలలో హైద్రాబాదులో జరిగింది.



హైద్రాబాదు పంజాగుట్టలో నిర్మిత మవుతున్న నూతన గృహ కాలనీ.




హైదరాబాదులో పాల సరఫరా పథకం: గ్రామకేంద్రం వద్ద పరిశీలన చేసిన తరువాత పాలు సేకరిస్తున్న దృశ్యం.




నగరంలోని ఒక పాలసరఫరా కేంద్రం వద్ద బారులు తీర్చినుంచున్న వాడకందార్లు.



వాచ్ రిపేరర్ శ్రీమతి పార్వతి: ''సున్నితమైన యంత్రపరికరాలతో కూడిన గడియారాల మరమ్మతంటే నాకు చాలా యిష్టం,'' అంటుంది శ్రీమతి పార్వతి, ఈమె మహబూబ్‌నగరం జిల్లా వాసిని. తన పదవ ఏటనుంచే ఈమె గడియారాలు మరమ్మతు ప్రారంభించింది. మొదట్లో ఈపని ఈమెకు హాబీగావున్నా ఇప్పుడు వృత్తిగావుంది. నెలకు రు. 300 మొదలు రు. 350 వరకు ఈమె సంపాదిస్తుంది.



కడపజిల్లా ప్రొద్దుటూరులో 1961 ఆగస్టు 23వ తేదీనుంచి 29 వ తేదీవరకు పంచవర్ష ప్రణాళికా ప్రదర్శనం జరిగింది.



ఆంధ్రప్రదేశ్ అడవులలోని శార్దూలం.




ఎలుగుబంట్లు



"సొగసైన జంట"



హైద్రాబాదులోని జూబిలీహాలులో 1961 సెప్టెంబరు 4వ తేదీన బహుమతి పత్రాల అయిదవ "డ్రా" జరిగింది.



శ్రీ రుద్రవరం రంగయ్య, అనంతపురం జిల్లా గుత్తి బ్లాకులోని క్రిష్టపాడులో మాధ్యమిక పాఠశాల భవన నిర్మాణానికి రూ. 15,000 ల రొక్కం, రెండు ఎకరాల భూమి విరాళంగా ఇచ్చిన వదాన్యుడు.



మహబూబ్‌నగరం జిల్లా ఆత్మకూరు గ్రామప్రజలు "శ్రమదానం" ద్వారా చెరువు గండ్లు పూడ్చారు. ఆ గ్రామంలో ఇటీవల కుంభవర్షం కురిసినందుకు చెరువు గండ్లు పడినవి.

"ఆంధ్ర ప్రదేశ్" ప్రకటన రేట్లు

'ఆంధ్ర ప్రదేశ్' పత్రికలో ఈ దిగువ రేట్ల ప్రకారం ప్రకటనలు స్వీకరించబడగలవు.

వివరాలు	మూడు భాషల పత్రికలకు			ఒక భాష పత్రికకు		
	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ
	రూ	రూ	రూ	రూ	రూ	రూ
లోపలి పేజీ	200	125	75	100	55	30
వెనుకవైపు కవరు పేజీ	350	—	—	150	—	—
2,3 కవరు పేజీలు	250	—	—	125	—	—

ఒక సంవత్సరం కొరకు స్థలమును కంట్రాక్టు తీసుకొన్నవారికి 20 శతి రిబేటు ఇవ్వబడుతుంది.

షరతులు

1. సాంకేతిక వివరాలు: $10\frac{3}{4} \times 8\frac{1}{2}''$ డెమ్మీ.
2. ముందరి టైటిల్ పేజీపై ప్రకటనలు వేయబడవు.
3. పావుపేజీకంటే తక్కువ ప్రకటనలు స్వీకరించబడవు.
4. ప్రకటించవలసిన విషయము, అది వేయబడవలసిన స్థలము మొదలగు వివరాలు, దానికయే మొత్తమూ ప్రతినెల 8 వ తేదీలోపుగా ఈ కార్యాలయానికి చేరినట్లయితే, ఆ ప్రకటన మరుసటి నెల పత్రికలో ప్రచురింపబడుతుంది. ప్రకటనకయ్యే మొత్తమును మనియార్డరు ద్వారాగాని, లేక క్రాస్ చేసిన డిమాండు డ్రాఫ్ట్‌ద్వారాగాని పంపవలెను. డిమాండు డ్రాఫ్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధముల శాఖ డైరెక్టర్, హైదరాబాదు-దక్కన్ పేరిట వ్రాయబడవలెను.
5. ప్రకటన నిమిత్తమై పంపబడు బ్లాకుల విషయంలో తగుజాగ్రత్త వహింపబడుతుంది. అయితే మిషను మీద బ్లాకులు గనుక పగిలిపోయినట్లయితే అందుకు ఈ శాఖ బాధ్యత వహించదు.
6. ప్రకటన ఎంతస్థలంలో ఏవైనం ప్రకారం వేయవలసిందీ. ఒక భాష పత్రికలో వేయవలెనా, లేక మూడుభాషల పత్రికలలో వేయవలెనా అనే వివరాలను స్పష్టంగా తెలియపరచాలి. ఉత్తర ప్రత్యుత్తరాలను, పైకమును ఈదిగువ చిరునామాకు పంపవలెను.

డైరెక్టర్
సమాచార పౌరసంబంధముల శాఖ
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం
హైదరాబాద్-1

విజయనగర పతనము

శనగన నరసింహస్వామి

తొంబదియేండ్లవృద్ధు, డసితో పనిలేని పరాక్రమర్ధి సై.
న్యాబుంధివెంటరా ననికి నైచను; నేమిది సాంధ్యకాలకా
దంబిని క్రమ్ముచున్నయది తత్పురవీథులలోన, నేమి కా
లంబొ, వినాశలాంఛనములా? శమియించునుగాక పాపముల్!

తెనుగుపదాతిసైన్యములు తీరెను బారులు కృష్ణవేణి యొ
డ్డున, దళవాయులెల్ల టకటొంకులుగా జయమున్ బొనర్పనెం
చినపగిదిన్ ప్రమత్తతనుచెందిరి దుస్సహశాత్రవావరో
ధనమున; కన్నుబ్రామియదె దాటె స్రవంతిని మ్లేచ్ఛవాహినుల్!

తిరుమలవేంకటాద్రులురుధీరులు తిర్మలవేంకటాద్రులై,
చెరియొక ప్రక్కనిల్చిరిపుసింధులత్రచ్చుచు, స్వీయసైన్య సం
భరణత దాల్చిపొల్చిరి; నవాబులకూటమి హెచ్చరింపగా
తురకలు తీవరించుపసతో చెలరేగిరి విచ్చుకత్తులై.

నేటిరణంబులో నెవరినిన్ జయలక్ష్మి వరించునన్న యా
రాటము రెండువాగుల కలంచెను మాటికి; మ్లేచ్ఛవాహినీ
కోటి, నిజప్రతాపశిఖి కోటులకున్ శలభాళియై కరం
బోటమిచెంద, నాంధ్రభటులొక్కట నార్చుచు పేర్చిరుబ్బునన్.

అనిలో చిత్రచిరత్నరత్నమయ సింహాసంబుపై తీరి, రా
మనరేంద్రుండు స్వకీయసైన్యజనతా మధ్యస్థలంబందుపా

యనరూపమ్ముగ పైడిటంకములు తానై చిమ్మగా జొచ్చె; ద
క్కెను గెల్పన్నముదంబుతోడ నకటా! కీడెంచి మేలెంచదో?

రాసులురాసులై, నయనరాజి తళత్తళలించు స్వర్ణపుం
గాసుల నేరుకో తెనుగుకత్తులు తత్తరమందె; ముందుగా
గాసిలి వెన్నుచూపు తురకల్ మధురాశలు గ్రమ్మశత్రువి
న్యాసముగూర్చి, దేహరుచినాచి హుమాయుల త్రిప్పిరాజికిన్.

తనకు జొహారుసేయు సులతానులు గర్వముమీఱి నేడెదు
ర్కొనుటకు కారణంబు నొకకొంత యెఱుంగని రామరాజు, న
వ్వెను, విజయంబు తప్పదను వెఱ్ఱితనంబున పొంగిపోయి "టాం
జను" పయినెక్కియేగె రభసంబున సంగరగర్భభూమికిన్.

అదిఘోరాహవమధ్యభూమి, భటసాహాయ్యంబు శూన్యంబటన్,
ముదుకండున్, మఱి పెద్దప్రాణమునకే మోసంబు వాటిల్లునే
పదులైవైరులుచుట్టుచో; నెడదలో భావింపలేదేమి, త
ప్పదు పోగాలముదాపురించునపుడే వర్ధిల్లుటల్ గర్వముల్!

ఒకమత్తేభము ఘీంకరించు చటకెట్లో వచ్చిరాజేగు పా
లకి తూలింపగ, దానివీడి భయడోలాలోల తద్‌వాహక
ప్రకరంబెల్లెడబాఱ, నశ్వమునకై లంఘింపబో మ్లేచ్ఛసై
నికసంఘంబు హఠాద్గతిన్ పొదివిబంధించెన్ ప్రభూత్తంసమున్.

మతవిమతమ్ములో తెలివిమాలిన పూర్వపు రామరాడ్దురా
కృతములొకొక్కచే స్మరణకెక్కుచునుండ నవాబులోచన
ద్వితయకరాళ గోళములు దిర్దిరత్రిప్పెను విస్ఫులింగ సం
తతులవెలార్చె! రాజులు గతంబును విస్మరియింప నేర్తురే!

తెనుగు వియత్తలంబుపయి తేజము మాసెను, రామరాజచం
ద్రుని గ్రసియింపజాలిన విధుంతుదుడయ్యె తురుష్కభర్త, తద్

ఘనకరవాలధార నుతిగన్నది ఘాపుశిరమ్ము ద్రెంచి: యే
దినమున కేదియెట్లొ గుణితింపగజాలరు ముందుమానవుల్.

రామనరేంద్రఖండితశిరమ్మును బల్లెముతోడగ్రుచ్చియా
ఖామినిరాజు మింట పెనుబంతివిధంబున ద్రిప్ప, చచ్చెతే
డేమిప్రయోజనంబు రణమింకిట నంచు ద్రిలింగసైనిక
స్తోమము భ్రాంతిచెందె. విధిచోదితమై. జయశంకమానమై.

అకట! యిదేమి యీ పఱచునాతడెవండనివీడి? సర్వతం
త్రకుడు తెనుంగురాజు చినతమ్ముడు తిర్మలరాయధీరుడా!
యొక నిముసంబులో నిక జయోదయ మాంధ్రులదన్న వీరజా
తకమును మార్చివైచెడు విధానమునీతడు సల్పుచుండెనే!

ఓయి కృతఘ్నుడా! యిసుఱులోకపితో బిగబట్టి. పందవై
పోయెదవేమి యుద్ధమును పూనక, కంఃలు పెంచు నీపురీ
నాయికకోసమైకలన, నాలుగురక్తపుబొట్లు చిమ్మలే
వా? యుపకారమొంది పెనువక్షముగ్రుద్దుట యిట్టిదే కదా.

కన్నులు పచ్చవాఱెనె, యెకాయకి మోమును ద్రిప్పిచూడు. నీ
సన్నగ్రహింప యోధులుదెసల్ పరికించుచు నిల్చినారు; మీ
కన్నను సాముతగ్గెను కదా రిపుయూధము. రామరాజులే
కున్నను నూడినొక్కఁటె, వయోభరుడాతడు; మీరుచాలరే?

స్థిరచిత్తమ్మననిల్వు మాజి క్షణమింతే. వేయికొక్కండుగా
పరిగొంద్రాంధ్రభటుల్ రిపుప్రజల. నీపాటింతయే. మ్లేచ్ఛసా
గరవేలాతరణంబొనర్చి రణరంగంబందు కన్విందుగా
త్వరలో ప్రాజ్యజయధ్వజంబు నిసు నివ్వాళించు నవ్వారిగా.

దారాపుత్రవిమోహమేది. సదసత్త్యాగమ్ముగావించి, స్వో
ర్వీరక్షారతకర్మ, శూరు లనివర్తింపంగ నీయాజ్ఞమై:

వైరివ్రాతము బిట్టుగేల్పలిపినవ్వన్ వెన్నుచూపింతువా?
మీరేనావరవాహినీ పతులు? గంభీరక్రమోద్దాములున్?

కాపాడందగువారలాంధ్రు. సుతులేకా. రార్తసైన్యప్రజా
తాపంబుల్.శిశురోదనంబులును, బాధాక్లాంతవృద్ధాకులా
లాపంబుల్. వనితావిలాపములు సంలక్షించి రక్షింప వే
మీ. పాపంబును మూటగట్టుకొనుటే మేలింత స్వార్థంబటో!

తగుదు మటంచు నాయకపదంబులుగైకొని నీతిదూరులై
పగతుఅకప్పగించి నరపాలునిశీర్షము. కష్టకాలమం
దగపడకుండ పాలితుల. కందిన సొమ్ములనాహరించి పో
తెగబడినారె? మేనునజితించునె దుష్కృతలబ్ధసంపదల్?

విజయపురీజగమ్ము ప్రభవించెను తొల్లిసహోదరాంధ్రరా
డజశుభచింతనమ్మున, తదాతతవైభవకారకుండు ది
గ్విజయయశోవిశాలుడల కృష్ణమహీశుడు పోషకుండుగా,
నిజముగ తన్వినాశకుడు నీవగుచుంటివి యిప్పుడాంధ్రుడా!

ఒడలి యస్థిరత్వమూహించి యాత్మయం
దధికనిష్టగలుగునతఁడుసకల
భూతకోటివలనఁబొందడు భయమురా
గాదిదుఃఖములకు నగపడండు.

భార. అశ్వమేధ.

? ? ?
ప్రశ్నోత్తరావళి

ప్రశ్న: 189 శ్రీ ఆర్. యోగేశ్వరస్వామి, కొండపాతూరు బాపట్ల తాలూకా.

బాపట్ల తాలూకాలోని కొండపాతూరు, చెరుకూరు, నరసాయపాలెం గ్రామాలకు, "నరసాయపాలెం తదితర గ్రామాలు" అనేపథకం క్రిందవిద్యుచ్ఛక్తి సరఫరాకుప్రభుత్వం మంజూరీ ఇచ్చింది. ఈపని యెప్పుడు ప్రారంభిస్తారు

సమాధానం: గుంటూరు జిల్లాలోని నర్సాయపాలెం తదితర గ్రామాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యాలవిస్తరణ పధకానికి సంబంధించినపనులు 1961-62 వ సంవత్సరంలో ప్రాధాన్య క్రమాన్ననుసరించి వాటికిలభించే ఆర్థిక, వస్తువనరులబట్టి చేపట్ట బడతాయి.

ప్రశ్న. 190. శ్రీ ఎస్.వి. నరసింహారావు గుంటూరు, నెల్లూరుజిల్లా

ఎవరైనా వ్యక్తి తన మరణానంతరం తన దేహాన్ని ఎదైనా ప్రభుత్వ ఆసుపత్రికి వారి యిష్టానుసారం ఉపయోగించుకునే నిమ్మిత్తం దానం చేయదలిస్తే అందుకు అనుసరించవలిసిన పద్ధతి ఏమిటి ?

సమాధానం:- మరణానంతరం శరీరాన్ని దానం చేయడానికి సంబంధించి ప్రభుత్వం ఎట్టి నియమనిబంధనలు రూపొందించలేదు. ఆసుపత్రులలో చనిపోయే వ్యక్తుల మృత దేహాలను వైద్యకళాశాలలు శవ పరీక్షల నిమిత్తం ఉపయోగించుకుంటాయి.

ప్రశ్న:- 191 శ్రీ పి. వేణుగోపాలం, ఐనవల్లి, తూర్పు గోదావరి జిల్లా

హరిజనుల పురోభివృద్ధిని తెలిపే ప్రత్యేక బ్యులిటిన్‌ను ప్రభుత్వ మేమైనా ప్రచురిస్తున్నదా ?

సమాధానం:- హరిజనోద్ధరణపై బ్యులిటిన్ ఏదీ ప్రకటించబడటం లేదు.

ప్రశ్న: 192 శ్రీ జి. పాండురంగారావు, చీరాల

చీరాల సమీపమున గల వాడరేవును హార్బరుగా మార్చుటకు మన రాష్ట్ర ప్రభుత్వము కృషి చేయుచున్నదా ? దయచేసి వివరములు తెలుపగోర్తాను ?

సమా: గుంటూరు జిల్లాలోని వాడరేవు ఆంధ్రప్రదేశ్‌లోని చిన్న రేవులలో ఒకటి. 1878వ సం. పు సముద్ర చట్టం 11వ సెక్షను క్రింద సరుకుల ఎగుమతి, దిగుమతులకై 1959 జనవరి 1 వ తేదీ నుంచి రేవు కేంద్రంగా దీనిని ప్రకటించారు.

కొంతకాలం క్రిందట, చీరాల వాడరేవు అభివృద్ధి సంఘం వారు, పొగాకు ఎగుమతికై పాండిచేరి నమూనాలో "పియర్" నిర్మించడం ద్వారా ఈ రేవును అభివృద్ధిపరచడానికై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 1959 వ సంవత్సరంలో వాడరేవు పరిశీలన జరిగింది. ఇక్కడ లంగరువేసిన స్టీమర్లకు సరుకులు ఎత్తడం ఏమంత ఇబ్బంది కాదనే విషయం ఈ పరిశీలనలో తేలింది.

అలల ఎత్తు మొదలైన విషయాలకు సంబంధించిన వివరాలు పంపవలసిందిగా భారత ప్రభుత్వం కోరింది. స్టేట్ పోర్టు ఆఫీసరు ఈ భోగట్టా అంతా సేకరించి భారత ప్రభుత్వానికి అందజేస్తాడు. ఆ తరువాత "పియర్" నమూనాను రూపొందిస్తారు.

ప్రశ్న: 193 శ్రీ కె. రామచంద్రరావు, సీతారాంపురం వరంగల్ జిల్లా.

జనాభా లెక్కల సేకరణలో మంచిగా పనిచేసినవారికి పతకాలు బహూకరించనున్నట్టు ప్రకటించారు. వరంగల్ జిల్లాలో ఈ పతకాలుఎవరికి లభిస్తున్నాయో దయచేసి తెలపండి?

సమా: జనగణన సందర్భంలో పనిచేసిన వివిధ ఉద్యోగులకు పత కాలు బహూకరించడానికై జిల్లా కలెక్టరు నుంచి ప్రతిపాద నలు రావల్సి వుంది.

ప్రశ్న : 194 శ్రీ ఎ. వి. సుబ్బారావు, వాకతిప్ప, తూర్పు గోదావరి జిల్లా


భారతదేశంలో ఎన్ని రేడియో స్టేషన్లున్నాయి?

సమా : మన దేశంలో మొత్తం 28 రేడియో స్టేషన్లున్నాయి.

ప్రశ్న : 195 శ్రీ డి. ఎల్. సత్యనారాయణయ్య తాడేపల్లి గూడెం.

తాడేపల్లిగూడెం తాలూకాకు ముఖ్యావసరమైన "అనుముల్లంక ప్రాజెక్టు"ను నిర్మించే ప్రయత్నమేమైనా ప్రభుత్వ ఉద్దేశములో ఉన్నదా?

సమా : "అనుముల్లంక ప్రాజెక్టు" ప్రభుత్వ పరిశీలనలో ఇదివరలో కలదు. దీనికి మారుగా, ఎర్ర కాలువకూ, దాని శాఖలకు అడ్డంగా వివిధ రిజర్వాయర్లు నిర్మించే ప్రత్యామ్నాయమైన ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలించింది. తరువాత ఎర్ర కాలువకు అడ్డంగా అప్పలేరుగూడెం వద్ద రిజర్వాయరును నిర్మించే ప్రతిపాదనలు పరిశీలించబడి ప్రభుత్వానికి సమర్పించబడినాయి. మంజూరు లభించగానే పని ప్రారంభించబడుతుంది. ఈలోగా పథకానికి సంబంధించిన ప్రారంభచర్యలు గైకొనబడినాయి.



అనఘ యధర్మము ధర్మం
బనుమతిఁ బుట్టించుఁ దృణసమావృతమై ప్ర
న్ననితలము చందమునఁ దోఁ
చినసూయింబోలె సూక్ష్మచిత్తతలేమిన్.

భార. అనుశాసనిక.

సమస్యా పూరణము

(క్రిందటి నెలలో ప్రకటించిన సమస్యను పూరిస్తూ వచ్చిన పద్యాలు యివి:)

అరమర యింతలేక హృదయాంబుజ సన్నిధి వర్తనంబునన్
గరమనురాగమొప్ప నవికార వికాస క్రియా సమర్థతన్
థిరగుణరత్న భాసిత సుదీర్ఘ విశేష విధాన సత్క్రియా
చరణము తోడ నాథునకు సాధ్వి యొనర్చు సపర్య భక్తిమై.

శ్రీ ఆకెళ్ల కామశాస్త్రి,
ఇరగవరం. ప.గో. జిల్లా.

o o o o

మురిపెము గూర్చుచుం బ్రణయ ముగ్ధమనోజ్ఞరసార్ద్రభావముల్
పిరిగొన వాలుఁగన్నులను వీక్షణ సేయుచు ముద్దుముచ్చటల్
గరము దలిర్ప నిచ్చలుఁ బ్రగాఢ ముదంబునఁ బ్రేమభాషణా
చరణముతోడ నాథునకు సాధ్వియొనర్చు సపర్యభక్తిమై.

శ్రీ జి.సి. బసవరాజు;
రేపల్లె, గుంటూరు జిల్లా.

o o o o

తరణము జీవితాబ్ధికి, నిధానము శోభనరాజికిన్, గృహా
భరణము శాంతిసంపదకుఁ బ్రాణవిభుండని యాత్మనెంచి త
చ్చరణముఁ బాయకెల్లపుడు సంతసమారభజించి సమ్యగా
చరణముతోడ నాథునకు సాధ్వియొనర్చు సపర్య భక్తిమై.

శ్రీ చింతలపూడి సన్యాసిరావు,
విజయనగరం.

o o o o

సురుచిరకౌముదీనిశను సోగపు కన్నులచిద్విలాసబం
ధుర వికచోత్పలప్రభలు తూగగముగ్ధ మనోనురాగమా
ధురులొలికించి "నావలపుతోటకు నామనివంచు" ధార్మికా
చరణము తోడనాథునకుసాధ్వియొనర్చు సపర్యభక్తిమై.

అనూరాధ,
ధవళేశ్వరం.

కరమను రక్తిమై ముఖవికాసము డిందక శీతశైలకం
దరముదరిన్ నిజేశున కుదంచిత భక్తి సమిత్కుశాదులం
బరిణయకామియై జనకునానతిఁ గూరిచి యార్యసన్నుతా
చరణము తోడ నాథునకుసాధ్వియొనర్చు సపర్య భక్తిమై.

శ్రీ చింతలపాటి వెంకట్రామ శర్మ,
యేదుపాడు, గుంటూరు జిల్లా.

o o o o

ఉరుమతియందు మంతిరియు, నొప్పెడు రూపున లచ్చియున్, సమా
దరణమునందుఁ దల్లియును, దల్పసుఖమ్మున రంభయున్‌గృహం,
తరకృతులందు దాసియును, దాల్మి ధరిత్రియు నౌచు షడ్విధా
చరణముతోడ నాథునకు సాధ్వి యొనర్చు సపర్య భక్తిమై.

శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు,
రాజమహేంద్రవరం.

o o o o

ఇరువురుదేవ వైద్యులుబు షీశ్వరుపత్ని సుకన్యగాంచియ
బ్బురమున నిట్లువాకొని, రపూర్వము: గంటిమె, యిట్టివింత: సుం
దర, బల, యౌవ, నాశిరహితాధిపుపట్లవినమ్రయై సదా
చరణముతోడ నాథునకు-సాధ్వియొనర్చుసపర్యభక్తిమై.

శ్రీ వెంకటరావు పంతులు,
శంకరపల్లి.

o o o o

కరదలునేర్చి నేర్పుమెయి కౌతుకమారగనెల్లకర్జముల్
గరగరికన్ బొనర్చుచునికాయమునం, బతిరాగనార్తిమైఁ
బరుషములాడిసంతసిలు భావము వీడకయుంటనుల్లమే
చ, రణముతోడనాథునకు సాధ్వియొనర్చు సపర్యభక్తిమై.

శ్రీ పి. వెంకటాచార్యులు,
పటమటలంకపల్లి, కృష్ణా జిల్లా.

అరమరలేనికూర్మి, వినయంబున నిందిరకున్ సమానమై
దరహసితాననాబ్జమునఁ దన్మధురోక్తులవాణికై వడిన్
సిరులనులేములన్ గిరిజచెల్వున నర్ధశరీరయైన సం
చరణముతోడనాథునకు సాధ్వియొనర్చుసపర్యభక్తిమై.

శ్రీ ప్రతివాది భయంకర వేదాంతాచార్యులు,
సికింద్రాబాదు.

o o o o

సురుచిర భూషణమ్ము ప్రతిసుందరికిన్ పతిభక్తియంచు, ద
చ్చరణ సరోజసేవయె అజస్రశుభావహమంచు నెమ్మదిన్
స్థిరముగనమ్మి, భర్తయరుదెంచగనుత్సుకతన్ నమస్క్రియా
చరణముతోడ నాథునకు సాధ్వియొనర్చు సపర్యభక్తిమై

శ్రీ పాద లక్ష్మీ నారాయణ మూర్తి,
పార్వతీపురం

o o o o

భరణములేనిదాసి పనిపట్టున, యోచనలందు మంత్రి, మే
ల్వారయగ భోజనం బిడుటలో జనయిత్రి, క్షమన్ ధరిత్రి, సుం
దరమగు మూర్తి లక్ష్మి, శయనంబునరంభగ షట్క్రియాశుభా
చరణముతోడనాథునకు సాధ్వియొనర్చు సపర్య భక్తిమై.

శ్రీ సన్నిధి వేంకటేశ్వరరావు,
ఏలూరు.

o o o o

పరులకు గుట్టునీక, పసిపాపల లాలన పాలనావిధిన్
మరువక, బంధువర్గములమన్నన చేయుచు, కల్గినంతలో
పరువుగ కాపురంబు నడువంగృషి జేయుచునుండి, సత్క్రియా
చరణముతోడ నాథునకు సాధ్వియొనర్చు సపర్యభక్తిమై.

శ్రీ నృసింహదేవర వేంకట నృసింహ
సూర్యనారాయణమూర్తి
విజయనగరం.

o o o o

పరులమనంబునొచ్చుపలు పల్కులు పల్కగబోదు, నిష్ఠ స
ద్గురువుల పూజసల్పు, నయదూషిత కార్యముఁదాకఁ బోదు, ఏ
యరమర లేకయింటిపను లన్నియు నేర్పునఁ జేయుచున్ సదా
చరణముతోడ నాథునకు సాధ్వియొనర్చు సపర్యభక్తిమై.

శ్రీ యమ్. రంగకృష్ణమాచార్య,
కోహర్

o o o o

కరవులు వేయివచ్చినను కష్టములాయమ జీవితాన కా
పుర మొనరించుచున్న నిజపూరుషవర్తన మెట్టిదైన సుం
దర తర వాగ్విలాసముల ధర్మమనమ్మన నిత్యనిర్మలా
చరణము తోడనాథునకు సాధ్వి యొనర్చుసపర్యభక్తిమై.

శ్రీ జంధ్యాల వేంకటేశ్వర శాస్త్రి "శాంతిశ్రీ",
కోటికేసరం.

o o o o

వెరపును కల్మిలేములును వెల్తినిజూపవు, కల్గినంతలో,
ధరవిషయాది సౌఖ్యముల తన్నెడివేశ్యయు లేమియబ్బినన్
సరకును జేయబోదు నిముసంబున నెట్టు తొలంగి పోవగా
చరణముతోడ; నాథునకు సాధ్వియొనర్చు సపర్యభక్తిమై.

ఎ. యల్ మూర్తి
దామల్ చెరువు.



గ్రామాలకు విద్యుచ్ఛక్తి

కర్నూలు జిల్లా ఆదవాని తాలూకాలో కలుగొట్ల గ్రామానికి, తూర్పుగోదావరి జిల్లాలో పల్లంకుర్రు గ్రామానికి 1961 ఆగస్టునెలలో విద్యుచ్ఛక్తి సరఫరా జరిగింది.

గూడకొంగలు

పి.యస్. రావు

బూడిద రంగులేక మచ్చల గూడకొంగ ఒక రకమైన స్థూలాకారపు నీటి పక్షి. ఇది బోరువ గద్దకన్నా పెద్దగా ఉంటుంది. దీనికాళ్లు, పాదాలు కురుచగా, బొద్దుగా వుంటాయి. మెడ పొడువుగా ఉంటుంది. ముక్కు వెడల్పుగా, పొడువుగా ఉండి దాని క్రింద పెద్ద తోలుసంచి ఒకటి వ్రేలాడుతుంటుంది. ఇది యీ పక్షిజాతిలో కన్పించే ఒక ప్రత్యేక లక్షణం. దీని పైదవడపైన ఊదారంగులో పెద్ద పెద్ద మచ్చలను యీ జాతిని తెల్పే 'ట్రేడ్‌మార్కు' గా తీసుకోవచ్చు. పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లా ప్రాంతాలలో దీనిని 'కొల్లేటిగోద' అని పిలుస్తారు దీన్నే 'తీతీగోద' అని కూడా అంటారు. పెద్దముక్కుతోఉండే నత్తకొట్టునే యీ పక్షిగా భావించరాదు.

భారతదేశమంతటిలోనూ ఈ బూడిదరంగుగూడ కొంగలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని గణపవరం, ఉండి ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తాయని, యిప్పటివరకు లభించిన సమాచారంవల్ల నైతేనేమి, రికార్డుల ఆధారంగా నైతేనేమి చెప్పవచ్చు. కొల్లేరు సరస్సుకు 7,8 మైళ్ల పరిధిలో యీ పక్షులు నివసిస్తాయి. యీ ప్రదేశంలో యీ పక్షులు ఉనికిని కనుగొన్న కీర్తి కేరళ రాష్ట్రం చిత్తూరు-కొచ్చిన్ ప్రభుత్వ కళాశాల ఆచార్యులు శ్రీ కె. కె. నీలకంఠన్‌కు దక్కింది.

గూడకొంగల ఆహారం—అలవాట్లు

కొల్లేరు సరస్సులోని చేపలే వీటి సహజ ఆహారం. యీ కొంగలు అర్ధ చంద్రాకారంలో గానీ, లేక వరుసగా గాని నిలబడి చేపలు షికారు చేసివచ్చిన వాటిని మింగివేస్తాయి. ఇవి తమ పిల్లల సంరక్షణలో ప్రసిద్ధి గాంచినవి. యీ పక్షి తన గూడుపై నిలబడి రెక్కలు చాచి తన రక్తంతో పిల్లలను పోషించే రూపాన్ని ఇంగ్లాండు దేశంలో మత గురువులు, రాయబారులకు చిహ్నంగా ఉపయోగిస్తారు. దీనినే "తపోనిష్టలో గూడుకొంగ" అని అభివర్ణిస్తారు. గూడుకొంగలు తమ పిల్లలకు రక్తం ఇచ్చి పోషిస్తాయి అన్న పేరు బహుశా అవి తమ పిల్లల సంరక్షణలో ప్రదర్శించే శ్రద్ధాసక్తుల వల్లనే వచ్చి వుంటుంది. ఈ పక్షులు వాటి పిల్లలను పోషించే దృశ్యం అద్భుతంగా గోచరిస్తుంది.

గూడకొంగల పెంపకం అలవాట్లు

సెప్టెంబరు లేక అక్టోబరు నెలలో యీ కొంగలు వివిధ ప్రదేశాలనుంచి స్థావరానికి గుడ్లు పెట్టేందుకై వచ్చి మళ్లీ మే లేక జూన్ నెలలో స్థావరాన్ని విడిచి వెళ్తాయి. ఈ మధ్య కాలంలో ఇవి దేశం నలువైపులకు వెళ్తాయని భావించ బడుతుంది. అవి యెక్కడికి వెళ్లేది మాత్రం తెలియదు.

సెప్టెంబరు లేక అక్టోబరు నెలనుండి గుడ్లు పెట్టేకాలం ప్రారంభమవుతుంది. పామీర్ చెట్లలోను గుబురుగా ఉండే మామిడి మొదలైన చెట్లలోను ఇవి తమ గూళ్లను యేర్పరచుకుంటాయి ఒక్కొక్క చెట్టుకు 5, 6 గూళ్లవరకు ఉంటాయి. వరిపొట్టుతోను, దారాలతోను ఇవి తమ గూళ్లను నిర్మించుకుంటాయి. నవంబరు ఆఖరుకుగాని లేక డిసెంబరు ఆరంభంలో గాని ఇవి గుడ్లు పెట్టి జనవరిలో పొదుగుతాయి. ఏప్రిల్ వరకు పిల్లలకు రెక్కలు వస్తాయి.

గ్రామస్థుల దృక్పథం

ఇటీవలివరకు గూడా యీ పక్షులు నివసించే ప్రాంతాల పరిసర గ్రామాల ప్రజలు వీటిని చంపటంగాని లేదా వాటికి ఎట్టి హాని కలిగించడం గాని చేసేవారు కాదు. అంతేగాక ప్రతి సెప్టెంబరు-అక్టోబరు నెలలలో వచ్చే యాత్రికులుగా వాటిని భావించేవారు. ఇవి తమ వెంట మంచి ఆరోగ్యాన్ని తీసుకొస్తాయని కొందరు, యీ పక్షుల వెంట తమ పొలాలకు మంచి రసాయనిక యెరువుగా ఉపయోగపడుతుందని మరి కొందరు భావించేవారు. వీటి పరిసర ప్రాంతాల్లోనివసించే వారు యెక్కువగా హిందువులే

యీ పక్షుల మాంసాన్ని గానీ గ్రుడ్లను గాని తినటం తమ మతాచారం దృష్ట్యా వారు తప్పుగా భావించేవారు. యీ పక్షులను గ్రుడ్లను అమ్మే మార్కెట్లుగూడా లేవు. యీ మధ్య కాలంలో మాత్రం ఈ నమ్మకాలు భావాలు చాలవరకు మార్పు చెందాయి. ఈ పక్షులను చంపి మాంసాన్ని హోటళ్లకు విక్రయించటం కొందరికి వ్యాపారమైనది. వీటిని చంపటం విషయంలోఉన్న నమ్మకాలను చాలా మంది గ్రామస్థులు మార్చుకున్నారు. తమ పొలాల్లో ఉన్న వీటి గూళ్లను గూడా కొందరు తీసివేసి పక్షులను రానివ్వకుండా చేస్తున్నారు. అంతేగాక వీటి పెంట పొలాలకు నష్టదాయకం అని కూడా కొందరు భావించి వాటి నివాసానికి ప్రోత్సాహం యివ్వటం లేదు. యీ చర్యలు యింకా కొంత కాలం యిలానే కొనసాగుతే యీ పక్షిజాతి తమకు రక్షణ వుండే యింకో ప్రదేశానికి తరలి పోవచ్చని భావించ.బడుతున్నది. ఇదే గనుక సంభవిస్తే అందువల్ల మన రాష్ట్రానికే కాకుండా మొత్తం భారత దేశానికే తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. ఎందుచేతనంటే యీ జాతి పక్షి, మన దేశంలోనేమి బహుశా మొత్తం ప్రపంచంలోనేమి పెరిగేది ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లోనే.

గూడకొంగల రక్షణకై చర్యలు

ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ యీ చర్యలను తీవ్రమైనవిగా భావించింది. గూడకొంగలను నిరపాయకరమైన పక్షులుగా ప్రకటించేందుకు కొన్ని ప్రతిపాదనలు ఉన్నవి. పశ్చిమగోదావరి, కృష్ణా ప్రాంతాల్లో యీ పక్షిజాతిని రక్షిత పక్షులుగా ప్రకటించి యీ క్రింది చర్యలను నేరంగా ప్రకటించాలనే ఆలోచన గూడా ఉన్నది

అ. తుపాకితో ప్రేల్చిగాని మరేవిధంగా నైనాగాని గూడ కొంగలను చంపటం.

ఆ. యే విధంగా నైనా బ్రతికి ఉన్న వాటిని పట్టుకోవటం.

ఇ బ్రతికిన లేక చచ్చిన వాటిని తమ వద్ద వుంచుకోవటం,

ఈ బ్రతికిన లేక చచ్చిన వాటిని లేదా వాటి గ్రుడ్లను, చర్మాన్ని, మాంసాన్ని లేదా వాటి పిల్లలను విక్రయించడం.

ప్రజానీకానికి యీ పక్షిజాతి పట్ల ఆకర్షణ, ఆదరణ ఏర్పడటానికి వీలుగా ఆంధ్రప్రదేశ్ లోని ప్రసిద్ధ నాయకుని పేరును యీ గూడకొంగలకు పెట్టాలని వీటిని కనుగొన్న ఆచార్యులు శ్రీ నీలకంఠంగారు సూచించారు. యీ సూచన పరిశీలనలో ఉన్నది.

—(ఆంగ్ల వ్యాసంనుండి అనువాదం)



జనులకుఁగీడు రోయకయజస్రము ధర్మరతింజరించిన
జ్ఞనగురు పూజనంబులును సత్యహితోక్తులు దీనపోషణం
బును నతిథి ప్రయత్నమును భూరిదయార్ద్రితయుంగలట్టివా
రనిమిష లోకగాములని యాత్మ నెఱుంగుము మేనకాత్మజా

భార. అనుశాసనిక.

పంచాయతీరాజ్య పురోగమనం

మహబూబునగరం జిల్లా నారాయణఖేడ్ బ్లాకులోని పొచ్చాపూర్ గ్రామాన్ని గురించి ఆ ప్రాంత వాసులకు చాలా తక్కువ మందికి తెలుసు. ఈ గ్రామం జనాభా 692. ఈ ఊళ్ళో ఒక చెరువు వుంది. ఇది పూర్తిగా నిండినప్పుడు సుమారు 100 ఎకరాలకు నీటి పారుదల జరుగుతుంది. అయితే దీని అరగాణి ప్రాంతం ఏమంత మంచిదికాదు. వర్షపాతం హెచ్చుగా వున్నప్పటికీ సామాన్యంగా చెరువు నిండదు. పూర్వం సుల్తానాబాదు ఆనకట్ట నుంచి ఈ ఊరి చెరువులలోకి ఒక కాలువ వుండేది. చెరువుకు దీని ద్వారా నీరు వస్తుండేది. ఈ సంగతి ఆ గ్రామస్థులకు తెలుసు. అయితే చాలా కాలంగా కాలువ నిరుపయోగంగా వుండిపోవడం వల్ల కాలువ మేటవేసుకొని పోయింది. వరదలు వాగుల వల్ల కొన్ని చోట్ల కాలువ గట్లు కూడా కొట్టుక పొయ్యాయి. ఈ సంవత్సరం గ్రామస్థులు వరి మండెలు కట్టి వర్షాలకై ఎదురు చూశారు. జూన్ నెల పూర్తిగా గడిచిపోయినా ఒక్క చినుకైనా కురవలేదు. జూలై నెల కూడా చాలావరకు గడిచిపోయింది. నాట్లు వెయ్యడంలో ఎంతమాత్రం ఆలస్యం జరిగినా మొక్క చెడిపోయే ప్రమాదం ఏర్పడింది. మొక్క కొంత వరకు పెరిగాక నాటు వెయ్యడానికి వీలుండదు. ఈ ఆందోళనకర పరిస్థితి ఆ గ్రామస్థులందర్నీ ఏకం చేసింది. గ్రామ సేవకుడు ఈ కాలువ పూడిక తీసి గట్లు మరమ్మతు చేయవలసిందిగా గ్రామస్థులను వీలైనప్పుడల్లా ప్రోత్సహిస్తూ వచ్చాడు. ఈ విషయంలో ఇక ఎంతమాత్రం అశ్రద్ధవహించడం మంచిది కాదనుపించింది గ్రామస్థులకు. జూలై 20 వ తేదీన దృఢకాయులైన సుమారు 100 మంది పురుషులు, స్త్రీలు పారలు, గడ్డపారలు, బుట్టలు తట్టలతో వెళ్ళి కాలవ త్రవ్వకం ప్రారంభించారు. ఆ ప్రకారం వాళ్లు వరుసగా మూడు రోజులు పని చేశారు. నాల్గవ నాటి నుంచి ఆనకట్ట నుంచి చెరువుకు నీరు ప్రవహించ నారంభించింది. ఈ నీటితో ఆ ఊరి పొలాలకు ప్రాణ ప్రతిష్ట జరుగుతుంది.

పొచ్చాపూర్ గ్రామ ప్రజల విజయగాథ అంతటితో ఆగిపోలేదు. వీరు పెట్టిన ఒరవడికి వెంకటాపూర్ గ్రామస్థులు కూడా ప్రభావితులయ్యారు. వారు కూడా ఇదే విధంగా ఉత్సాహం ప్రదర్శించి తమ ఊరి తటాకానికి జలాధారం ఏర్పరచుకున్నారు.

ఈ గ్రామస్థులు సాధించిన విజయాలను బాగా అభివృద్ధి జెందిన ప్రాంతాలతో పోల్చి చూస్తే ఏమంత విశేషంగా కన్పించక పోవచ్చును. అయితే మాజీ జాగీరు ప్రాంతాలైన ఈ గ్రామాలలో మాత్రం ఇటువంటి కార్య సాధనలకు ఎంతో ప్రాముఖ్యత వుంటుంది.

ఆరోగ్య కేంద్రానికి రు. 10,000 ల విరాళం

ఖమ్మం జిల్లా పినపాక (బూర్గంపాడు బ్లాకు) లో 1961 జూలై నెలలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ప్రాంతం వెనకబడినదైనప్పటికీ ఇక్కడి ప్రజలు ఆరోగ్య కేంద్రానికి రు. 10,000/- లు విరాళంగా ఇచ్చారు.

ఆదర్శ కృషి

మిర్యాలగూడెం బ్లాకు (నల్గొండ జిల్లా) రాగడప గ్రామ రైతు శ్రీ సత్యనారాయణరెడ్డి $3\frac{1}{2}$ మైళ్ళ పొడవు గల కాలువను త్రవ్వారు. ఇప్పుడు ఈకాలువనీరు ఆ కాలువకు ఇరువైపులా పొలాలు ఉన్న ఇతర రైతులకు కూడా ఎంతో ఉపయోగిస్తున్నది.

సంచార గ్రంథాలయాలు

రామకుప్పం బ్లాకు (చిత్తూరు జిల్లా) లో ప్రస్తుతం 30 సంచార గ్రంథాలయాలు పని చేస్తున్నవి. బ్లాకు కేంద్ర కార్యాలయానికి జతపరచబడ్డ ఈ గ్రంథాలయాలు 50 శాతం విరాళాల మీద ప్రారంభించబడ్డవి. సమాజాభివృద్ధికి చెందిన సాహిత్యంతో పాటు ఈ కేంద్ర గ్రంథాలయంలో 3500 ఉపయోగకరములైన గ్రంథాలున్నవి.

స్వాతంత్ర్య దినోత్సవం

పారడి, బొబ్బిలి-విజయనగరం జాతీయ రహదారిపై సువర్ణ ముఖి నదీతీరాన ఉన్న ఒక చిన్న గ్రామం. మహిళా

మండలి సభ్యురాండ్రు, యువజన సంఘ సభ్యులూ ఆగస్టు 10 న ప్రత్యేకంగా సమావేశమై ఈ సంవత్సరం తమ గ్రామంలో స్వాతంత్ర్యదినోత్సవం వైభవంగా జరపాలని నిర్ణయించారు. మహిళామండలి సభ్యులు స్వతంత్రదిన ప్రాముఖ్యాన్ని గూర్చి గ్రామంలో ప్రచారం చేశారు, స్వాతంత్ర్యదినపు పోటీలకు బహుమతులను కొనడానికి విరాళాలకై విజ్ఞప్తి చేశారు, ఈ యువజనుల ఉత్సాహం, కార్యదీక్ష విరాళాలకై వారు చేసిన విజ్ఞప్తి సత్ఫలితాలను ఇచ్చాయి, బహుమతులకై సేకరించిన రు 102/-లతో 200 బహుమతులు కొన్నారు, ఆటలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి, గ్రామంలోని ఆబాలగోపాలమూ ఈ పోటీలను ఎంతో ఉత్సాహంతో తిలకించారు, స్వతంత్ర దినోత్సవం ఈ సంవత్సరం ఇంతకుముందెన్నడూ లేనంత వైభవోపేతంగా జరిగింది,

పౌరుపులకు స్వస్తి

ఆనందపాలెం (కొడిగెనపల్లి బ్లాకు, అనంతపురం జిల్లా) 45 ఇళ్లూ 250 జనాభా గల గ్రామం. బావి త్రవ్వకం

ఈ గ్రామస్థుల చిరకాల వాంఛగా ఉంటూ వచ్చింది. అయితే గ్రామస్థులలోని భేదాభిప్రాయాల వల్ల ఈప్సితం నెరవేరనే లేదు. బ్లాకు సిబ్బంది ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపి వారి విభేదాలను విస్మరించవలసిందిగా గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. చివరికి వీరి కృషి ఫలించింది. శ్రమదానంతో బావిని నిర్మించడానికి గ్రామస్థులు ముందుకు వచ్చారు. ప్రస్తుతం పని నిర్మాణావస్థలో ఉన్నది. 12 అడుగుల వ్యాసం 30 అడుగుల లోతు గల గోయి త్రవ్వకం పూర్తి అయింది.

చిన్న మొత్తాల పొదుపు

నల్గొండ జిల్లా పెద్దాపుర పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ కె. నారాయణరెడ్డి గౌరవ వేతనంగా తనకులభించే రు.100/-లను చిన్న మొత్తాల పొదుపు పథకానికి పెట్టుబడి పెట్టడానికై నిశ్చయించుకొన్నారు.

1961 ఆగస్టు 15 న పెద్దపురలో జరిగిన ఒక సభలో శ్రీ రెడ్డి మొదటిదఫా మొత్తాన్ని సమర్పించారు.

నల్గొండ జిల్లాలో తమ గౌరవ వేతనాన్ని జాతీయ పొదుపు ప్రణాళికలో పెట్టుబడి పెట్టడానికి ముందంజ వేసిన మొదటి సమితి అధ్యక్షులు శ్రీ నారాయణరెడ్డిగారే.

నీటి పారుదల సౌకర్యాల విస్తరణ

గత జూలై నెలలో ఒక జత ఎలక్ట్రిక్ మోటారు పంపులు ఆయిల్ ఇంజన్ల సహాయంతో తిరువూరు బ్లాకు (కృష్ణాజిల్లా)లో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో నీటి పాదుదల చేశారు,

హరిజనులకు ఇండ్లు

విశాఖ పట్టణం జిల్లా, కోటౌరట్ల (బ్లాకు కేంద్ర కార్యాలయం) లోని హరిజనుల సహాయార్థం 1961 జూలై నెలలో 18 ఇండ్లు నిర్మించారు. ఇవికాక మరొక 55 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నవి.

"స్వయం సహాయ" కార్యక్రమం:

కొత్త మొల్గెర (మహబూబునగరం జిల్లా జడ్చర్ల బ్లాకు) గ్రామప్రజలు స్వయంకృషితో రు. 2,000ల ఖర్చుతో రెండుగదుల పాఠశాల భవనాన్ని నిర్మించారు.

సబ్బు తయారీ సంఘం

యెలగండ్ల (కరీంనగరం పంచాయతీసమితి)గ్రామస్థులు 15 మంది కలిసి ఖాదీ బోర్డుసహాయంతో సబ్బు తయారీ పారిశ్రామిక సంఘాన్ని స్థాపించుకున్నారు. వారు రు. 6,000-ల ఖర్చుతో ఒక భవనాన్ని నిర్మించారు. ఇప్పటివరకూ రు. 3,000 విలువగల సబ్బులను ఉత్పత్తి చేశారు.

ఒకరూపాయి పొదుపు ఉద్యమం

చందాయ్‌పేట గ్రామంలో (మెదక్ పంచాయతి సమితి) 1961 ఆగస్టు 13న ఒకరూపాయి పొదుపు ఉద్యమాన్ని ప్రారంభించారు మొదటిరోజు రు, 1,200-ల మొత్తం వసూలైంది.

గ్రంథ సమీక్ష

శ్రీ సుభద్రా పరిణయము

నాటకం: రచయిత చక్రవర్తుల వెంకటశాస్త్రి
మూల్యం: రు 1-75. పేజీలు 104.
ప్రాప్తిస్థానం: రచయిత, చింతలూరు ఆలమూరుపోస్టు, తూర్పు గోదావరిజిల్లా.

ఇది 15 రంగములలో వ్రాసిన నాటకం. కథ అందరికీ బాగా పరిచయమైన సుభద్రార్జునుల వివాహం. ఈకథ ద్వాపరయుగంలో జరిగినదైనా, ఆధునికుల అవగాహనకు చాలా దగ్గరలో వుంటుంది. పెద్దవారు తమ పిల్లను ఒకరికిచ్చి పెండ్లిచేయాలని అనుకోవడం, ఆపిల్లకు ఆవరుడు నచ్చకపోవడం యీకాలంలో సామాన్యంగా జరుగుతున్నదే. అసలుప్రియుడు మారువేషంతో పిల్లను తీసుకుపోయి పెండ్లిచేసుకోవడం కూడా ప్రస్తుతకాల పరిస్థితికి చాలా దగ్గరగానే వుంటుంది. అందుచే యీకథ ఆధునిక ప్రేక్షకులకు కూడా రమ్యంగా వుంటుందనడంలో సందేహంలేదు.

రచన పూర్తిగా గ్రాంధికం. పాండవోద్యోగ విజయాలలో లాగా దీనిలో కూడా శతాధికంగా పద్యాలు వున్నాయి. తెనుగు ప్రేక్షకులకు పద్యప్రధానమైన నాటకాలు రుచించినంతగా యితరములు పనికిరావు. పాండవోద్యోగవిజయాలు, సత్యహరిశ్చంద్రీయము, గయోపాఖ్యానం వంటి నాటకాలు అందుచేతనే వేలసార్లు ప్రదర్శించబడినవి. కాని అది రెండుమూడు దశాబ్దాల క్రిందటి మాట. యిప్పుడు ప్రేక్షకుల అభిరుచులు పూర్తిగామారి సాంఘిక నాటకాలవైపు మొగ్గుచూపుతున్న రోజుల్లో యిటువంటి పౌరాణిక, పద్య ప్రధాననాటకాలు రంగస్థలంమీద రాణించడం కష్టమే ఇందులోని పద్యాలన్నీ సరళద్రాక్షా పాకంలో వున్నమాట నిజమేకాని పైనపేర్కొన్న నాటకాలలోని పద్యాలస్థాయిని అందుకో లేదనే చెప్పాలి.

"వచ్చినవాడుచూడ బలభద్రుడమాయికు డచ్యుతుండురా
డచ్చతురుండు పాండుసుతులందను రక్తుడు ప్రస్తుతాంశమున్
ముచ్చటకేని యెన్నడును మున్నువచించిన వాడు కాడునే
డెచ్చటనుండి యూడిపడె నింతటిప్రేమ? తలంచిచూడుడీ!

అని కర్ణుడు దుశ్శాసనుడితో చెప్పేపద్యం. యీనాటకంలోని మంచి పద్యాలకు ఉదాహరణగా పేర్కొనవచ్చు మాయాయతికి సపర్య చేయమని కృష్ణుడు సుభద్రకుచెప్పుతూ

"స్వాములవారికిందగు సపర్యలొనర్చుట నీదువంతు-ని
ష్కాముల వారు కారు మనసాటికివచ్చెడు వారు..."

అనేచోట వున్న సులభ శ్లేషరమ్యంగావుంది.

పెండ్లికై వచ్చిన దుర్యోధనాదులైన బావలను మర్యాద చేయడానికి నియుక్తుడైన శ్రీకృష్ణుడు లేని ప్రేమప్రకటిస్తూ నాటకం ఆడినఘట్టం చక్కగా నిర్వహించబడింది.

నాటకీయత, పాత్రపోషణ అంతా మామూలుగా సాగిపోయింది. నాటకంలో 'రిలీఫ్' కోసం సోమశర్మ, కుముదిని అనే రెండుపాత్రలు ప్రవేశపెట్టబడినవి, సోమశర్మ ప్రేక్షకులకు అప్పుడప్పుడు చక్కిలి గింతపెట్టి నవ్విస్తుంటాడు. సంభాషణలు చాలాచోట్ల దీర్ఘంగా వున్నాయి, నేటి సామాజికుల అభిరుచికి సరిపడని స్వగతాలుకూడా మెండే. అయినా పౌరాణికం కనుక పరవాలేదు.

"కులపతి"

* * * *

అమృత పథం
(ఖండకావ్యసంపుటి)

కవి: ఎం. హీరాలాల్‌రాయ్
వెల: రూపాయన్నర; పుటలు 88
ప్రతులకు: క్వాలిటీ పబ్లిషర్స్ విజయవాడ-2

జీవితంలోవచ్చిన ప్రతిమార్పు రచనలో ప్రతిఫలిస్తుంది.

ప్రతిఫలించాలి కూడాను, కాలం మారుతుంటే సాహిత్యం మారకుండా ఊరుకోదు. జీవితాన్ని తరుముతుంటూ వస్తుంది రచన. జీవితమే పేలవంగా ఉంటే రచన దానికి భిన్నంగా ఉండదు. అంటే జీవితంలోంచి కవిత్వం పుడుతుందోన్న మాట.

కాల్పనికోద్యమంలో కవులు బాధనుంచి విముక్తికోరి ప్రేయసిని ఊహాసుందరిగా సాక్షాత్కరించుకుని, ప్రణయగీతాలూ, విరహ గీతాలూ ఆలాపిస్తే, అభ్యుదయ కవులు బాధను పంచుకోవడాన్ని గురించీ, ఆహూతి అయిపోవడాన్ని గురించీ వ్రాస్తారు. ఏది ఎట్లున్నా కవిత్వానికి ప్రాతిపదిక బాధ. అనుభూతి ఆలంబన కవిత్వానికి. జీవితానికి అనుభవం పాఠాలు చెబుతున్నపుడు కవిని అతని కవిత్వం ముందుకు నడిపిస్తుంది. ఇది అన్ని కాలాల్లోనూ నిజమే. హీరాలాల్ రాయ్ అట్టి చిత్తశుద్ధిగల కవి.

కవినిగురించి వ్రాస్తూ దాశరథి ఉపోద్ఘాతంలో యిట్లా అన్నారు. "...అశేష జనాన్ని కార్యోన్ముఖులు కావలసిందిగా వజ్రకంఠంతో ప్రబోధించి ఇంద్ర ధనుశ్శకలంవంటి భారతపతాక చేతపట్టుకుని జాగరణ గీతాలాపన చేస్తూ, సత్యాగ్రహంచేసి ఘోర కారాగారవాసానికి పూనుకున్న మహావీరుడు ఈ కవి...తెలుగును తన మాతృభాషకన్న ఎక్కువగా ప్రేమించే ఉదారుడు, అమృత హృదయుడు స్నేహశీలి, ఉత్తమ జాతీయవాది, సామ్యవాద జిజ్ఞాస కలవాడు, పురోగామి రచయిత. అభ్యుదయ మూర్తి..."

ఈ కవి జీవితాన్ని తరచి తరచి చూసినట్లు ఆయన వ్రాసుకున్న 'వక్తవ్యం' లో తెలుస్తుంది. "...గతాన్ని మనస్సులో చిత్రించుకుని, వర్తమానంలో భవిష్యత్తుకు పురోగమిస్తాడు కవి. ......ఈ జీవిత మహా స్రోతస్సులో తను దర్శించే సౌందర్యాన్నీ, వక్రగతినీ, ఉద్వేగాన్నీ అన్నిటినీ సహజంగా చిత్రించడమే కవి బాధ్యత" అంటారు.

ఉర్దూలో వ్రాసిన గేయాలకు "ఊటుకూరు" అనువాదం— "అమృతపథం". దీనిలో 32 ఖండికలున్నాయి అన్నీ యించుమించు సంఘర్షణలో నలిగిపోతూన్న కవి హృదయ బాధను వ్యక్తపరుస్తున్నవి. 'ఆగనికాలం' 'అశ్రుబలం' అన్న ఖండికలు అన్నిటికన్నా బాగున్నవి.

నీనిట్టూర్పులు చురకత్తుల్లా నాగుండెను చీలుస్తున్నాయి.
....
నీబలం నీకు తెలీదు
నీ కన్నీళ్ళ విలువ నిట్టూర్పుల వేడి
నీవర్థం చేసుకోలేవు
....
ఆనాడు మననూతన సృష్టి
నూతన రాజ్యం

అనే కవితలో రాబోయే వ్యవస్థపైన కవికి ఉన్న నమ్మకం కన్నీటికున్న మహత్తరమైన విలువా కనబడుతుంది.

"క్రమక్రమంగా గొలుసులవలె
గడుస్తున్నాయి వత్సరాలు"
"బంధింప బడిన పక్షిలా
బ్రతుకు గిలగిల మంటూన్నది"
"నా ఆశయాలశక్తి
ఈ పృథ్వినాక్రమించి
బలంగా నిలబడి
పరిపూర్ణ లక్ష్యం సాధిస్తుంది"

అన్న ప్రయోగాలు మెరుపుల్లాగ ఉన్నాయి.

మాత్రాఛందస్సులోంచి వచన గేయం లోకి పురోగమిస్తోంది నవ్యకవిత. వచన గేయానికి ముఖ్యలక్షణం నడక. అది కుంటు పడితే పాఠకుడికి చికాకు కలుగుతుంది ఈ విషయాన్ని అనువాదకులు గుర్తించాలి. మరొక్కమాట. కవిత్వం వాచ్యంగా ఉండేదానికంటే వ్యంగ్యంగా ఉంటేనే రాణిస్తుంది.

మహార్ణవమి

రచయిత: కర్రాచంద్రశేఖర శాస్త్రి

పుటలు viii+107
వెల రూ. 1.50
ప్రతులకు: రాధాకృష్ణా పబ్లిషర్స్ రామచంద్రపురం, తూర్పు గోదావరి జిల్లా

శ్రీశాస్త్రి "మహార్ణవమి" తొమ్మిది కథల సంపుటం, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు పుస్తకాన్ని రచయితనూ పరిచయం చేస్తూ "ఈ రచయిత జీవన స్రవంతిలో చేసిన అవగాహనానుభవము ఎన్ని కథానికలనైన పండింపగల సమృద్ధి గలది అన్నారు. పద్మరాజుగారి సహవాసం వల్ల, హనుమచ్ఛాస్త్రి గారి సౌభ్రాతృత్వం వల్ల తమకు కథ రచనలో ఆసక్తి కలిగిందని "ప్రరోచనలో" రచయిత వెల్లడించారు. అటు "రాచమొలక"

అన్న రాజకుటుంబాలకు సంబంధించిన కథమొదలు "ప్రాయశ్చిత్తం" అన్న కళాశాల విద్యార్థుల్నిగురించిన కథవరకూ అన్నీ ఒకే పద్ధతిలో నడిచాయి. రచయిత ప్రతిచోట కొట్టొచ్చినట్టు కనిపిస్తాడు. తొమ్మిది కథలూ జీవితంలోని వివిధరంగాలలోని ఇతివృత్తాలు కావడంవల్ల పాఠకుడికి విసుగు పుట్టదు.

"జి"

శ్రీ వెంకటేశ శతకము

గ్రంథకర్త: చెక్కా-కేశవరావు.
పుటలు : 34
వెల 37 నయాపైసలు, ప్రకాశకులు : పద్మావతీ పబ్లికేషన్సు, కడప.

తిరుమల శ్రీనివాసుడు తెలుగువారల కిష్టదైవము ఆతనిని కథావస్తువుగా గైకొని ఎందరో రచయితలు తమ తమ భక్తి ప్రపత్తులను కావ్యరూపమున, పాటల రూపమున నుగ్గడించినారు. శ్రీ చెక్కా-కేశవరావుగారు, వేంకటేశ్వరునకు ఆటవెలదు లత్యంత ప్రీతి పాత్రములని భావించి ఆ జాతులలోనే వ్రాసి సమర్పించినారు. ఈ ఆటవెలదులు "విమల తిరుమలేశ వేంకటేశ" యను మకుటముతో వ్రాయబడినవి ఈ పద్యములందు చక్కని తెలుగు నుడికారములు సామెతలు పొందుపరుపబడి యున్నవి. వీరు పిన్న వయస్కులయ్యును చక్కని కవితాపాటవము కలవారు. వీరి కవనము లలితపదవిలసితమై యున్నందున ఏ మాత్రము సాహిత్యాభిరుచి కలవారైనను పరాపేక్ష లేకుండ చదువుకుని సంతోషించ తగిన కావ్యము (శతకము). పద్యరచనములో అందందు చర్విత చర్వణము కనపడినను, రచయిత వర్ధిష్ణువు కాన దానిని దోషముగా పరిగణించుట విద్వత్పద్ధతి కాదు. ఈ పద్యములలో చక్కని నీతులుగ్గడింప బడినవి. శ్రీనివాసునిపై భక్తి ప్రపత్తులున్న వారందఱు తప్పక చదువవలసిన శతకము. వీరింకను మున్ముందితోధికమగు పాండిత్యమును సముపార్జించి ఆంధ్ర భాషాయోషకు వరి వస్యగావింతురు గాత.

కురుగంటి కథావళి

గ్రంధకర్త: కీ. శే. కురుగంటి సీతరామయ్యా
పుటలు : 82, వెల. రూపాయిన్నర
ప్రతులకు : శ్రీ కురుగంటి కృష్ణమూర్తి, డిప్యూటీ తహశీల్దారు, గద్వాల, మహబూబ్‌నగరం జిల్లా.

కురుగంటి సీతారామయ్యగారి నెఱుంగని తెలుగువారుండరు. వారు చారిత్రక సాహిత్య గవేషకులే కదాయని తలంచువారికి వీరు కథకులుకూడా అని యీ చిరుపొత్తము చాటుచున్నది. ఇందు కరివేపచెట్టు, ఆమెగతి, నా రత్నం, ఉదాహరణం, నా కాలేజీయాత్ర లను శీర్షికల కథలైదు కలవు. కురుగంటి కోవిదులీ కథలకు పోద్ఘాతముగా "నా ఉద్దేశములో వ్యక్తి శీలము చాల పవిత్రము. శీలమును చెడగొట్టు ఆధునికతా స్వాభావికతలను నేను భరించలేను. కాంతాసమ్మిత తయోపదేశయుజే అను లాక్షణిక వాక్యము నాకు పరమ ప్రమాణము" అని వ్రాసినారు. ఈ కథలను వారాదృష్టితోనే వ్రాసినారు. చదువుటకు మనోహరముగా నున్నవి. ఒకసారి చదివి మరచుట కన్న మననము చేయుట కుపయోగించు కథలనిన అతిశయోక్తి కాదు

షడ్దర్శనములు

గ్రంధకర్త : కీ.శే. కురుగంటి సీతారామయ్య
పుటలు : 50; వెల ఒకరూపాయి.
ప్రతులకు : శ్రీ కురుగంటి కృష్ణమూర్తి, డిప్యూటీ తహశీల్దారు, గద్వాల, మహబూబునగరం జిల్లా

ఈ చిరుపొత్తమున, పూర్వమీమాంస. ఉత్తరమీమాంస వేదాంతము, సాంఖ్య యోగములు, వైశేషిక న్యాయములనుగూర్చి సంక్షిప్తముగా సలక్షణ భాషలో వివరింప బడినది. వేదాధ్యయన పరులైన కురుగంటి కోవిదులు షడ్దర్శనములను గూర్చి సుబోధకమగునట్లు వివరింప సమర్థులు. తత్త్వ శాస్త్రము సులభముగా పఠింపగల శాస్త్రముకాదు. నేటి కాలమునకు సరిపడు నటుల దానిని గూర్చి బృహద్గ్రంథమును వ్రాయక ప్రాథమిక స్థితిలో నున్నవారి కుపయుక్తమగు నటుల వ్రాయు టెంతయో సమంజసము.

—'పి'

నవోదయం

(రూపకం)

రచన: శ్రీ పబ్బరాజు గోపాలరావు
వెల: 50 నయాపైసలు పుటలు: ముప్పైరెండు
ప్రతులకు: రచయిత పేర, మామిళ్లగూడెం వీధి, ఖమ్మం (ఆం. ప్ర) చిరునామాకు వ్రాయాలి.

క్రమబద్ధమైన మార్కెట్లవల్ల రైతాంగానికి కలిగే ప్రయోజనాలనూ, ఈ వ్యవస్థ పూర్వాపరాలను వివరిస్తూ కేవలం ప్రచారార్థం వ్రాసిన రూపకం ఇది, ఆకాశవాణి ప్రసార పద్ధతిలో దూరశ్రవణ యంత్రాల సహాయంతో దీనిని ప్రసారం చేయవచ్చును. దృశ్యరూపంగా కూడా ప్రదర్శించవచ్చును.

సన్నకారురైతుల ఆర్థిక ఇబ్బందులు, జట్టీ వ్యాపారంలోని అక్రమాలు, క్రమబద్ధమైన మార్కెట్లు ఏర్పడని ప్రాంతాలలో హాలికులు పడే కష్టనష్టాలు. క్రమబద్ధమైన మార్కెట్లు స్థాపించి ప్రభుత్వం కర్షకులకు కల్పిస్తున్న సదుపాయాలు మొదలైన విషయాలు ఈ రూపకంలో పొందుపరచబడినాయి.

క్రమబద్ధమైన మార్కెట్లవల్లకలిగే లాభాలను గూర్చి వ్యవసాయదార్లలో ప్రచారం చెయ్యటానికి ఈ రూపకం రచయితా ప్రోత్సాహకులు ఆశిస్తున్నట్టుగా చక్కగా ఉపకరిస్తుందనడంలో సందేహంలేదు. రూపకం పూర్తిగా ప్రచారాత్మకమైన దైనప్పటికీ ఏసన్నివేశం కూడా శ్రోతలు, ప్రేక్షకులకు విసుగు కలిగించేదిగా లేదు. ఇది రచయిత ప్రతిభతకు నిదర్శనం,సందర్భోచితంగా రెండు మూడు పాటలుకూడా వుండటంవల్ల రూపకానికి మరింత పరిపుష్టి చేకూరింది. శైలిసాఫీగా నడిచింది

పోతే ఇందులో కన్పించే ఒక లోపేమిటంటే సుబ్బయ్య (దలారి) పాత్రచిత్రణం. అతడ్ని అంతా రైతు బాంధవుడుగా చిత్రించడం అనౌచిత్యంగావుంది. దలార్ల సహజ లక్షణాల-కుట్రలు, కుతంత్రాలు వగైరాలను పూర్తిగా అతనిలో మూర్తీభవింపజేసి ఆఖరులో భంగపాటు జరిగినట్టు చూపినట్టయితే రూపకం మరింత రక్తికట్టేది.

విభిన్న రంగాలలో వివిధ పథకాల క్రింద అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతున్న నేటికాలంలో, ఈ కార్య కలాపాలనుగూర్చి ప్రజానీకంలో ప్రచారంచేసి వాటివిజయానికి వారి సహాయసహకారాలు లభించునట్టు చేయడం ఎంతో అవసరం. కనుక "నవోదయం" వంటి రూపకాలు, నాటకనాటికలు ఎంత విరివిగావస్తే అంతమంచిది.

ప్రహ్లాదుడు

రచన: శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య
వెల: నలభై నయాపైసలు.
పుటలు: ఇరవై రెండు.

మహాత్ముడు

రచన: డాక్టరు శంకర శ్రీరామారావు.
వెల: ఒకరూపాయి.
పుటలు: అరవై నాలుగు.

శ్రీ గోదాగ్రంథమాల (శ్రీమన్నారాయణపురం, ఉల్లిపాలెం పోస్టు దివి తాలూకా, కృష్ణాజిల్లా) వారు చిరుత ప్రాయుల కొరకు ఏరి కూరుస్తున్న "పుస్తకహారము" లో "ప్రహ్లాదుడు" చతుర్థ పుష్పముకాగా "మహాత్ముడు" పంచమ సుమము.

శ్రీమాన్ చలమచర్ల రంగాచార్యులుగారు ఈ గ్రంథమాల వ్యవస్థాపకులకు వ్రాసిన అభినందనలేఖలో ఉల్లేఖించినట్లు, వట్టిదారి కథలు చదివి దారితప్పు ప్రమాదము మిక్కుటమైన ఈ కాలములో బాలబాలికలు చదువుటకు మహాపురుషులు జీవిత చరిత్రలతో మహోపదేశములతో వెలయు చిరుపొత్తముల అవసరము ఎంతేనికలదు.

ఈ ఆవశ్యకతను గమనించి శ్రీ గోదాగ్రంథమాల వారు బాలసాహితీ శాఖ స్థాపించి బాల వాఙ్మయాభివృద్ధికై చిత్తశుద్ధితో సాగిస్తున్న కృషి ప్రశంసార్హమైనది. వీరు ఇదివరలో "శ్రీరామానుజ చరిత్ర", "గోదాదేవి", "మీరాబాయి" అనే పిల్లలపుస్తకాలు ప్రకటించి పలువురి మన్ననలు పొందినట్టు తెలుస్తున్నది.

నారదుడు పరాశరుడు, పుండరీకుడు, వ్యాసుడు, అంబరీషుడు, శుకుడు, శౌనకుడు, భీష్ముడు, రుక్మాంగదుడు, అర్జునుడు, వసిష్ఠుడు, విభీషణుడు వంటి ప్రాతఃస్మరణీయులైన పరమ భాగవతోత్తములలో నగ్రేసరుడుగు ప్రహ్లాదుని పావన చరిత్ర ప్రహ్లాదుడు అన్ని చిన్నపుస్తకంలో సంగ్రహంగా పొందుపరచబడినది.

హిరణ్యకశిపుని జన్మోదంతంతో ప్రారంభించి అతని సంహారం వరకు జరిగిన కథను ఇందులో రచయిత టూకీగా చెప్పారు. ప్రహ్లాదుని అచంచలమైన భక్తి విశ్వాసాలను వెల్లడించడానికి రచయిత ఎన్నుకున్న సన్నివేశాలు హృద్యయంగమంగా వున్నాయి. శైలి సరళంగావుంది కథా రచన పిల్లలతో ముచ్చటిస్తున్నట్టుగా సాగి సందర్భోచితంగా మధ్యమధ్య నీతి బోధనకూడా జరిగినట్లయితే పుస్తక ప్రయోజనం ఉభయతారకంగా వుండేది.

స్వదేశస్థులచే జాతిపిత, స్వాతంత్ర్య ప్రదాతగానూ, నిఖిల ప్రపంచంచే మహాత్ముడు, మహర్షిగాను కీర్తించబడిన గాంధీజీ జీవిత చరిత్ర "మహాత్ముడు" మహాత్ముని ఆదర్శాలను,కథా కథన ప్రవాహంలో కలిపి రసమయంగా బాలబాలికల లేత హృదయాలకు అందించారు. డాక్టరు శంకర శ్రీ రామారావుగారు ఈ పుస్తకంలో బాల సాహిత్యంలో డాక్టరు గారు సిద్ధహస్తులైనట్టు వెల్లడిస్తుంది, శైలి సుబోధకంగానూ, మధురంగానువుండి బాలల హృదయాలను రంజింపజేసేదిగావుంది. కథాకథనం ముచ్చట రూపంలోవుండి, సమయానుకూలంగా నీతిబోధనకూడా జోడింపబడి నది గాబట్టి దీనివిలువ ఇనుమడించింది. కొత్తగా అక్షరాస్యులైన వయోజనులు, మొదలైన వారుకూడా చదవదగిన పుస్తకం ఇది.

— జ.రా.

* * *

పారిశ్రామిక విశేషాలు

(ఆగస్టు 1961)

(రాష్ట్రి పారిశ్రామిక రంగంలో అనుదినం అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టబడుతున్నాయి. వాటిని గురించి తెలుసుకోవడం పారిశ్రామిక వేత్తలకూ, ప్రజలకూ ముఖ్యం. కాబట్టి ముఖ్య పారిశ్రామిక విశేషాలు యీ శీర్షిక క్రింద యివ్వబడుతున్నవి)

హైదరాబాదులో సింథెటిక్ డ్రగ్ ఫ్యాక్టరీ స్థాపనయత్నం సాగిపోతున్నది. దక్షిణాదిలో నిర్మింపనున్న భారీ విద్యుత్పరికరాల ప్రాజెక్టుకు అనువైన స్థలాన్ని పరిశీలించడానికై ప్రాజెక్టు అధికారి హైద్రాబాదుకు వచ్చారు. సూక్ష్మ పరికరాల ఉత్పత్తి ఫ్యాక్టరీని యెక్కడ స్థాపించాలనే విషయం భారతప్రభుత్వ పరిశీలనలో ఉన్నది.

ప్రైవేటు రంగంలోని ప్రాజెక్టులు

నిర్మాణ పరికరాలు సర్వేపరికరాలు వరిపొట్టు తైలం ప్రొపెల్లర్ షాఫ్టులు మొదలైన వాటి ఉత్పత్తికై ఫ్యాక్టరీలు స్థాపించడానికి ప్రైవేటు సంస్థలకు లైసెన్సులు జారీ చేశారు.

నిజాం చక్కెర ఫ్యాకరీ

నిజాం చక్కెర ఫ్యాక్టరీ విస్తరణ పథకం శీఘ్ర గతిని అమలు జరుగుతున్నది. మొదటి ఫ్యాక్టరీలో క్రషర్ కొత్త మిల్లు, మిల్లుటర్బైన్, చెరుకు ఛేదన యంత్రం వగైరా నెలకొల్పబడం, రెండో ఫ్యాక్టరీలో క్రొత్త మిషనరీల స్థాపన వగైరా జరుగుతున్నది.

సింగరేణి బొగ్గు గనులు

గనుల ప్రమాదాల నివారణ, రక్షణ యేర్పాట్లు ముందు జాగ్రత్తకై సింగరేణి బొగ్గు గనులవారి ఉపయోగమునకై కొత్తగూడెంలో ఒక రక్షణ గృహాన్ని నిర్మించారు. కొత్తగూడెం నుంచి వినియోగ కేంద్రాలైన విజయవాడ, మద్రాసులకు శీఘ్రగతిగా బొగ్గును సరఫరా చేసేందుకై 'బాక్సు' రకం వ్యాగన్లను ఉపయోగించాలనిఆలోచిస్తున్నారు. సెంట్రల్ రైల్వే ఛీఫ్ఆపరేటింగ్ సూపరింటెండెంటు, డివిజనల్ ఆపరేటింగ్ సూపరింటెండెంటు, యీ విషయం పరిశీలించేందుకై కొత్తగూడెం వచ్చారు. ప్రథమ దశలో యిప్పుడు ఉన్న రైల్వే ట్రాకులను యెక్కువ చేయటం, 'బాక్సు' రకం వ్యాగన్లను ప్రవేశ పెట్టటం జరుగుతుంది. 'బాక్సు' రకం వ్యాగనులలో 55 టన్నుల సరుకు పడ్తుంది. పాత వ్యాగన్లలో 23–24 టన్నుల సరుకు యిముడుతుంది. గనులలో ఉత్పత్తి బాగా పెరుగుతున్నది. 1961 జూలై నెలలో 15,16,713 టన్నుల ఉత్పత్తి జరిగింది. గత సంవత్సరం యిదే నెలలో జరిగిన ఉత్పత్తి 14,00,170 టన్నులు

అనుసంధానకర్త శ్రీ దాసుగుప్త సిపారసులననుసరించి, 1961 జూన్ 1 వ తేదీ నుండి గని పనివారలకు గ్రేడులు రోజువారీ పనివారలకు టైంస్కేలు ప్రకారం జీతాలు యివ్వడానికి నిర్ణయించారు.

ప్రాగాటూల్సు కార్పొరేషన్

మూడు సంవత్సరాల వఱకు వివాదాలు కల్పించుకోకుండా ఉండేందుకై కార్పొరేషన్ యజమానులు పనివారల సంఘం మధ్య 1961 జూలై 1 వ తేదీన ఒక ఒప్పందం జరిగింది. యీ ఒప్పందం ప్రకారం నెలకు రు. 600/- లు, అంతకు తక్కువ గల ఉద్యోగులకు నెలకు రు. 40 చొప్పున కరువు భత్యం యివ్వబడుతుంది, అంతేగాక రాత్రి వేళలలో పనిచేసే వారికి ప్రతి ఒక్కరికి 0–25 నయా పైసలు అలవెన్సు యివ్వ బడుతుంది.

పనివారల కందరికీ రెండు జతల యూనిఫారములు యివ్వ బడ్డాయి.

లఘు పరిశ్రమలు

ఫోర్డు ఫౌండేషన్ సహాయంతో పారిశ్రామిక అధికారులు విస్తృత శిక్షణ సంస్థను హైద్రాబాదులో నెలకొల్పేటందుకు భారత ప్రభుత్వం నిశ్చయించింది. సంస్థకు భవనాన్ని యిచ్చేందుకై రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. రాష్ట్రంలో లఘు పరిశ్రమల అభివృద్ధి పథకంలో ఒక భాగంగా ప్రభుత్వం, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, అధికారులతో కూడిన 50 మంది సభ్యులుగల బృందాన్ని ఉత్తరాదిలో లఘు పరిశ్రమల తీరు తెన్నులు తెలుసుకునేందుకు వీలుగా పంపింది. 1961 ఆగస్టు 17 వ తేదీన యీ బృందం హైద్రాబాదు నుంచి బయలుదేరి వెళ్ళింది.

నెల్లూరు, ఆమదాలవలస, మచిలీపట్నం, ఖమ్మం, జనగామ, ప్రొద్దటూరు, హైద్రాబాదు, సూర్యాపేట (నల్గొండ జిల్లా) లలో సహాయక ప్రైవేటు పారిశ్రామిక వాటికలు నిర్మించేందుకై ప్రభుత్వం మంజూరి యిచ్చింది.

దిగుమతి లైసెన్సులు, ముడిసరుకు, మిషనరీ, అప్పులు యిచ్చే సౌకర్యాలు లభించేందుకై భారత ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్రంలోని అన్ని లఘు పరిశ్రమలు. తమ పేరును పరిశ్రమల శాఖ డైరెక్టర్ కార్యాలయంలో నమోదు చేసుకునేందుకై చర్యలు తీసుకో బడుతున్నాయి.



ఒకచో నేలను బవ్వళించు నొకచో నొప్పారు బూసెజ్జపై
ఒకచోశాకము లారగించు నొకచో నుత్కృష్ట శాల్యోదనం
బొకచో బొంతధరించు నొక్కొకతఱిన్ యోగ్యాంబరశ్రేణి, లె
క్కకురానీయడు కార్యసాధకుడు దుఃఖంబున్ సుఖంబున్ మదిన్

—భర్తృహరి

సంగ్రహ ప్రకటనలు

జిల్లా కలెక్టర్లు తమ తమ అధికార పరిధులలో అల్ప సంఖ్యాక భాషా వర్గాల సంక్షేమానికి సంబంధించిన సమస్త పనుల పై పూర్తిగా ఆజమాయిషీ వహించడానికి ప్రభుత్వం ఆదేశించింది. ఏదైనా అల్ప సంఖ్యాక భాషా వర్గం నుంచి ఏమైనా ఫిర్యాదులు వచ్చినట్లయితే, ఆ విషయాన్ని తన జిల్లాలోని అందుకు సంబంధించిన స్థానిక అధికార్లకు తెలపడం ద్వారా ఆ ఇబ్బందులు తొలిగించ డానికి జిల్లా కలెక్టరు చర్యలు తీసుకుంటాడు. ఒక వేళ ఫిర్యాదులు సాధారణమైనవై, రాష్ట్ర మంతటికీ వర్తించెడివై నట్లయితే ఆ విషయాన్ని సూచనలు లేదా ఉత్తర్వుల నిమిత్తం ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుంది. ఈ విషయంలో ప్రభుత్వంనుంచి కలెక్టర్లకు వచ్చేజాబులు అత్యంత జరూరైనవిగా పరిగణించబడి సాధ్యమైనంత తొందరగా ప్రత్యుత్తర మివ్వడం జరుగుతుంది. సందేహాస్పదమైన అంశాలు, సూచనల నిమిత్తం ప్రభుత్వానికి నివేదించబడతాయి. అల్ప సంఖ్యాక భాషావర్గాల సంక్షేమానికి సంబంధించిన పనులను, సాధారణ పరిపాలన (జనరల్) శాఖలో ఉప కార్యదర్శిగా వున్న శ్రీ భారత్‌చంద్ ఖన్నా చూస్తారు. ఏదైనా జరూరైన అంశాన్ని ఆయన దృష్టికి తేవడం అవసరమైతే ఆ ప్రకారం చేయవచ్చును.

ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ల పరీక్షలు

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు 1692 జనవరి మొదటి వారంలో సూపర్‌వైజర్లు (విద్యుచ్ఛక్తి వినియోగం) ఎలక్ట్రిషియన్లు, వైర్‌మెన్లకు యోగ్యతాపత్రాలు ఇచ్చే నిమిత్తం పరీక్షలు జరుపుతుంది. ఇంగ్లీషు, తెలుగు, ఉరుదు, హిందీ భాషలలో యీ పరీక్షలు జరుగుతాయి. మిగతా వివరాలను త్వరలో ప్రకటిస్తారు. ఏమైనా వివరాలు కావలిస్తే, హైద్రాబాదు, ఖైరతాబాదులోని ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రికల్ ఇనస్పెక్టరు కార్యాలయంలో లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శిని సంప్రదించవచ్చును.

రాయతీల రద్దు

సమాజాభివృద్ధికి సంబంధించిన కొన్ని ఉద్యోగాలలో రాజకీయ బాధితుల నియామకం విషయంలో రాయతీల వర్తింపుకు సంబంధించి ప్రణాళికలు, అభివృద్ధిశాఖ 1959 జూన్ 11 వ తేదీన జారీచేసిన 598 వ నెంబరు జి.ఓ.ఎం.ఎస్. లో చేసిన ఉత్తర్వులు రద్దుపరచబడ్డాయి

రాజకీయ బాధితులైన అభ్యర్థుల విషయంలో ఒకవేళ వారు నియామకానికి ఇతరత్రా అర్హులు అయినట్లయితే విద్యార్హతలకు సంబంధించిన నిబంధననూ, 45 సంవత్సరాల వరకు వయః పరిమితి నిబంధనను సడలించడానికి యీ జి.ఓ. ద్వారా అవకాశం కల్పించడమైనది.

భూసార సంరక్షణపథకం

1961–62వ సం.లో భూసార సంరక్షణ పనులను అమలు పరిచే నిమిత్తం కడప జిల్లా రాయచోటిలో 1961 ఆగస్టు 1 వ తేదీనుంచి ఒక సబ్ డివిజన్ను తెరవడానికి ప్రభుత్వం మంజూరీ ఇచ్చింది. ఆవృత్త, అనావృత్త వ్యయాల క్రింద వరుసగా రూ. 47,300, రూ. 1,13,500 లను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది.

విద్యా రాయతీలు

రాజకీయ బాధితుల పిల్లలకూ, మనుమలకు విద్యా రాయతీల మంజూరీకై ప్రభుత్వం ఆమోదించిన పథకాన్ని 1961–62 వ

సంవత్సరం నుండి భారత జాతీయ సైనికోద్యమంలో పాల్గొన్న వారి పిల్లలకూ, మనుమలకూ, రాష్ట్రంలోని రాజకీయ బాధితుల "సవతి" పిల్లలకు కూడా వర్తింపజేయడానికి ప్రభుత్వం నిర్ణయించంది.

జనుప పంట

ఆంధ్ర ప్రదేశ్‌లో 1661 జూన్ నెలాఖరువరకు సుమారు 72,900 ఎకరాలలో జనుము పండించినట్టు అంచనా వేశారు. గడచిన సంవత్సరం ఇదేకాలంలో సుమారు 74,500 ఎకరాలలోనూ, గత అయిదు సంవత్సరాలలో సగటున 74,500 ఎకరాలలోను ఈ పైరు పండించడ మైనది. అంటే ఈ ఏడాది ఈ పైరు వేసిన విస్తీర్ణం గత సంవత్సరపు అంచనా విస్తీర్ణం కంటే 2 శాతం, అదే ప్రకారం గడచిన అయిదేళ్లకు లెక్క కట్టిన సగటు విస్తీర్ణం కంటే కూడా 2 శాతం తక్కువ అన్నమాట.

ఉద్యోగుల ప్రభుత్వ భీమా పథకం

ఉద్యోగుల ప్రభుత్వ భీమా పథకం క్రింద 1961 జూలై నెలలో 872 మంది పనివారలు నమోదు చేయబడినారు. అస్వస్థ సౌకర్యం, విస్తరించబడిన అస్వస్థ సౌకర్యం, ప్రసూతి సౌకర్యాల క్రిందా, దుర్బలులైనవారికి తాత్కాలికంగానూ శాశ్వంతగానూ లభింపజేసే సౌకర్యాల క్రింద యీ నెలలో రు. 85, 081 ల మొత్తం చెల్లించారు.

హోటళ్ల పని వేళలు

హైద్రాబాదు, సికింద్రాబాదు జంటనగరాలలోని హోటళ్లు, రెస్టారెంట్లు, భోజనశాలలను యేరోజునకూడా ఉదయం 5 గంటలకు పూర్వము తెరువకూడదనీ, రాత్రి 12-30 గంటల తరువాత తెరచి వుంచకూడదని పోలీసు కమీషనరు ప్రకటిస్తున్నారు.

పన్ను మినహాయింపు

1957వ సంవరపు ఆంధ్ర ప్రదేశ్ సాధారణ అమ్మకం పన్ను చట్టం 2వ సెక్షన్‌లోని 3 (-అ-) సబ్ సెక్షన్ క్రింద, యెలక్ట్రికల్ హియరింగ్ ఎయిడ్స్‌పై విధించెడి అమ్మకం పన్నును మినహాయించినట్టు ప్రభుత్వం ప్రకటిచింది.

కార్మిక వార్తలు

గత జూన్ నెలలో ఆంధ్రప్రదేశ్‌లో 18 ఫ్యాక్టరీలను కొత్తగా తెరిచారు, 606 మంది కార్మికులకు వీటిలోపని లభించింది. ఈనెలలో 7 సమ్మెలుజరిగాయి. 1236 మంది పనివారలు వాటిలో పాల్గొన్నారు. తత్ఫలితంగా 2578 పని రోజుల నష్టం సంభవించింది. ఈమాసంలో వస్త్రపరిశ్రమలో నూటికి 13.32 వంతులమంది పనివారలు పనిలోనికి వెళ్లలేదు. అదే ప్రకారం ఇంజనీరింగు పరిశ్రమలో 15.39 వంతులమందీ, సిగ్రెటు పరిశ్రమలో 15.56 వంతులమంది, సిమెంటు పరిశ్రమలో 21.56 వంతులమంది, కాగితం పరిశ్రమలో 14.38 వంతులమంది పనివారలు కూడా యీనెలలో పనిలోనికి పోలేదు ఈకాలంలో 80 పారిశ్రామిక ప్రమాదాలు సంభవించాయి. ఒకవ్యక్తి మరణించారు, మరోవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పనివారల నష్టపరిహార చట్టం క్రింద, శాశ్వతంగా దుర్బలులైనవారికీ, మరణించిన వ్యక్తుల తాలూకువారికి యీనెలలో రూ. 71,114,47 ల మొత్తం చెల్లించారు.

రాష్ట్ర రవాణాసంస్థ, ప్రాంతీయ రవాణాసంస్థల వ్యవస్థీకరణ

1939 వ సం. పు. మోటారుబండ్ల చట్ట నిబంధనలక్రింద ప్రభుత్వం దిగువసభ్యులతో రాష్ట్రట్రాన్స్‌పోర్ట్ అధారటీని వ్యవస్థీకరించినది,-

1. రవాణాశాఖ కమీషనర్ ... (అధ్యక్షుడు)
2. రహదారులశాఖ అడిషనల్ చీఫ్ఇంజనీరు
3. పోలీసు కమీషనర్
4. శ్రీకె. ఎల్. ఎన్ ప్రసాదు 24-515. సూర్యరావుపేట, విజయవాడ.

(2–4: సభ్యులు)

వివిధజిల్లాలకు ప్రాంతీయ రవాణా సంస్థలనుకూడా ప్రభుత్వం వ్యవస్థీకరించింది,

అధికాహారోత్పత్తి పథకం—కొన్నిరాయతీలు

అధికాహారోత్పత్తి పథకం క్రింద 1371 వ ఫసలీ- (1962 జూన్ 30 తేదివరకు) లో కూడా యీ క్రింది రాయితీలు లభింపజేయాలని ప్రభుత్వం ఆదేశించింది:-

1. సంస్థల అవరణాలలో సాగుబడి.
2. ఇంటి పెరుగుదల సాగుబడి
3. గ్రామంలేక పట్టణాల ఖాళీస్థలాల సాగుబడి
4. సముద్రతీర భూముల సాగుబడి
5. సాంకేతిక కారణాల దృష్ట్యానీటి పారుదల నిబంధనావళిని ఉల్లంఘించినందుకు విధించబడిన జరిమానాల రద్దు.

6. గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాలోని కోస్తాప్రాంతాల భూముల సేద్యం.

రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రగిడ్డంగుల కార్పొరేషన్ డైరెక్టర్ల బోర్డు సభ్యులుగా ప్రభుత్వం క్రింది వారిని నామినేటు చేసింది. వీరి సభ్యత గడువు 1961 ఆగస్టు 5వ తేదీ నుండి 3 సంవత్సరాలు:-

1. శ్రీ బి. రాజగోపాలరావు, యం.పి., శ్రీకాకుళం జిల్లా
2. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ డైరెక్టరు-(ఎక్స్ అఫీషియో)-
3. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల రిజిస్ట్రారు-(ఎక్స్ అఫీషియో)-
4. ఆంధ్రప్రదేశ్ రహదార్ల శాఖ చీఫ్ ఇంజనీరు-(ఎక్స్ అఫీషియో)-
5. ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ కమీషనర్-(ఎక్స్ అఫీషియో)-

అటవీసంపద వినియోగ సలహా సంఘం

అటవీ సంపద వినియోగ సలహా సంఘం అధికారి సభ్యుడు శ్రీ జె. బెనర్జీ ఉద్యోగ విరమణ చేసినందువల్ల ఆయన స్థానంలో అటవీశాఖ డిప్యూటీ చీఫ్ కన్సర్వేటర్ శ్రీ పి.యస్. రావును బోర్డు అధికార సభ్యునిగా ప్రభుత్వం నామినేటు చేసింది.

కమిటీహాలుకు ఎయిర్‌కండిషన్ సౌకర్యం

హైదరాబాదు తాత్కాలిక సచివాలయ భవనంలోని కమిటీ హాలును ఎయిర్ కండిషన్ చేయడానికీ, హాలులో శబ్దగ్రాహక యంత్రాలు అమర్చటానికీ ప్రభుత్వం రు. 45,520 లను మంజూరు చేసింది.

హిందీలో "ఆంధ్రప్రదేశ్" మాసపత్రిక

ప్రస్తుతం తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో ప్రచురించబడుతున్న "ఆంధ్రప్రదేశ్" మాస పత్రికను హిందీలోకూడా ప్రచురించడానికి నిర్ణయించారు. దీని సంవత్సర చందా కూడా మూడు రూపాయలే. వలయువారు చందా డబ్బును ముందుగానే హైద్రాబాదులోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌరసంబంధములశాఖ డైరెక్టరుకు పంపాలి.



మదముఁగామంబు గ్రోధంబు మత్సరంబు,
లోభమును మోహమును ననులోని సహజ
వైరి వర్గంబు నొడిచిన వాఁడ యొడుచు
నశ్రమంబున వెలుపలి యహితతతుల

(భా. ఆది.)

ప్రగతి పథంలో

(జిల్లాల నుంచి అందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గూర్చిన సంక్షిప్త వార్తలు)

ఆదిలాబాదు

మిడతల దాడి నిరోధనకు జాగ్రత్త చర్యలు

మధ్య ప్రదేశ్, మహారాష్ట్రల నుంచి మిడతలదండ్లు ఈ జిల్లాలోనికి ప్రవేశించడాన్ని నిరోధించడానికై అవలంబించ వలసిన చర్యలను, ఆగష్టు 10 వ తేదీన జరిగిన జిల్లా పరిషత్తు వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశంలో పరిశీలించారు. భారీ ఎత్తున కరపత్రాలు ముద్రించి జిల్లాలోని గ్రామాలలో ప్రజలకు పంచిపెట్టడానికి ఈ సమావేశంలో నిశ్చయించారు. క్రిందటి సంవత్సరం మిడతల దాడుల ఫలితంగా తీవ్రంగా నష్టపడిన జిల్లాలలో ఆదిలాబాదు కూడా ఒకటి.

జిల్లా పరిషత్తు సమ్మేళనం

ప్రణాళికలు, స్థానిక పరిపాలన శాఖ కార్యదర్శి శ్రీ సి. నరసింహం ఆగష్టు 19 వ తేదీన ఆదిలాబాదులో జిల్లా పరిషత్తు ప్రథమ సమ్మేళనానికి ప్రారంభోత్సవం చేశారు.

అనంతపురం

క్షయ వ్యాధి నిరోధక కేంద్రం

అనంతపురంలో ఆగష్టు 15 వ తేదీన క్షయ వ్యాధి నిరోధక కేంద్రాన్ని ప్రారంభించారు. ఇటువంటి నమూనా కేంద్రం భారత దేశమంతటిలోనూ ఇదే మొదటిది. బెంగుళూరులోని జాతీయ క్షయ వ్యాధి నివారణ సంస్థ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో దీనిని నడుపుతున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ శిశు సంక్షేమ నిధి కూడా దీని నిర్వహణకు తోడ్పడుతున్నాయి.

చిత్తూరు

శ్రమదానం

ఆగష్టు 30 వ తేదీన వెదుళ్ల చెరువు గ్రామంలోని కొన్ని వీధులను శ్రమదానం ద్వారా చదును చేశారు. చంద్రగిరి పంచాయతీ సమితి ఆధ్వర్యాన ఈ పని జరిగింది. సుమారు 200 మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ రోజున దాదాపు రూ. 500/- లు విలువ చేసే పని జరిగింది.

తూర్పు గోదావరి

ఎలిమెంటరీ పాఠశాల భవన ప్రారంభోత్సవం

భీమనపల్లిలో నిర్మించిన తటవర్తి వీరశంకరం జిల్లా పరిషత్తు ఎలిమెంటరీ పాఠశాల నూతన భవనానికి సెప్టెంబరు 6 వ తేదీన ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంలో స్వర్గీయ శ్రీ తటవర్తి వీర శంకరం ఆయన సతీమణిగారల చిత్రపటాలను ఆవిష్కరించారు. వీరు పాఠశాల భవన నిర్మాణానికై భూమి విరాళమిచ్చారు.

ఆంధ్రకేసరి హరిజన హాస్టలు గ్రంథాలయం

రాజమండ్రిలో సెప్టెంబరు 3 వ తేదీన ఆంధ్ర కేసరి హరిజన హాస్టలు గ్రంథాలయాన్ని ప్రారంభించారు దీనికి శ్రీ ఎం. రఘురామారావు 50 పుస్తకాలనూ డా. ధనలక్ష్మి ఒక అల్మరాను బహూకరించారు.

గుంటూరు

సంచార వైద్యశకటానికి ప్రారంభోత్సవం

భారత ప్రభుత్వంవారు కుగ్లర్ ఆసుపత్రికిబహూకరించిన

సంచార వైద్య శకటానికి ఆగష్టు 27 వ తేదీన గుంటూరులో ప్రారంభోత్సవం జరిగింది.

నీటి గొట్టాలు

ఒ గోలకు శాశ్వతంగా నీటి గొట్టాలు వేసే పని ఆగష్టు 30 వ తేదీన ఆరంభమైంది.

రీజినల్ కంట్రోల్ లెబొరేటరీ ప్రారంభోత్సవం

యూనియన్ ఆహారశాఖా మంత్రి డాక్టర్ పంజాబ్‌రావ్ దేశ్‌ముఖ్, ఆగష్టు 26 వ తేదీన గుంటూరులో రీజినల్ కంట్రోల్ లెబొరేటరీకి ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రయోగశాలలో ప్రారంభంలో నెయ్యి తదితర నూనెలు పరీక్షించ బడతాయి.

హైద్రాబాదు

పొదుపు గ్రామం

మేడ్చల్ తాలూకాలోని బౌరంపేట గ్రామాన్ని సెప్టెంబరు 1 వ తేదీన "పొదుపు గ్రామం"గా ప్రకటించారు. ఈ గ్రామంలోని అన్ని కుటుంబాల వారూ ప్రతి నెలా కొంత మిగిల్చి చిన్న మొత్తాల పొదుపు పథకానికి పెట్టుబడి పెట్టడానికి నిశ్చయించారు. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు ఒక రూపాయి పొదుపు ఉద్యమాన్ని ప్రారంభించారు.

ప్రణాళికా సందేశం

భారత ప్రభుత్వ ఫీల్డు ప్రచార విభాగానికి అనుబంధంగా హైద్రాబాదులో సమాచార గోష్టినొక దానిని ఏర్పాటు చేయడానికై బృహత్తర హైద్రాబాదులోని అనేక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సెప్టెంబరు 5 వ తేదీన సమావేశమై తీర్మానించారు. ప్రణాళికా సందేశాన్ని ప్రజానీకంలో వ్యాపింపజేసి వాటి లక్ష్యాలను సాధించడంలో వారి సహాయ సహకారాలను సమకూర్చడానికై ఇది ఉద్దేశించ బడినది.

కరీంనగరం

బీదలకు అన్న దానం

స్వాతంత్ర్య దినోత్సవంనాడు కలెక్టరు కార్యాలయం వద్ద సుమారు 1,000 మంది బీదలకు అన్న దానం జరిగింది.

గ్రామ లక్ష్మల శిబిరం

గ్రామ లక్ష్మల రెండవ శిక్షణ శిబిరం మెట్‌పల్లి గ్రామంలో ఆగష్టు 26 నుంచి 28 వ తేదీ వరకు నిర్వహించ బడినది. చుట్టుపట్ల గ్రామాలకు చెందిన సుమారు 50 మంది మహిళలు శిక్షణ పొందారు

ఖమ్మం

గిడ్డంగికి శంకుస్థాపన

ఆహార, వ్యవసాయ, అటవీశాఖల మంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి, స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ తాలూకు మొదటి గిడ్డంగికి ఖమ్మం మార్కెటు ప్రాంతంలో 1961 ఆగస్టులో శంకు స్థాపన చేశారు.

మంచినీటి సరఫరా పథకం

రూ. 30,000ల వ్యయంతో మంచినీటి సరఫరా పథకాన్ని అమలుపరచడానికై మధిర మునిసిపాలిటీ నిశ్చయించింది. మాదపల్లి, మధిరలమధ్య వైరా నదికి అడ్డంగా రూ 10,000 ల వ్యయంతో ఒక అడ్డకట్టుదారిని నిర్మించడానికి కూడా ఈ మునిసిపాలిటీ నిర్ణయించింది.

ఏజెన్సీ ప్రాంతంలో మాధ్యమిక పాఠశాల

గౌరీదేవిపేటలో ఆగస్టు 10 వ తేదీన ఖమ్మం ఏజెన్సీబోర్డు మాధ్యమిక పాఠశాలకు ప్రారంభోత్సవం జరిగింది. పాఠశాల భవన నిర్మాణానికై గౌరీదేవిపేట గ్రామస్థులు రూ. 5000 ల మొత్తాన్నీ, 5 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు.

గ్రామీణాభివృద్ధి సహకార సంఘం సమావేశం

గోదావరిలోయ సహకార గ్రామీణాభివృద్ధి సహకార గ్రామీణాభివృద్ధి సహకార సంఘం (కోయిడ) సాంవత్సరిక సర్వ సభ్యసమావేశం ఆగస్టు 29న జరిగింది. ఈసంఘం వ్యవసాయోత్పత్తు (వెదురు)ల వినియోగం ద్వారా, దీనిసభ్యులు కూడాఅయిన కొండజాతుల వారికి ఉపాధికల్పిస్తున్నది. కోయిడ, నెహ్రూనగర్ లలో రెండుస్టోర్లను, ఈసంఘం నడుపుతున్నది. 1960_61 వ సంవత్సరములో ఇది రూ. 66,679లు విలువ చేసే వ్యాపారం జరిపింది. దీనిలో రూ 35, 281 లమొత్తం పనివారల వేతనాల క్రింద రూ, 16, 670 ల మొత్తం అటవీ శాఖకు రాయల్టీ క్రింద చెల్లించబడినది.

కృష్ణ

నందిగామలో క్రొత్త ఫోన్ ఎక్ఛేంజి

రాష్ట్ర శాసనసభాధ్యక్షుడు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు ఆగస్టు 31 వ తేదీన నందిగామలో క్రొత్తగా ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ టెలిఫోను ఎక్ఛేంజికి ప్రారంభోత్సవం చేశారు.

హరిజనవాడకు రేడియో సెట్టు సరఫరా

సాంఘిక సంక్షేమ కార్యక్రమం క్రింద, ఆరువూరు పంచాయతీ సమితి ఊటుకూరు గ్రామ హరిజన వాడకు సరఫరా చేసిన సాముదాయిక రేడియో సెట్టుకు 1961 ఆగస్టు నెలలో ప్రారంభోత్సవం జరిగింది.

స్వాతంత్ర్య దినోత్సవాలు

మచిలీపట్నంలోని వివిధ విద్యా సంస్థలలోనూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాలలోను, ప్రైవేటు సంస్థలలోను స్వాతంత్ర్య దినోత్సవాలు జరిగాయి. తాలూకా కార్యాలయం వద్ద బీదలకు అన్నదానం జరిగింది. ఆ రోజు రాత్రి కలెక్టరు కార్యాలయావరణలో కూచిపూడి బృందంవారు భామ కలాపం ప్రదర్శించారు.

నివేశన స్థలాలకు పట్టాలు

విజయవాడలోని బాప్టిస్టుపాలెం, పొజ్జోనిపేటలలో కాపురముంటున్న సుమారు 100 కుటుంబాల వారికి 1961 సెప్టెంబరు నెలలో జిల్లా కలెక్టరు నివేశన స్థలాలకు పట్టాలు ఇచ్చారు

సహకార భూమి తనఖా బ్యాంకు నూత్న భవనం

ఉయ్యూరు సహకార భూమి తనఖా బ్యాంకు నూత్న భవనానికి ఆగస్టు 28 వ తేదీన ప్రారంభోత్సవం జరిగింది 31 సంవత్సరాల క్రితం, 86 మంది సభ్యులతోనూ, రూ 860 ల వాటా ధనంతోను ఈ బ్యాంకు ప్రారంభించబడినది మొదట్లో 19 గ్రామాలు దీని క్రింద వుంచబడినవి. నేడు ఈ బ్యాంకు సభ్యుల సంఖ్య 4,000 లకు పెరిగింది. ఇప్పుడు దీని వాటా ధనం రూ 19,7000 లు 87 గ్రామాల ప్రజలకు ఈనాడు ఇది పరపతి సౌకర్యాలు కలుగజేస్తున్నది క్రిందటి సంవత్సరం దీనికి రూ. 21,000 ల నికరాదాయం లభించింది.

కర్నూలు

3 నీటి పారుదల పథకాల మంజూరీ

గిద్దలూరు తాలూకాకు ప్రభుత్వం రూ. 21,7500 ల అంచనా వ్యయంతో మూడు చిన్నరకం నీటి పారుదల పథకాలను మంజూరు చేసింది.

రోడ్డు వంతెన ప్రారంభం :

కర్నూలుకు సుమారు 18 మైళ్ల దూరంలో కొత్తకోట వద్ద, కె.సి. కాలువకు కొత్తగా తీసిన పాయకు అడ్డంగా నిర్మించిన రోడ్డు వంతెనకు ఆగస్టు నెలలో ప్రారంభోత్సవం జరిగింది.

మహబూబ్‌నగరం

రోడ్డు పనులు

బ్లాకులు ఏర్పడని ప్రాంతాలలో తలకు 30 నయాపైసల చొప్పున ఇచ్చే గ్రాంటు క్రింద ప్రభుత్వం రోడ్డు పనులకు రూ 40,000 లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించబడినాయి రోడ్డుల నిర్వహణకై రూ 66,666 ల మొత్తం మంజూరైనది.

పొదుపు పథకం

సిబ్బందిలో పొదుపరితనాన్ని ప్రోత్సహించే నిమిత్తం గద్వాల పంచాయతీ సమితి కార్యాలయంలో "పేరోల్ పొదుపు పథకాన్ని" ప్రవేశపెట్టారు. ప్రతి నెలా రూ 185 ల చొప్పున పొదుపు చేసిబహుమతి పత్రాలకు మదుపు పెట్టడానికి సిబ్బంది నిశ్చయించింది.

మెదక్

10 వ తరగతి ప్రారంభోత్సవం

కొండాపూర్‌లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1961 సెప్టెంబర్ నెలలో పదవ తరగతికి ప్రారంభోత్సవం జరిగింది.

నల్గొండ

గ్రామస్థులచే పెద్ద కాలవత్రవ్వకం

వేంపూరు ప్రాజెక్టు సమీపగ్రామస్థులు ప్రభుత్వనుండి ఏవిధమైన సహాయము పొందకుండానే రు. 10,000 ల ఖర్చుతో ఒక పెద్ద కాలువను త్రవ్వారు. ఈ గ్రామస్థుల కృషివల్ల 251 ఎకరాల అదనపు భూమి సాగులోనికి వచ్చింది.

యువజన క్లబ్బు కార్యకలాపాలు

నక్రేకల్ పంచాయితీ సమితిలోని భీమావరం గ్రామ యువజనులు జిల్లాలోని ఇతరులకు మార్గదర్శకులైనారు. 3,000 జనాభా గల ఈ గ్రామంలో ప్రజలను అభివృద్ధి కార్య క్రమాలలో పాల్గొనడానికి ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఒక యువజన క్లబ్బు స్థాపించ బడినది. సేద్య కాలంలో ఈ క్లబ్బు సభ్యులందరూ పని చేసి ఒక్కొక్కరు రు. 500/- ల చొప్పున సంపాదించారు. ఈ మొత్తాన్ని పూర్తిగా క్లబ్బు భవన నిర్మాణానికై విరాళంగా ఇచ్చారు. క్లబ్బు కంపోస్టు వారాన్ని నిర్వహించింది. క్లబ్బుసభ్యులు

400 గోతులు త్రవ్వారు. ఈ గ్రామంలోని యువజనులు అంటు వ్యాధుల నిరోధన, అస్పృశ్యతా నిర్మూలన, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు మొదలైన వాటిలో చాలా ప్రశంసనీయమైన కృషి చేస్తున్నారు.

మూసీ ప్రాజెక్టుక్రింద 12,000 ఎకరాల సాగు

ఈ సంవత్సరం మూసీ ప్రాజెక్టు క్రింద 12,000 ఎకరాల భూమి అభివృద్ధి చేయబడుతుంది.

గత సంవత్సరం క్రొత్తగా 1,325 బావులకు సబ్సిడీ మంజూరైనది.

క్రిందటి సంవత్సరం ఈ జిల్లాలో క్షామ పరిస్థితులు ఏర్పడినందువల్ల 175 చౌకదుకాణాల ద్వారా 13,000 మణుగుల ఆహార ధాన్యాలు సరఫరా చేశారు.

ప్రణాళికా ప్రదర్శనం

పంచవర్ష ప్రణాళికల ద్వారా జిల్లాలో సాధింపబడిన పురోభివృద్ధిని తెలియ జేసేటందుకై నల్గొండ పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో అగస్టు 15 న ప్రణాళికా ప్రదర్శన ఏర్పాటు చేశారు.

గ్రామాలలో స్వయం సహాయ కార్యక్రమాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భువనగిరి తాలూకాలోని 10 గ్రామాలలో స్వయం సహాయ కార్యక్రమాలను ప్రవేశ పెడతారు. ఈ కార్యక్రమాల నిర్వహణకై పంచాయతీసమితి ప్రతి గ్రామానికీ ఒక విస్తరణాధికారిని డిప్యూటు చేసింది. ఆ గ్రామాలలో వ్యవసాయోత్పత్తి సంఘాలు, "యువ్వక మండలులు" కూడా ఏర్పడినవి. విస్తరణాధికారి మార్గ దర్శకత్వంక్రింద ఈ సంఘాలు, మండలులు తమ కార్యక్రమాలను ప్రారంభిస్తాయి.

గిడ్డంగికి శంకుస్థాపన

భువనగిరిలో ఆగస్టు 28వ తేదీన గిడ్డంగికి శంకుస్థాపన జరిగింది. ఆంధ్రప్రదేశ్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ వారు నెలకొల్పిన వాటిలో ఇది రెండవది.

యువజనులచే రోడ్డు నిర్మాణం

నక్రేకల్ పంచాయతీ సమితి కొర్లపాడు గ్రామయువజనులు తమ గ్రామంనుండి ఇప్పగూడెం వరకు ఇటీవల ఒకరోడ్డు నిర్మించారు.

నారాయణపూర్ పంచాయతీసమితిలోని జనగామ గ్రామంలో గత సెప్టెంబరు నెలలో మహిళా శిక్షణ శిబిరం నిర్వహించబడింది.

నెల్లూరు

పాఠశాలస్థాయి హెచ్చింపు

ఆత్మకూరు తాలూకా కొరిమెర్లలోని సాంఘిక సంక్షేమ మాధ్యమిక పాఠశాలను ఈ సంవత్సరం సాంఘిక సంక్షేమ ప్రత్యేకోన్నత పాఠశాలగా పైస్థాయికి పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పాఠశాల సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టరు నిర్వహణక్రింద ఉంటుంది. కుల విభేదాల ప్రమేయం లేకుండా పాఠశాలలో అందరికి ఉచిత విద్య లభింపజేయబడుతుంది విద్యార్థు లందరకూ ఇచ్చట ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించబడతాయి. దుస్తులు పుస్తకాలు కూడా సరఫరా చేయబడతాయి.

నిజామాబాదు

జనాభా లెక్కల సేకరణ-ఉద్యోగులకు బహుమతులు

జనాభా లెక్కల సేకరణలో ఉత్తమమైన కృషి సల్పినందుకు గాను 1961 అగస్టు 28 న సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు 28 బహుమతులనూ ఛార్జి సూపరెంటెండ్లకు నాలుగు బహుమతులనూ, ఆర్మూర్ తాలూకా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీ వహీదుద్దీన్‌కు ఒక ప్రత్యేక బహుమతిని జిల్లా కలెక్టరు అందజేశారు.

శ్రీకాకుళం

ముఖ్యమంత్రిచే నూతన కళాశాల భవన ప్రారంభోత్సవం

శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆర్ట్సు కళాశాల నూతన భవనాలకు ముఖ్యమంత్రి సెప్టెంబరు 8న లాంఛనంగా ప్రారంభోత్సవం జరిపారు

గ్రంథా విష్కరణ

"సహకారం" అనే నాటికను ముఖ్యమంత్రి శ్రీకాకుళంలో సెప్టెంబరు 8న ఆవిష్కరించారు. ఇది ప్రణాళికలను గూర్చిన నాటిక.

"పొదుపు సంఘం"

సరిబుజ్జిలి బ్లాకు లక్ష్మీనరసు పేటలో స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఒక పొదుపుసంఘం ఏర్పడింది.

కొమ్ము వస్తువుల శిక్షణ కేంద్రం ప్రారంభం

నరసన్నపేట పంచాయతీసమితి ఆధ్వర్యాన కాగువాడలో సెప్టెంబరు 2న కొమ్ము వస్తువుల శిక్షణకేంద్రం ప్రారంభింపబడింది

విశాఖపట్నం

సీటి సరఫరా పనులు

నెల్లిమర్ల నీటి సరఫరా పనులకు గాను విజయనగరం మునిసిపల్ కౌన్సిలు, 61 ఆగస్టులో రు. 8,200 ల మొత్తాన్ని మంజూరు చేసింది.

పాఠశాలా విద్యార్థులకు నోటుపుస్తకాలు

మాజీ బేసిక్ పాఠశాల ఉపాధ్యాయ బృందం జూలై నెలలో జరిగిన 'విద్యావారం' సందర్భంగా పురజనులనుండి విరాళాలు వసూలుచేసి ఆసొమ్ముతో పుస్తకాలు, కలాలు, పెన్సిళ్లు కొని వాటిని ఆగస్టు 10న పాఠశాల ఆవరణలో జరిగిన ఉత్సవ సందర్భంలో, బీదవిద్యార్థులకు పంచిపెట్టారు.

స్వాతంత్ర దినోత్సవమునాడు వెండికప్పుల బహూకరణ

విజయనగరం ప్రేమసమాజంలో సబ్‌కలెక్టరు, ఆగస్టు 15న అనాథ విద్యార్థులకు వెండికప్పులు పళ్లెరాలు వస్త్రాలను పంచిపెట్టారు.

స్వాతంత్ర్య దినోత్సవాలు

ఎలమంచిలిలోని కోర్టుపేట పాఠశాలల్లో జరిగిన స్వాతంత్ర్య విద్యార్థులకు వస్త్రాలను పంచిపెట్టారు.

పాఠశాల భవన ప్రారంభోత్సవం

మామిడివాడలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనానికి రోడుకు సెప్టెంబరు 5న ప్రారంభోత్సవం జరిగింది.

కృష్ణాపురంలో కూడా నూతన ప్రాథమిక పాఠశాలా భవనాన్ని తెరిచారు

ప్రణాళికా ప్రదర్శనం

"ప్రజాప్రణాళిక" అనే పేరుతో ఒక బహిరంగ ప్రదర్శనను భారత ప్రభుత్వంవారు విజయనగరంలో 1961 సెప్టెంబరులో ఏర్పాటు చేశారు.

వరంగల్లు

మంచినీటి బావి ప్రారంభోత్సవం

మహబూబాబాద్ సివిల్ వైద్యశాల ఆవరణలో రు.2,300 ల ఖర్చుతో నిర్మించిన మంచినీటి బావికి ఉప్పేరుగూడెం వాస్తవ్యులు శ్రీ. యస్. నారాయణరెడ్డి సెప్టెంబరు నెలలో ప్రారంభోత్సవం చేశారు. దీని నిర్మాణానికై శ్రీనారాయణరెడ్డి భూవి విరాళమిచ్చారు.

లంబాడీల ముందంజ

సాంఘిక తారతమ్యత, వెనుకబడ్డతనం అనేది ఏవ్యక్తిలోనూ జీర్ణించి ఉండవనీ వారి వికాసానికి అడ్డురావనీ గొల్లచెర్ల పంచాయతీ సమితి ప్రాంతపు తండాకుచెందిన శ్రీ. డి. బాలు శ్రీ. డి. చిక్యా ఋజువు చేశారు. వీరు తమ పట్టా భూమినుండి 10 గుంటల పావు ఎకరం భూమిని పంచాయతికి ఇచ్చివేశారు. ఆ స్థలంలో ఒక తాత్కాలిక కుటీరాన్నికూడా తమ స్వంత ఖర్చుతో నిర్మించి ఇచ్చారు. ఆ కుటీరంలో పంచాయతీ సమితి ప్రస్తుతం ఒకే ఉపాధ్యాయునితో ఒక పాఠశాలను నడుపుతున్నది.

అయిదు క్రొత్తప్రాజెక్టులు

ఈ జిల్లా తృతీయ ప్రణాళిక పథకాలలో నాలుగు క్రొత్త ప్రాజెక్టులతో పాటు నరసంపేట తాలూకాలో ఎలుగువాగుకు అడ్డంగాఆనకట్ట నిర్మించే పథకాన్నికూడా రాష్ట్ర ప్రభుత్వం చేర్చింది

ప్యాకేజి పథకం

1961 ఖరీఫ్ ఉద్యమం సందర్భంగా 1800 ఎకరాల భూమిలో ప్యాకేజి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడానికై 18గ్రామాలను ఎన్నికచేయాలని జిల్లాపరిషత్తు స్థాయీసంఘం నిర్ణయించింది. ఈసంవత్సరం సమితులు ఏర్పడిన ప్రాంతాలలోని వారికీ సమితులు ఎర్పడని ప్రాంతాలలోని వారికీ ప్రత్యేక ఖరీఫ్ ఋణాలనిచ్చే నిమిత్తం స్థాయీసంఘం రు. 20,0000 లను కేటాయించింది. 44 చిన్నరకం నీటి పారుదల పనులకై 1961—62 సంవత్సరానికి రు. 61,948 ల. మొత్తం మంజూరైంది.

పశ్చిమ గోదావరి

బంగారంపేటలో కుట్టు పనికేంద్రం

కొయ్యలగూడెం పంచాయతీ సమితిలోని బంగారంపేటలో 1961 సెప్టెంబరులో స్త్రీలకు ఒకకుట్టుపని కేంద్రాన్ని తెరిచారు.

ఉత్తమసేవకు స్వర్ణపథకం

1960 వ సం. లో వచ్చిన వరదల సందర్భంలో ప్రశంసనీయమైన సేవచేసినందుకు గాను పూళ్లకరణం శ్రీ. పి. కోదండరామయ్యకు (ఏలూరు) జిల్లాకలెక్టరు స్వాతంత్ర్య దినోత్సవంనాడుపతకం బహూకరించారు.

వన్యమృగ సంరక్షణ

ఇ. వేణుగోపాలరావు

అపారమైన వన్యమృగ సముదాయంతో అలరారుతున్న దేశాలలో భారతావని కూడా ఒకటి. దేశ నైసర్గిక స్వరూపం, శీతోష్ణస్థితుల వైవిధ్యంలోనేమి, మృగ జాతుల సంఖ్యాబలంలోనేమి ఈ భూతలంపై మన దేశంతో సాటిరాగలిగినది ఒక్క ఆఫ్రికా ఖండం మాత్రమే. భారతదేశంలో సుమారు 500 జాతుల జంతువులు, 2,000 రకాల పక్షిజాతులు, 30,000 రకాలకు పైగా క్రిమికీటకాలున్నాయి. వుఇవికాక అనేక రకముల మత్స్య జాతులు, సర్ప జాతులు కూడా ఇక్కడ కనిపిస్తాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని అడవులలో మృగరాజములైన సింహాలు ఏనుగులు లేకపోయినప్పటికీ పులి, చిరుతపులి, ఎలుగుబంటు, యెనుబోతు మొదలైన అనేక రకాల మృగాలూ ఇంకా ఎన్నో జాతుల జంతువులు ఇక్కడ కనిపిస్తాయి. రాష్ట్రంలోని అన్ని అటవీ ప్రాంతాలలోనూ వింత వింత వర్ణాలతో తీరుతీరుగా కిలకిలా రావాలు చేస్తూ తిరుగాడే పక్షులు మనకు దర్శనమిస్తాయి. మైనా, బుల్బుల్, కోకిల మొదలైన పక్షులు పెద్ద పెద్ద అరణ్య ప్రదేశాలలో కనిపిస్తాయి. నెమిలి, కోడి, పావురం, చిలుక, పూరేడు పిట్ట మొదలైనవి అంతటా కనబడే సాధారణ పక్షులు. గూడకొంగలు పశ్చిమ గోదావరి జిల్లా కొల్లేరు సరస్సు పరిసరాల్లోనే కనిపిస్తాయి. అడవిబాతు, ఉల్లాముపిట్ట మొదలైనవి రాష్ట్రంలోని అనేక ప్రదేశాలలో నదులు, తటాకాలలోనూ, అడవుల్లోను నివసిస్తాయి నదీ నదాలలోను, ఉప్పుచేరులలోను పెక్కు జాతుల చేపలు పుష్కలంగా లభిస్తాయి. గోదావరిలోనూ, సీలేరు, ప్రాణహిత, పాలెంవాగు, పాఖాల్ సరస్సులోను మొసళ్లు కనిపిస్తాయి.

సహజ వాతావరణంలో అదురు బెదురు లేకుండా వన్యమృగాలు సంచరిస్తూవుండగా గోచరించే దృశ్యాలు మనకు ఎనలేని ఉల్లాసాన్నిస్తాయి. వన్యమృగముల ఆర్థిక ప్రాముఖ్యత విస్మరించరానిది. ప్రత్యక్షంగానేమి, పరోక్షంగానేమి వీటివల్ల మనం పొందుతున్న ప్రయోజనాలు అపారం. వైద్య పరిశోధనలో వానరములకుగల ప్రాధాన్యతా, కలప రవాణాలో ఏనుగులకు గల ప్రాముఖ్యత జగత్ప్రసిద్ధం. కస్తూరిమృగం గ్రంధి సర్వరోగ నివారణిగా ఖ్యాతి గాంచినది. పులి, ఇబెరితల క్రొవ్వు వాతరోగాలకు దివ్యౌషధం. జంతు ప్రదర్శన శాలలు, అభయారణ్యాలు, జాతీయ పార్కుల ద్వారా మనకు హెచ్చుగానే ఆదాయం లభిస్తున్నది. వన్యమృగాలను వివిధ దేశాలకు ఎగుమతి చేయడం ద్వారా కూడా మనం ఆదాయం పొందుతున్నాము. వన్యమృగ సంరక్షణద్వారా యాత్రికులను విశేషంగా ఆకర్షించ కలుగుతున్నాము.

వన్యమృగాల ఉనికి ప్రభావం కూడా ఏమంత తక్కువ ప్రధానమైనదికాదు. అగ్రాహ్యమూ, అగోచరమూ అయినప్పటికీ ప్రకృతి శోభ పరిపోషణలో వన్యమృగాలకున్న స్థానం చాలా ప్రముఖమైనది. చాలా మంది సర్పాన్ని చూడగానే రెండవ ఆలోచన లేకుండా దానిని సంహరిస్తారు. కాని ఎలుకలు మొదలైన వాటిపై వానికి వున్న నిరోధక శక్తి నెవరూ గుర్తించరెందుకు? నిర్లక్ష్యంగా పక్షులను చంపడం, వలవేసి పట్టుకోవడం, వాటి సహజ నివాస స్థానాలను నశింపజేయడం వలన పంటపొలాలకు తోటలకు మిడతలు మొదలైన కీటకాల బాధ ప్రబలంగా ఉంటున్నది కీటకాలు పక్షుల ఆహారం కావడంవల్ల అవి ప్రకృతికి సహజంగా ఎంతో మేలు చేస్తున్నవి

విత్తనాల వ్యాప్తి తద్వారా వివిధ వృక్ష జాతుల వ్యాపకం విస్తరణ చాలా వరకు జంతువులు, పక్షులు తగితర క్రిమికీటకాల వలననే జరుగుతున్నది. జంతువుల ఎరువు మొదలైన వాటివల్ల అరణ్య ప్రదేశాలు. పంటభూములు కూడా బలవర్ధకంగా తయారవుతున్నవి. వన్య మృగజాలం తమ రక్షణకూ, సంతాన విస్తరణకూ అరణ్యాలను వాంఛించేటంతగా కాకపోయినా మొత్తానికి అరణ్యాలకు కూడా వన్యమృగాల అవసరం ఉంది.

ఈ భూమికి వన్య మృగజాలం తప్పక అవసరం. నేటి ఆర్థిక రంగంలో భూమి ఉపయోగం అధికమైనప్పటికీ వన్యమృగ జాలానికి కూడా, ఈ భూమిని ఉపయోగార్థం పంచుకొనే హక్కు ఉన్నది. జనాభా అత్యధికంగా పెరిగిపోవడం వల్లనూ ఆహారధాన్యాల కొఱత వల్లనూ అరణ్యాల పొలిమేరలు అతిక్రమించి, కొన్నిటినిపూర్తిగా నరికివేసి ఆప్రదేశాలను పశువుల మేతకు వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారు. అంచేత వన్యమృగాల్ని తమ స్థావరంకోసం ఇంకాలోపలి భాగాలను వెదకుకో వలసివస్తున్నది. మన నాగరికతాభివృద్ధి చాలా వరకు వన్యమృగాల సంహారానికి దారితీసింది.

వన్యమృగజాలం మన జాతీయ సంపద మనకు జీవించడానికి ఎంత హక్కు ఉన్నదో వాటికీ అంతేఉన్నది. వాటినీ తద్వారా ప్రకృతి రామణీయకతను ధ్వంసం చేయడానికి మన కేహక్కూ లేదు. అయితే నేటి మానవునికీ హెచ్చుగా వ్యవసాయదారులకూ వన్యమృగ సంరక్షణ అనేది రుచించడం లేదు. పందులు, లేళ్లు తన పంటను నాశనం చేయడాన్ని గూర్చి, పెద్దపులి చిరుతపులులు తన ఎద్దును నష్టపఱచడాన్ని గూర్చి మాత్రమే అతడు ఆలోచిస్తాడు. వాటి సహజసిద్ధ స్థావరాలను నాశనం చేయడం వలననే కోతులు, పందులు, లేళ్లు తనపంట పొలాలను పాడుచేస్తున్నాయని వాటి స్థావరాలలోనికి చొచ్చుకొని వెళ్లి వాటి సహజ ఆహార సరఫరాకు భంగం కలిగించినందువలననే పెద్దపులి, ఇతర మాంసాశన జంతువులు తనకు నష్టాన్ని వాటిల్ల జేస్తున్నాయని అతడు తెలుసుకొనడంలేదు. ఎక్కడైతే లేళ్లూ పందులూ పుష్కలంగా ఉంటాయో అక్కడ పులి తన ఆహారాన్ని ఆడుతూ పాడుతూ సంపాదించు కొంటుంది, పశువులను ఎత్తుకపోవడం, మనుష్యులను తినడం లాంటివి ఉండవు. అయితే ఈ పందులు, లేళ్లు, పులుల వల్ల కలిగే నష్టం వ్యవసాయదారునికి హృదయ శల్యంగా ఉంటుందన్న మాట నిజమేమరి. వన్యజంతు జాలానికీ మానవునికీ జరుగుతున్న సంఘర్షణలో ఎవరు ఎక్కడ గెలు పొందుతారు అన్నప్రశ్న లేనేలేదు. కాని దీనికి సమాధానం జంతువులను ఎదుర్కొని నిర్మూలించే పద్ధతులు మాత్రం కావు. ఈ రెండిటి మధ్య సమానత్వాన్ని సాధించాలి ఇదే వన్యమృగ సంరక్షకులు సాధించవలసిన ముఖ్యోద్దేశ్యం.

మొన్నటి వరకూ వన్యమృగ సంరక్షణా సమస్యకు తగినంత ప్రాముఖ్యం లభించలేదు. వేదాలు, పురాణాలు, ఇతర మత గ్రంథాలలో సుందరంగా చిత్రింపబడిన మృగాల గాథల వల్ల పూర్వకాలంలో వన్యమృగ జాలానికి మానవుల హృదయాలలో మమతాపూరితమైన స్థానం ఉండేదని తెలుస్తున్నది. పురాతత్వ శాసనాలను, శిథిలాలను క్షణమాత్రం దర్శిస్తే మన పూర్వులు వన్య మృగజాలానికి ఎటువంటి స్థానం ఇచ్చారో తెలుస్తుంది. ప్రపంచానికి వన్యమృగాల ప్రాముఖ్యతను తెలియ జేయడానికి వారు సుత్తి ఉలి ఉపయోగించారు. వేటగాడు తరుముతున్న లేడి రక్షణ కోసం ఋషి ఆశ్రమానికి పరుగెత్తడం, కాళిదాసు వర్ణించాడు. మత్స్యాలకు మృగాలకూ, అరణ్యాలకూ రక్షణనిస్తూ క్రీ. పూ. 3వ శతాబ్దిలో అశోకుడు వేయించిన అయిదవ శాసనస్తంభం మీద శిలాశాసనాలున్నవి. వేట విషయంలో మొగలాయిలు, తొలుతటి బ్రిటిషు యుగంవారు కూడా వీటిని పాటించారు. ఈ శతాబ్దప్రారంభానికి ముందు వన్యమృగాల పలాయనానికి తోడుగా నవీన మారణాయుధాల ప్రయోగంకూడా ఎక్కువైంది. గడచిన వంద సంవత్సరాలకంటె యుద్ధకాలంలోను యుద్ధానంతర కాలంలోను వన్య మృగాల తగ్గుదల ఎక్కువగా కనిపించింది. నేడు పూర్తిగా వినాశన పరిస్థితులలో ఉన్నది.

దక్కనులోని స్టెప్పీ భూములలోనూ భారతదేశపు పశ్చిమ మధ్య ప్రాంతాల అధిక భూభాగంలోనూ ఎక్కువగా సంచరిస్తూ ఉండేసింహాలు నేడు గుజరాతులోని గిర్ అడవులలో మాత్రం పరిమితంగా ఉన్నాయి

పులి తన తెలివితేటలతోనూ, యుక్తులతోనూ క్రూర మానవుల హస్తాలనుండి రక్షించుకొన గలిగినా క్రమేణా వాటి సంఖ్య చాలాక్షీణించింది, తిరుపతి సమీపంలో, ఉన్న శేషాచలం అడవులలో ఏనుగులు సమృద్ధిగా ఉండేవని 1862లో ఆ ప్రాంతాన్ని సందర్శించిన ఫ్రెంచియాత్రికుడు జాన్ బాప్టిస్టుటావెర్నీర్ వలన తెలుస్తున్నది. అలాగే శతాబ్దాలక్రితం గొప్ప మహమ్మదీయ యాత్రికుడు ఫెరిస్తా, కడప కర్నూలు అడవులు ఏనుగులు, ఇతర వన్యమృగాల గుంపులతో నిండి ఉండేవని వ్రాశాడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో తప్ప మిగిలిన దక్షిణ రాష్ట్రాలన్నిటిలోను ఏనుగులు కనిపిస్తున్నవి. అడవిదున్న, భారతదేశపు కంకణ జాతికి చెందిన పక్షులు మొదలైనవి అంతరించడానికి సిద్ధంగా ఉన్నాయి.

జంతువులలో కల్లా వేగంగా పరుగెత్తే చిఱుతపులుల సంఖ్య మధ్యభారత దేశంలో దక్షిణాన మైసూరు వరకూ కూడా 50 సంవత్సరాల క్రితం వరకూ ఎక్కువగానే ఉండేది. కాని నేడు వాటి సంఖ్య క్షీణించినట్లు తెలుస్తున్నది. నేపాలు తరాయి భూముల

లోనూ అస్సాములోనూ సంచరించే భారతదేశపు ఖడ్గ మృగాలు నేడు అస్సాములోని కాజరంగాలో మాత్రమే కనిపిస్తున్నవి.

మానవుని దురాలోచనల ఫలితంగా వివిధ రకాలైన వన్య మృగాల సంఖ్య వేగంగా క్షీణిస్తున్నది. శీతాకాలంలో హిమాలయ దూరతీరాలనుండి వచ్చే పక్షుల సంఖ్య తగ్గుదల భయాందోళనలను కలిగిస్తున్నది.

తుపాకులు, తుపాకి మందులు, తీక్షణమైన ఆయుధాల వాడకం, జీపుకార్లు సెర్చి లైట్లవంటి నూతన సౌకర్యాలు, బాష్ప వాయువు, డైనమెట్ల ప్రయోగం, ఈ అన్నిటివలన వన్యమృగ జాలం అసంఖ్యాకంగా నాశనమవుతున్నది.

అడవులకు దగ్గరగా వున్న పట్టణాలలోనూ పల్లెలలోనూ క్రీడా మృగాల మాంసంతో వ్యాపారం చేసి జీవించే జనులు అనేకులున్నారు చపలబుద్ధులు అయిన వేటగాళ్లు తమకాంక్ష సంతృప్తికిగాను, నిశ్శబ్దంగా అరణ్యాలలో నివసించే ఈ మృగాలను చంపుతూ వుంటారు.

నిజమైన క్రీడాకారుడు తన గదిలో తానువేటాడిన మృగాల తలను గాని వెలవెలబోతున్న చర్మాన్నిగాని వ్రేలాడ దీసే బదులు కెమెరాతో "షూటింగు" జరుపుతూ తాను ఆనందిస్తూ ఇతరులను ఆనందపరచాలి. పంటచేల రక్షణకుద్దేశింపబడిన తుపాకులను అమాయక మృగాలను సంహరించడానికి దుర్వినియోగం చేయకూడదు.

అసాయ స్థితిలో ఉన్న మన అరణ్యాలలోని మృగాలకు చక్కని పునరావాస పథకాలను అన్వేషించాలి. ప్రస్తుతం ఆందోళనకరంగా వున్న వన్యమృగ క్షీణతను నిలువరించడం, వాటి రక్షణకు పూర్తి జాగ్రత్త వహించడం తప్ప ఇప్పటికే అంతరిస్తున్నవన్యమృగాలను సరంక్షించడానికి ఇంకో మార్గం లేదు.

దూరదృష్టితో ఈ సమస్యకు అగ్రస్థానం ఇచ్చిన మన రాజ్యాంగ వేత్తలకు కృతజ్ఞతలు చెల్లించాల్సి ఉంది. స్వాతంత్ర్యోదయంతో భారత ప్రభుత్వం, 1889 నుండీ దేశంలోని అడవులపట్ల ప్రభుత్వ విధానాన్ని పరిశీలించింది. వారి చర్చల ఫలితంగా భారతీయ వన్యమృగ సంరక్షణ సంఘం ఆవిర్భవించింది. ఈ బోర్డును మైసూరులో మైసూరు మహారాజా 1959 డిసెంబరులో ప్రారంభించారు. అప్పటి నుండీ ఈ కేంద్ర బోర్డు వారు రాష్ట్రాలలో వన్య మృగ సంరక్షణకై తీసుకొనవలసిన చర్యలు, పద్ధతులను గూర్చి ప్రభుత్వానికి సలహాలనిస్తూ వచ్చారు.

వన్య మృగసంరక్షణకు సంబంధించిన విషయాలలో రాష్ట్ర ప్రభుత్వానికి సలహాల నివ్వడానికి కేంద్ర సంఘం వలెనే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి కూడా ఒక సలహా సంఘం నియమింపబడింది. రాష్ట్రంలో వన్య మృగ అభివృద్ధి, సంరక్షణలకు సంబంధించిన ఒక బిల్లును ప్రవేశ పెట్టడానికి ప్రభుత్వం ఆలోచిస్తున్నది. వన్యమృగ సంరక్షణ విషయంలో ప్రబలమైన సానుభూతి సహకారాలు ప్రజలలో కలుగనంత కాలం వన్యమృగ సంరక్షణ కొఱకు ఎన్ని నిబంధనలు చేసినప్పటికి అవి తృప్తికరమైన ఫలితాల నివ్వవు అద్భుతమైన ఫలితాలను సాధించడానికి నిరంతర ప్రచారము అవసరం ఈ లక్ష్య సాధనకై బొంబాయి చారిత్రక ప్రకృతి శాస్త్ర సంఘంవారిచే ప్రచురింపబడుతున్న పత్రికల వంటివి ప్రచురించడం, వన్యమృగ సంరక్షణకు సంబంధించిన చిన్న చిన్న సంచికలను వెలువరించడం, వానిని ప్రజలలో ప్రచారంచేసి వారిలో ఉత్సాహాన్ని రేకెత్తించడం అవసరం.

పాఠశాలలు కళాశాలలలో బోధించబడే విద్యా ప్రణాళికలో వన్య మృగాలకు సంబంధించిన విషయాలను కూడా చేర్చాలి. శీఘ్రగతిని వన్యమృగ సంరక్షణకు ప్రచారం చేకూర్చడానికీ ప్రజలలో వన్య జంతు జాలంపట్ల పవిత్ర భావం కలిగించడానికీ దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరమూ అక్టోబరు మొదటి వారంలో వన్యమృగ సంరక్షణ వారోత్సవాలు జరుపుతున్నారు. ఈ వారంలో నిర్వహింపబడే వివిధ కార్యక్రమాలు ప్రజలలో వన్యమృగ సంరక్షణపట్ల ఆసక్తిని కలిగిస్తాయి.

జంతు ప్రదర్శనశాలలకు, అభయారణ్యములకు, జాతీయ విహారస్థలాలకూ విహారార్థం వెళ్లి వన్యమృగాలను, వాటి సహజ ఉనికి పట్లనూ చూడటంవల్ల ప్రజలలో వాటిపట్ల ఒక విధ మైన గౌరవభావం పెంపొందుతుంది.

వన్య జంతుజాలం పరిమితమైన అడవులలో స్వేచ్ఛగా తిరగడానికే కాకుండా అవి తమ సంతానాన్ని వృద్ధి చేసుకోవడానికి కూడా ఉద్దేశించ బడ్డాయి. అభయారణ్యములను, జాతీయ పార్కులనూ స్థాపించాలన్న అభిప్రాయం ఒక అర్థ శతాబ్దినాటిది మాత్రమే. అభయారణ్యముల స్థాపన గిర్ అడవులలోని సింహాల విషయంలోనూ, అస్సాము అడవులలోని ఖడ్గ మృగాల విషయంలోనూ మంచి ఫలితాలనిచ్చాయి.

ఈ విషయంలో ఆంధ్ర ప్రదేశ్ వెనుక బడలేదు. మన రాష్ట్రంలో ఇప్పటికే మెదక జిల్లా పోచారంలోనూ, వరంగల్లు జిల్లా పాఖాల, ఏటూరు నాగారంలలోను అభయారణ్యాలు వున్నాయి. ఆదిలాబాదు జిల్లాలో మరో అభయారణ్యం వుంది

కోస్తా ఆంధ్రలోని ఏజన్సీ అడవులలో కారెనుము సంరక్షణకు ఒక అభయారణ్యాన్ని ఏర్పాటు చేయడానికి నాగార్జున సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టుకు దగ్గరిగా కృష్ణా తీరాన లేళ్ల పార్కునూ, పశ్చిమ గోదావరి జిల్లా కొల్లేరు సరస్సు వద్ద గూడ కొంగల నివాసాన్ని నిర్మించడానికి ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

హైదరాబాదు సికిందరాబాదు జంట నగరాలకు దగ్గరగా మీర్‌ఆలం చెరువు వద్ద 300 ఎకరాల విస్తీర్ణంలో ఒక నూతన జంతు ప్రదర్శనశాల నిర్మింపబడుతున్నది. ఇది ఆసియాలోని పెద్ద జంతు ప్రదర్శనశాలలలో ఒకటికాగలదు, రాష్ట్రంలో సంపూర్ణ ఆధునాతన జంతుప్రదర్శనశాల కొరతను తీర్చగలదని ఆశిస్తున్నారు.

అభయారణ్యాలలో కాకుండా బయట క్రమంగా క్షీణిస్తున్న వన్యమృగాల విషయంలో వాటి వేటను నిషేధించడం, తుపాకి వేటకు లైసెన్సులను ఏర్పరచడంవంటి పద్ధతులను ప్రవేశ పెట్టడం ద్వారా వాటిని అభివృద్ధి పరచడం జరుగుతున్నది.

వేట జంతువులను సంహరించడంకంటే వాటిని సంరక్షించడంలోనూ, ఆ సజీవ జంతువులను చూచి ఆనందించడంలోనూ నిజమైన వినోదం లేదా. బుద్ధుడు, గాంధీ జన్మించిన దేశంలో పుట్టి పెరుగుతున్న మనం మన అరణ్యాలనూ అందులోని మూగ జీవాలనూ నిరుపయోగమైన, అక్రమమైన సంహారంనుండి రక్షించడానికి కంకణం కట్టుకోవాలి.

(ఆంగ్లవ్యాసంనుండి అనువాదం)

రచయితలు

1. డా॥బూర్గుల రామకృష్ణారావు, ఉత్తరప్రదేశ్ గవర్నరు.
2. శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి, పి.బి.యన్. కళాశాల, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.
3. వేదాంతము గోపాల కృష్ణమాచార్యులు, ఆత్కూరు, కృష్ణా జిల్లా.
4. శ్రీ ఎ. మురళీధర్, లా కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైద్రాబాద్-7.
5. శ్రీ మిక్కిలి సుందరరావు, లెక్చరరు, స్టూడెంట్స్ అకాడమీ, విజయవాడ.
6. శ్రీ దామెర రాజగోపాలరావు, చిత్రాడ, తూర్పు గోదావరి జిల్లా.
7. శ్రీ ఎ.వి. గోపాలనాయుడు, పంచాయతీ సమితి అధ్యక్షుడు, కాటూరు, కాళహస్తి తాలూకా, చిత్తూరు జిల్లా.
8. శ్రీ గోపాలకృష్ణమూర్తి, గాంధిపురం, రాజమహేంద్రవరం.
9. శ్రీ గరికపాటి మల్లావధాని, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా.
10. శ్రీకనగన నరసింహస్వామి, ఆంధ్రోపన్యాసకులు, లయోలా కళాశాల, గుణదల, విజయవాడ.
11. శ్రీ క్రొవ్విడి రామం, విజయనగరము.
12. శ్రీ పి. యస్. రావు, డిప్యూటీ చీఫ్ కన్సర్వేటర్, అటవీశాఖ.
13. శ్రీ ఇ. వేణుగోపాలరావు,అసిస్టెంట్ చీఫ్ కన్సర్వేటర్, అటవీశాఖ.

ముఖ్యవార్తలు

రాష్ట్రంలో

21-8-61

కొత్తగూడెంలో థర్మల్ విద్యుదుత్పాదక కేంద్రాన్ని నెల కొల్పడానికిగాను అవసరమైన విదేశద్రవ్యమారక సదుపాయలతో పాటు రాష్ట్రప్రభుత్వానికి ఏడుకోట్ల రూపాయల మేరకు ఆర్థిక సహాయాన్ని అందజేయడానికి ప్రపంచ బ్యాంకు నిపుణులు అంగీక రించినట్టు నేడు పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వెల్లడించారు.

22-8-61

హైద్రాబాదు పురపాలక సంఘం అత్యవసర సమావేశంలో కాంగ్రెసు అభ్యర్థి శ్రీ రామమూర్తి నాయుడు బృహత్తర హైద్రా బాదు మేయరుగా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

24-8-61

కేంద్ర నీటి పారుదల శాఖ ఉపమంత్రి శ్రీ జైసుఖ్ లాల్ హత్తీ నేడు లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఒక సభ్యుని ప్రశ్నకు సమాధానమిస్తూ, ఆంధ్ర ప్రదేశ్‌లోని గొట్టా ప్రాంతంలో వంశధార ప్రాజెక్టు నిర్మించడానికి, ఒరిస్సా ప్రభుత్వా నికి యెట్టి అభ్యంతరం లేదని తెలియజేశారు.

26-8-61

గుంటూరులో ప్రాంతీయ కంట్రోల్ పరిశోధనాలయానికి, ఆగ్‌మార్కు వ్యాపార కేంద్రానికి, కేంద్రవ్యవసాయ మంత్రి డాక్టరు పంజాబురావు దేశ్‌ముఖ్ ప్రారంభోత్సవం చేశారు

30-8-61

రాష్ట్ర ఆర్థికమంత్రి పత్రికా విలేఖరుల గోష్ఠిలో మాట్లా డుతూ, ఉద్యోగులకు యిచ్చే కరువుభత్యాన్ని వారి బేసిక్ వేతనంలో కలిపే ప్రతిపాదనలను రాష్ట్రప్రభుత్వం పరిశీలిస్తున్నదనీ త్వర లోనే ఈ విషయములో ఒక నిర్ణయం గైకొనబడుతుందని వెల్లడించారు

2-9-61

రాష్ట్ర ప్రణాళికా సలహాసంఘం తొమ్మిదవ సమావేశం హైద్రాబాదులో జరిగింది...

యితరత్రా జీవనాధారములేని 70 యేండ్లు అంతకు పైబడిన వృద్ధులకు వార్ధ్యకపు పించన్లు యిచ్చే పథకాన్ని వెంటనే అమలు పర్చాలని రాష్ట్రమంత్రి మండలి సమావేశంలో నిర్ణయించారు.

3-9-61

రాష్ట్రంలోని స్థానిక సంస్థలలో పనిచేసే వివిధ ఉద్యోగు లకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను నిర్ణయించింది.

4-9- 1

ముఖ్యమంత్రి పత్రికా విలేఖరుల సమావేశంలో ప్రసంగి స్తూ రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలో నున్న కొత్తగూడెంలోని సింగరేణి బొగ్గు గనులను కేంద్రంకు అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతను తెలియ జేసిందని అన్నారు.

5-9-61

వ్యవసాయ రంగంలోఉన్న పనివారలకు, కనీస వేతనాలను అమలు జరిపేందుకై రాష్ట్రాన్ని మూడు మండలాలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేసింది.—

హిందుస్థాన్ నౌకా నిర్మాణ కేంద్రం పనివారలు 24 రోజులుగా కొనసాగిస్తున్న సమ్మెను నేడు విరమించారు.

–9-61

ప్రణాళికా, సమాచార శాఖలమంత్రి శ్రీ. పి, రంగారెడ్డి హైద్రాబాదులో పత్రికా విలేఖరులతో ముచ్చటిస్తూ ప్రతిజిల్లాలోనూ ఒక నూలుమిల్లును స్థాపించడానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిదని అన్నారు.

10-9-61

హైద్రాబాదులో జరిగిన కేంద్ర ఆరోగ్యమండలి సమావేశంలో అధ్యక్షోపన్యాసంచేస్తూ ఆహారకల్తీల నివారణచట్టాన్నిరాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా అమలు జరుపాలని, కేంద్రఆరోగ్యశాఖ మంత్రి శ్రీ. డి. పి. కర్మార్కర్ విజ్ఞప్తి చేశారు.

11-9-61

యికముందు అన్ని అనర్హుల కోర్సులను రద్దుచేయాలని ఆంధ్ర విశ్వవిద్యాలయ సిండికేటు నిర్ణయించింది.

12-9-61

ప్రతి జిల్లాకు ఒక కుటుంబ నియంత్రణాధికారిని నియమించాలనీ, మశూచి వ్యాధి నిర్మూలనకై 100 శాతం సబ్సిడీ యివ్వాలని, హైద్రాబాదులో జరిగిన కేంద్ర ఆరోగ్య మండలి సమావేశం సిఫార్సులు చేసింది.

14-9-61

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రేలుడుమందు కొరతగా ఉన్నదని తెల్పుతూ, ప్రాజెక్టు పనికి అంతరాయం కల్గకుండా ఉండేందుకై తగినంత ప్రేలుడు మందును దిగుమతి చేసుకోవాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించాలని నాగార్జున సాగర్ ప్రాజెక్టు కంట్రోలు బోర్డు, హైద్రాబాదులో జరిగిన సమావేశంలో తీర్మానించింది.

17-9-61

హైద్రాబాదులో జాతీయ సాంకేతిక శిక్షణ వారోత్సవానికి గవర్నరు ప్రారంభోత్సవం చేశారు.

18-9-61

ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీకి గవర్నర్ శ్రీ భీమ్‌సేను సచార్ హైద్రాబాదులో ప్రారంభోత్సవం చేశారు.

20-9-61

ఢిల్లీలో కేంద్ర పరిశ్రమల మంత్రి పత్రికా విలేఖరుల సమావేశంలో ప్రసంగిస్తూ, తృతీయ ప్రణాళికా కాలంలో ప్రభుత్వ రంగంలో నిర్మించే భారీ విద్యుత్పరికరాల కర్మాగారాన్ని, హైద్రాబాదుకు 12 మైళ్ళదూరంలో ఉన్న రామచంద్రపురంలో నెలకొల్పుతారని ప్రకటించారు.

24-8-61

భారతదేశంలో

ఆగస్టు 22 వ తేదీన మొకోక్‌చంగ్ బజారులో నాగా విద్రోహి కాల్పులకు గురి అయిన నాగా ప్రజా ప్రతినిధుల సభ అధ్యక్షుడు. డాక్టర్ ఇన్‌కాంగ్లిబాఅవో మిలటరీ ఆసుపత్రిలో నేడు మరణించారు

తృతీయ ప్రణాళికను లోక్‌సభ ఆమోదించింది.

25-8-61

ఢిల్లీలో అన్ని పార్టీల ప్రతినిధులతో రెండురోజుల పాటు సమావేశం జరిపిన తర్వాత, ఫిబ్రవరి 22-28 తేదీల మధ్య అన్ని రాష్ట్రాలలోను ఒకే తడవ మూడవ సాధారణ యెన్నికలు జరుపుటకు యెన్నికల చీఫ్ కమీషనరు తేదీలు నిర్ణయించారు.

28-8-61

సభా హక్కులను ఉల్లంఘించిన నేరానికి సభముందు హాజరై మందలింపు స్వీకరించేందుకై ఆగస్టు 29వ తేదీన లోక్‌సభకు హాజరు కావల్సిందిగా బ్లిట్జ్ పత్రిక సంపాదకునికి లోక్‌సభ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వరంగంలో పెట్రోల్ పరిశ్రమాభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయ విషయమై ఇటాలియన్ ప్రభుత్వ సంస్థ ఇ.ఎన్.ఐ. భారత ప్రభుత్వాల మధ్య నేడు ఒడంబడిక కుదిరింది. దీని ననుసరించి పెట్రోల్ పరిశ్రమకు అవసరమైన సాంకేతిక సహాయం, యంత్ర పరికరాల సరఫరా నిమిత్తం రూ. 50 కోట్ల మేరకు ఋణం యివ్వడానికి ఇటాలియన్ సంస్థ అంగీకరించింది.

2-9-61

మద్యపాన నిషేధ కార్యకర్తల సదస్సు కొత్త ఢిల్లీలో జరిగింది దేశంలోని అన్ని రాష్ట్రాలనుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

8-9-61

లోకసభ రాజ్య సభల శరదృతువు సమావేశాలు సమాప్తమయ్యాయి.

9-9-61

ఒరిస్సాలో నేడు వరదలు తగ్గుముఖం పట్టాయి. ఈ వరదల వల్ల 16 గ్రామాలు కొట్టుకు పోయాయి.

10-9-61

యూనియన్ విద్యా మంత్రి డాక్టర్ కె.యల్. శ్రీమాలి పచ్‌మారిలో పన్నెండవ అఖిలభారత "నయీతాలీమ్" మహాసభను ప్రారంభించారు.

13-9-61

చంబల్, నాగార్జునసాగర్, కోసి, భద్ర, తుంగభద్ర నదీలోయ ప్రాజెక్టుల నిమిత్తమై 45 కోట్ల రూపాయల మేరకు

అమెరికా ఋణం ఇచ్చే విషయంలో అమెరికా, భారత ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరినట్టు నేడు క్రొత్త ఢిల్లీలో విడుదల చేసిన ఒక అధికార పత్రికా ప్రకటన ద్వారా తెలుస్తున్నది.

14-9-61

భారతదేశ మూడవ ప్రణాళికకు సహాయ పడేందుకై 170,000,000 డ్యూట్సెచ్ మార్క్సు అంటే 42,500,000 డాలర్లను దీర్ఘ కాలిక ఋణం క్రింద ఇవ్వడానికి ' పశ్చిమ జర్మనీ అంగీకరించింది.

15-9-61

డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 101 వ జన్మ దినోత్సవం నేడే.

విదేశాలలో

22-8-61

బ్రిటిష్ గయానాలో ప్రజాభ్యుదయ సంస్థకు ఎన్నికలలో పూర్తి మెజారిటీ లభించిది. దీని నాయకుడు డాక్టర్ చెడ్డీజగన్.

27-8-61

"ఆల్జీరియా తాత్కాలిక ప్రభుత్వం నేడు నూత్న మంత్రి మండలి జాబితాను ప్రకటించింది క్రొత్త మంత్రి వర్గంలో ప్రధాన మంత్రిగా శ్రీ ఫర్‌హత్ అబ్బాస్ స్థానే శ్రీ బి. యూసఫ్ బెన్ ఖెద్దా నియమించ బడినారు.

31-8-61

అణ్వస్త్ర పరీక్షలను పునః ప్రారంభించ దలచినట్టు సోవియట్ యూనియన్ ఈవేళ ప్రకటించింది. 1958 వ సంవత్సరములో అణ్వస్త్ర ప్రయోగాలకు స్వస్తిచెప్పిన తర్వాత రష్యా తిరిగి మొదటిసారిగా ఈ ప్రకటన చేసింది. ఉత్తర అట్లాంటిక్ వ్యవస్థ విధానంవల్ల తన నిర్ణయం మార్చుకొనక తప్పింది కాదని రష్యా తెలియజేసింది.

1-9-61

తటస్థదేశాల నాయకుల సమావేశం బెల్గ్రేడ్‌లో ఆరంభమైనది.

6-9-61

బెల్గ్రేడ్‌లో అయిదు రోజుల పాటు జరిగిన తటస్థరాజ్యాధినేతల సమావేశం నేడు సమాప్త మైనది.

6-9-61

ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ మాస్కో చేరుకున్నారు.

10-9-61

భారత, బర్మా వ్యవహారాల మాజీ స్టేట్ సెక్రటరీ లార్డ్ పెథిక్ లారెన్స్ లండన్‌లో ఆసుపత్రిలో మరణించారు. భారత దేశానికి వచ్చిన మంత్రివర్గ రాయబార బృందం నాయకుడుగా కూడా లార్డ్ లారెన్స్ వ్యవహరించారు.

16-9-61

అణ్వస్త్ర ప్రయోగాల పట్ల నిరసనగా ప్రదర్శనలు జరిపినందుకుగాను ప్రఖ్యాత బ్రిటిష్ తత్వవేత్త బెర్ట్రాండ్ రస్సెల్ దంపతులకు, ప్రజల్లో శాసనోల్లంఘన చర్యలను ప్రేరేపిస్తున్నారనే నేరంపై చెరి వారం రోజుల కారాగారవాస శిక్షవిధించారు. శ్రీ రస్సెల్ వయస్సు 89 సంవత్సరాలు.

16-9-61

కటాంగా అధ్యక్షుడు శ్రీ షోంబే ఒక ప్రకటనలో సమితి పై యుద్ధం ప్రకటించారు.

17-9-61

టర్కీ మాజీ ప్రధాని శ్రీ ఎడ్నన్ మెండ్రెస్‌ను నేడు ఇస్తాంబూల్‌లో ఉరి తీశారు.

పశ్చిమ జర్మనీ పార్లమెంటు దిగువ సభకు జరిగిన సాధారణ ఎన్నికలలో ఛాన్సెలర్ కొన్రడ్ ఎడెనోవర్ పార్టీ అయిన క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీకి విజయం లభించింది.

18-9-61

మిత్రరాజ్యసమితి సెక్రటరీ-జనరల్ డాక్టర్ డాగ్ హామర్షెల్డ్ నేడు విమాన ప్రమాదంలో మరణించారు. ఉత్తర రొడీషియాలోని ఎన్‌డోలాకు ఏడున్నర మైళ్ల దూరంలో ఆయన ప్రయాణం చేస్తున్న విమానం ప్రమాదానికి గురై కూలి పడింది.

19-9-61

మిత్రరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 16వ సమావేశం నేడు ఆరంభమైంది.

20-9-61

తాత్కాలిక శాంతి ఒడంబడికపై కటాంగా, ఐక్యరాజ్య సమితులు సంతకాలు చేశాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైశాల్యం	1,06,052 చదరపు మైళ్ళు
జనసంఖ్య	35,977,999*
పురుషులు	18,175,349*
స్త్రీలు	17,802,650*
సగటు వర్షపాతం	35.65"
అరణ్య ప్రదేశం	1,40,26,000 ఎకరాలు
జిల్లాలు	20
తాలూకాలు	189
రెవిన్యూ సర్కిళ్లు	1,000
పట్టణాలు	223
గ్రామాలు	28,945
పంటలక్రింది ప్రదేశం 58_59	2,73,02,000 ఎకరాలు
కౌళ్ళ సంఖ్య	42,45,832
1958_59 లో నీటి పారుదలను పొందిన ప్రదేశం ...	86,29,000 ఎకరాలు
1958_59 లో వుత్పత్తి అయిన ఆహారధాన్యాలు ...	61.56 లక్షల టన్నులు
పాల వుత్పత్తి	15.5 లక్షల గాలన్లు
రైలు మార్గాలు	3009.13 మైళ్ళు
జాతీయ రహదార్లు	1,415 ,,
రాష్ట్ర రహదార్లు	3593 ,,
జిల్లా పెద్ద రోడ్లు	8220 ,,
జిల్లా ఇతర రోడ్లు	2852 ,,
గ్రామాల రోడ్లు	3442 ,,
పాఠశాలలు	36,375
కళాశాలలు 1959_60	113
వృత్తి విద్యా కళాశాలలు	36
తృతీయ పంచవర్ష ప్రణాళిక ప్రమాణం రూ.	305 కోట్లు

1961–62 బడ్జెటు:

ఆదాయం ...	రూ. 85.12 కోట్లు
వ్యయం ... ... ,,	87.62 ,,
పెట్టుబడి ఖర్చు ... ... ,,	34.55 ,,

